thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 1 కరీంనగర్ గురువారం, 13 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇన్వెస్ట్ మెంట్స్ గురించి మోదీ కీలక వ్యాఖ్యలు..

భారతదేశంలో పెట్టుబడుల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియాలో పెట్టుబడులకు ఇది అత్యంత అనుకూల సమయమని ప్రధాని అన్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన ఇండియా ఫ్రాన్స్ ఫోరమ్‌లో ప్రసంగించిన క్రమంలో పేర్కొన్నారు. 2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారతదేశం' అనే లక్ష్యంతో ఇండియా ప్రస్తుతం పని చేస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా వ్యాపారవేత్తలు తమ పెట్టుబడులను భారతదేశంలో పెట్టేందుకు ఇది మంచి అవకాశమని ప్రధాని సూచించారు. ఈ క్రమంలో ఫోరమ్‌లో పాల్గొన్న కంపెనీలను ఆహ్వానించారు ప్రధాని.




# తెలంగాణకు అన్నదాతలే ఆత్మ

## మహాలక్ష్మి స్కీం గేమ్ చేంజర్

### రైతుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం -వరి సాగులో మన రాష్ట్రమే టాప్

### రైతుల కోసం ప్రత్యేకంగా కమిషన్ - రూ. 25 వేల కోట్లతో రైతు రుణమాఫీ

### స్కిల్ వర్సిటీతో యువత నైపుణ్యం పెంచుతున్నం : అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి అన్నదాతలే ఆత్మ అని, రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రైతుల స్వేదం, కష్టం మనలను పోషిస్తోందని చెప్పారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని అన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వడం సత్ఫలితాలను ఇస్తోందని చెప్పారు. రూ. 25 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12 వేల చొప్పున వారికి అందిస్తున్నాం. రైతు నేస్తం అమలు చేస్తున్నామని అన్నారు.

**మహాలక్ష్మి గేమ్ చేంజర్...**రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు పథకానికి రూ. 5,005 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. ఉచితంగా రూ. 500 సిలిండర్ ఇస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

మహిళా సంఘాలతో ఇందిరా శక్తి క్యాంటిన్ లు ఏర్పాటు చేశాం. మహిళా సంఘాలకు యూనిఫాంలు కుట్టే అవకాశం కల్పించామని చెప్పారు. మరోవైపు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతలో నైపుణ్యాన్ని పెంచుతున్నామని అన్నారు.

పేదకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. నిరుపేదలను అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రపంచ స్థాయి ఆటగాళ్లను తయారు చేసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. రాష్ట్రానికి రూ. 1.78 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం తీసుకొచ్చిందని.. ఆ పెట్టుబడుల ద్వారా 49,500 మందికి ఉపాధి లభించనుందని అన్నారు.

**గవర్నర్ స్పీచ్ లో గద్దర్, గూడ అంజన్న...** తెలంగాణ ఘనమైన సంస్కృతికి నిలయమని గవర్నర్ అన్నారు. గద్దర్, అంజయ్య వంటి ఎందరో ప్రజల కోసం కృషి చేశారని చెప్పారు. జయజయహే తెలంగాణ జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని గుర్తు చేశారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామని చెప్పారు. అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. జై హింద్, జై భారత్, జై తెలంగాణ నినాదాలతో గవర్నర్ తన ప్రసంగం ముగించారు.

# మార్చి 27 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

## 19న బడ్జెట్ : బిఏసీ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్ : మార్చి 27 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది. మార్చి 19న బడ్జెట్ ప్రవేశపెట్టనుంది ప్రభుత్వం. ఇవాళ ఉదయం గవర్నర్ ప్రసంగం తర్వాత బిఏసీ జరిగింది. తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. మంత్రులు, విపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీష్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి బిఏసీలో పాల్గొన్నారు. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. అలాగే మిత్రపక్షం సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు బిఏసీ కి వెళ్లారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు వీలైనన్ని ఎక్కువ రోజులు సభ నిర్వహించాలని విపక్షాలు కోరాయి. సంప్రదింపుల తర్వాత ఈనెల 27 వరకూ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 15 నుంచి 18వరకు కులగణనపై చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులపై సభ చర్చించనుంది. కృష్ణా జలాల హక్కు, రైతుల ఆత్మహత్యలు, రుణమాఫీ, రైతుభరోసా, స్థానిక సంస్థల నిధుల లేమి వంటి అంశాలే ప్రధాన ఎజెండాగా అసెంబ్లీ సమావేశాలు సాగనున్నాయి. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలుపిన తర్వాత కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. బుధవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ ప్రవేశపెడుతున్నామన్నారు గవర్నర్. ప్రజలే కేంద్రం పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారని, జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు.



అయితే గవర్నర్ ప్రసంగంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రసంగంలో అన్ని అబద్ధాలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో రుణమాఫీ, రైతు భరోసా, వరికి రూ. 500 బోనస్ ఇవ్వలేదని నినాదాలు చేశారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని, పంట బోనస్ ఇవ్వాలని పట్టుబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన మధ్యే గవర్నర్ ప్రసంగం ముగిసింది. గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం సమావేశాలను వాయిదా వేశారు.




హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరు నెలల తర్వాత ఇవాళ అసెంబ్లీకి వచ్చారు. గంట ముందు అసెంబ్లీకి వచ్చిన ఆయన నేరుగా ఎల్పీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. అనంతరం సభకు వచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగం పూర్తవగానే నేరుగా నందినగర్ లోని నివాసానికి వెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ బీఏసీ సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క బీఏసీ సమావేశానికి కూడా కేసీఆర్ హాజరు కాలేదు.

మొత్తంగా గవర్నర్ ప్రసంగం 40 నిమిషాలు జరగగా.. జాతీయ గీతం మొదలైనప్పటి నుంచి ప్రసంగం పూర్తయ్యే వరకు అసెంబ్లీలోనే ఉన్నారు. తర్వాత ఇంటికి వెళ్లిపోవడం గమనార్హం.

# ప్రతి హామీ నెరవేరుస్తున్నాం!

## అన్న మాట ప్రకారం ఉద్యోగాలు వస్తున్నాయి... ఇంకా వస్తాయి...

## రవీంద్ర భారతిలో నిర్వహించిన కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర కీలకమని, ముందుండి ఉద్యమాన్ని నడిపించారని సీఎం అన్నారు. విద్యార్థుల పేరు చెప్పి గద్దెనెక్కి విర్రవీగారని బీఆర్ఎస్ నేతలపై ఘాటు విమర్శలు కురిపించారు. కేసీఆర్ వల్ల 25 ఏళ్లకు ఉద్యోగం చేయాల్సినోళ్లు 35 ఏళ్లకు చేరారని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు సీఎం రేవంత్. నాలుగు ఉద్యోగాలు పీకేస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని చెప్పానని, అన్నట్లుగానే ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయని, ఇంకా వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. JL, పాలిటెక్నిక్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందజేశారు. జూనియర్ లెక్చరర్లుగా 1292 మందికి, అలాగే 240 మంది పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులకు నియామక పత్రాలు అందజేశారు. ఇందులో జెఎల్ ఉద్యోగాలలో 794 మంది పురుషులు, 498 మంది మహిళలకు అపాయింట్ మెంట్ లెటర్స్ అందజేశారు.

పాలిటెక్నిక్ లో పురుషులు 177, మహిళలు 63 మందికి నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర కీలకమని, ముందుండి ఉద్యమాన్ని నడిపించారని సీఎం అన్నారు. విద్యార్థుల పేరు చెప్పి గద్దెనెక్కి విర్రవీగారని బీఆర్ఎస్ నేతలపై ఘాటు విమర్శలు కురిపించారు.

**ఈ సందర్భంగా సీఎం కామెంట్స్..** ఈ ప్రజా ప్రభుత్వంలో మీ పాత్ర ఎంతైనా ఉంది. 12 ఏండ్లు మీ జీవితం వృద్ధాగా పోయింది. నేను బాధ్యత తీసుకున్నప్పటి నుంచి మీకోసమే పనిచేస్తున్నా. ఏడాదిలో ఇన్ని ఉద్యోగాలిచ్చిన చరిత్ర ఎక్కడైనా ఉందా. విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. భవిష్యత్తు పెట్టుబడి. ఏడాదిలో 57 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఇంట్లో ఉద్యోగం వస్తే ఆ కుటుంబం బాగు పడుతుంది.. ఆ ఊరిలో ప్రభావం చూపిస్తారు. విద్యా శాఖ ఆధారంగా తెలంగాణ భవిష్యత్తు ఆధారపడి ఉంది. గత పదేండ్లుగా విద్యారంగాన్ని, నిరుద్యోగులను నిర్లక్ష్యం చేశారు. ఒకమనిషి జీవితంలో ఎంత కోల్పోయాడో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలి. ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేపట్టినప్పటి నుండి ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. ప్రజలకు చెప్పండి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ జరుగుతోందని. గత ప్రభుత్వంలో పేపర్ లీకులతోనే సరిపోయింది. మెగా డీఎస్సీ వేసి రెండు నెలల్లోనే భర్తీ చేశాం. విద్యాశాఖను ప్రక్షాళన చేశాం.

దేశంలోనే విద్య శాఖ చివరి నుండి రెండో స్థానంలో వున్నాం. కేరళతో పోటీపడాల్సిన తెలంగాణ కిందది పడిపోవడం బాధాకరం. విద్యవస్థలో మార్పులు తెస్తున్నాం. ఉద్యోగం సాదించడంతోనే మీ పని పూర్తి కాలేదు. తెలంగాణాలో విద్యావ్యవస్థను పటిష్టం చేసే పనిలో నిమగ్నమవ్వాలి. కసితో పనిచేయండి.




గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో మీడియా తో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. గత 15నెలల పేలవమైన, అట్టర్‌ఫ్లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం గా కాకుండా గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు కాదు చాలా అబద్ధాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉంది' కేటీఆర్ తెలిపారు. 'రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోనని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.




## తెలుగు సినీ పరిశ్రమకు శుభవార్త.. ఏప్రిల్‌లో గద్దర్ అవార్డులు

హైదరాబాద్ : తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించిన అవార్డుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. ప్రభుత్వపరంగా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించగా.. దానికి గద్దర్ పేరు పెట్టగా సినీ పరిశ్రమ నుంచి ఆశించిన స్పందన లభించలేదు. అయినా కూడా రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట అవార్డులను ముందుకు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉండడంతో ప్రభుత్వం ఆ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే గద్దర్ పేరిట సినీ పరిశ్రమకు అవార్డులు ఇస్తామని.. దీనికి సంబంధించి షెడ్యూల్ కూడా ప్రకటించింది. గద్దర్ అవార్డులపై సినిమా అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్‌లో సినిమా అవార్డులు ఇస్తామని ప్రకటించారు. 'గద్దర్ అవార్డుల కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నియమ నిబంధనలను సిద్ధం చేసింది. 2014 నుంచి ప్రతి సంవత్సరం బెస్ట్ ఫిల్మ్ అవార్డు 2023 వరకు ఇస్తాం. నంది అవార్డుల నిబంధనలను అలాగే కొనసాగిస్తూ చిన్నచిన్న మార్పులతో గద్దర్ అవార్డులు ఇస్తున్నాం' అని దిల్ రాజు వివరించారు. ఏప్రిల్‌లో అవార్డుల ప్రదానం ఉందని ప్రకటించారు. 'గతంలో 2014 సింహా అవార్డులు అనుకున్నప్పుడు అప్లికేషన్ ఇచ్చినపుడు చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లింపులు అవుతాయి. వారంలో అవార్డులను జ్యూరీ తుది ఎంపిక చేస్తుంది. గద్దర్ అవార్డ్ నమూనా కూడా సిద్ధమవుతోంది. అవార్డులు ఎవరైనా ఇవ్వొచ్చు. ఫిల్మ్ ఛాంబర్ కూడా ఇస్తుంది. మనం ఏపని చేసినా 51 శాతం పాజిటివ్‌గా ఉండే చాలు. నెగిటివ్ ప్రచారాలు అనవసరం' అని దిల్ రాజు వివరించారు.

## మంత్రులు సభకు ప్రిపేర్ అయ్యి రావాలని కోరాం

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 27 వరకు కొనసాగనున్నాయి. బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశం అనంతరం ఈనెల 19న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలపై విపక్షాల నుంచి పలు కీలక అభ్యంతరాలు, డిమాండ్లు వెలువడ్డాయి. బీఏసీ సమావేశం అనంతరం బీఆర్ఎస్ నేత హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల పట్ల తమ అభిప్రాయాలను స్పష్టం చేస్తూ ప్రభుత్వ వైఖరిపై విమర్శలు చేశారు. కనీసం 20 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో డిమాండ్ చేశామని తెలిపారు. ప్రశ్నపత్రాలు లీక్ అయినట్లు.. అసెంబ్లీ బిజినెస్ కూడా ముందే లీక్ అవ్వడం గమనార్హమని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలకు మైక్ ఇవ్వొద్దని సీఎం స్వయంగా స్పీకర్‌ను బుల్డోజ్ చేస్తున్నట్లు ఆరోపించారు. అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి బీఆర్ఎస్‌కు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. రైతాంగ సమస్యలు, తాగునీరు, సాగునీటి సమస్యలపై ప్రత్యేకంగా చర్చించాలని కోరారు. వివిధ ప్రాజెక్టులు కూలిపోవడంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. మంత్రులు సభకు తగిన విధంగా సిద్ధం కావాలని సూచించారు. ప్రధాన డిమాండ్లు %డ% చర్చించాల్సిన అంశాలు బీఏసీ సమావేశంలో విపక్షాలు అసెంబ్లీలో చర్చించాల్సిన వివిధ ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను లేవనెత్తాయి.

## నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష భేటీ: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి.. రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ రాశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. "జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం" అని లేఖలో పేర్కొన్నారు.




## ఏసీ కోచ్‌లో ఎలుకలు.. ఇందుకేనా అంతడబ్బు చెల్లించానంటూ ప్రయాణికుడి ఫైర్!

దిల్లీ: రైళ్లలో అందించే ఆహారం నాసిరకంగా ఉందనో, టాయిలెట్‌లు బాలేదనో, రైళ్లు ఆలస్యమయ్యాయనో ప్రయాణికులు సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు చేస్తుండటం మనం తరచూ చూస్తుంటాం. కానీ, ఇటీవల ఓ ప్రయాణికుడికి ఏసీ కోచ్‌లో షాకింగ్ అనుభవం ఎదురైంది. సౌత్ బిహార్ ఎక్స్‌ప్రెస్‌లోని ఏసీ కోచ్‌లో ప్రయాణించిన ప్రశాంత్ కుమార్ అనే వ్యక్తి తన బెర్త్ వద్ద ఎలుకలు అటూ ఇటూ తిరగడం గమనించారు. అనంతరం అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగుచూసింది. దీంతో రైళ్లలో పరిశుభ్రత అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సౌకర్యంగా గమ్యస్థానానికి వెళ్లొచ్చనే ఉద్దేశంతో రూ.2వేలు చెల్లించి రైలులో సెకండ్ ఏసీలో టికెట్ బుక్ చేసుకున్న అతడు సీటు వద్ద ఎలుకలను చూసి కంగుతిన్నాడు. వెంటనే ఆ దృశ్యాలను రికార్డు చేసి సామాజిక మాధ్యమాల వేదికగా అధికారులకు ఫిర్యాదు చేశాడు. "పీఎన్ఆర్ నంబర్ 6649339230. రైలు నంబర్ 13288. ఏ 1 కోచ్‌లో కొన్ని ఎలుకలు సీట్లు, లగేజీలపై తిరుగుతున్నాయి. అంత డబ్బులు చెల్లించి 2 ఏసీలో టికెట్ కొన్నది ఇందుకేనా?" అని ప్రశ్నించారు. తన ట్వీట్‌ను కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్, ఐఆర్‌సీటీసీ, రైల్వేమంత్రిత్వశాఖ అధికారులు, మీడియా సంస్థలకు ట్యాగ్ చేశారు. ఈ పరిస్థితిపై తొలుత అతడు రైల్వే హెల్ప్‌లైన్ (139)ను సంప్రదించగా.. రైలులో సిబ్బంది పురుగు మందును పిచికారీ చేసినట్లు తెలిపారు. 'ఎక్స్'లో ఫిర్యాదు చేసిన అనంతరం ఆ కోచ్‌లో సీట్ల వద్ద క్లీనింగ్ చేశామని, లైజాల్‌తో వెట్ స్వీపింగ్ చేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు.

ఆ తర్వాత సీటింగ్ ఏరియా కింద దోమల నివారణ మందును స్ప్రే చేశారని.. సీటు కింద గ్లూ ప్యాడ్‌ను పెట్టామన్నారు.. మరోవైపు, ఈ వీడియో వైరల్‌గా మారడంతో నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. ఈ పరిస్థితిపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేయగా.. మరికొందరైతే భారతీయ రైల్వే ప్రయాణికులకు ఇదొక సాధారణమైన అనుభవమేనంటూ కామెంట్లు పెట్టారు. కొందరు సటైరికల్‌గా స్పందించగా.. మరికొందరు రైలులో ఎలుకలు ఉండటం వల్ల తలెత్తే తీవ్రమైన అనారోగ్య సమస్యలు, అపరిశుభ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.


## గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు: కేటీఆర్



హైదరాబాద్: అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్‌లా ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. "గవర్నర్ ప్రసంగంలో కొత్త విషయాలు చెబుతారనుకున్నాం. రైతులకు భరోసా ఇస్తారని భావించాం.

20 నుంచి 30 శాతానికి మించి రైతులకు రుణమాఫీ జరగలేదు. కానీ.. పూర్తిగా చేసినట్లు గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు. ఈ ప్రసంగంతో ఆయన స్థాయిని తగ్గించారు. సీఎం రేవంత్ చేతకానితనం వల్ల అనేక ఎకరాలకు నీరు అందడం లేదు. 20 శాతం కమీషన్ తప్ప.. విజన్ లేని ప్రభుత్వమిది. సాగునీటి సంక్షోభం, రైతుల ఆత్మహత్యలపై గవర్నర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కాంగ్రెస్ చేసిన అప్పుల గురించి ప్రస్తావన లేదు. దిల్లీకి మూటలు పంపేందుకే ఈ ప్రభుత్వం ఉంది" అని కేటీఆర్ విమర్శించారు.

## సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఇద్దరు యూట్యూబర్‌లు అరెస్ట్




హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వప్రసాద్ మీడియాకు వెల్లడించారు. "నిప్పు కోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎంను తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు.

పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించాం. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. కేసు దర్యాప్తు చేసి ఆ టీవీ ఛానెల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశాం. టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి రెండు ల్యాప్ టాప్‌లు, రెండు హార్డ్ డిస్కులు, ఒక లోగో, ఒక రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నాం. రేవతిపై గతంలో బంజారాహిల్స్, ఎల్‌బీనగర్‌లో కేసులు ఉన్నాయి" అని అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

## కేసీఆర్ శాసనసభకు వస్తే అదో అపూర్వ ఘట్టం!



జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పాలనుకున్న ఓ పార్టీ అధినేత, ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి శాసనసభ సమావేశాలకు హాజరుకాకపోవడం చట్ట సభలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, ముఖ్యంగా తనని ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నియోజకవర్గం ప్రజల పట్ల గౌరవం, బాధ్యత లేనట్లుగానే భావించాల్సి ఉంటుంది. ఇక్కడ జగన్, అక్కడ కేసీఆర్ ఇద్దరి తీరు ఒక్కలాగే ఉంది. ముఖ్యమంత్రిగా పదవి అధికారం చేతిలో ఉంటేనే శాసనసభకు వస్తాం లేకుంటే లేదనే ఇటువంటి నాయకులకు, ఎన్నికలలో ప్రజలే తగిన బుద్ధి చెపితేనే మళ్ళీ ఎవరూ ఈవిదంగా వ్యవహరించరు. కేసీఆర్ శాసనసభ సమావేశాలకు రాకపోవడంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమన్నారంటే, "నెలనెలా ప్రభుత్వం నుంచి జీతభత్యాలు తీసుకొంటూ పనిచేయని ఎమ్మెల్యే ఎవరైనా ఉన్నారంటే ఒక్క కేసీఆర్ మాత్రమే," అని అన్నారు. ఉద్యోగులు సెలవులు పెడితే వారి జీతాలలో కోత విధిస్తారు. మరీ ఎక్కువైతే ఉద్యోగంలో నుంచి సస్పెండ్ కూడా చేస్తారు. కానీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఎందుకు ఈ మినహాయింపు? కేసీఆర్ దాదాపు ఏడాదిపైగా శాసనసభ సమావేశాలకు వెళ్ళకుండా ఫామ్‌హౌస్‌లో కూర్చొని రేవంత్ రెడ్డికి, మంత్రులకు పనిచేయడం చాతకాదు. అనుభవం లేదు. జ్ఞానం లేదు. కనీసం కామన్ సెన్స్ లేదంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. కనుక దమ్ముంటే శాసనసభకు వచ్చి తమని ఎదుర్కోవాలని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సవాలు చేస్తున్నారు. కానీ ఇంతకాలం రాలేదు. ఇవాళ్ళ వచ్చారు. ఆయన శాసనసభ సమావేశానికి వచ్చినప్పుడు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎదురేగి ఆయనకు పూల బొకేలతో ఘనంగా స్వాగతం చెప్పి సాధారంగా లోనికి తోడ్కొని తీసుకువెళ్ళారు. ఇది చాలా సహజమే అనిపించవచ్చు. కానీ తాను శాసనసభకు రావడమే ఓ అపూర్వ ఘట్టమన్నట్లు సీన్ క్రియేట్ చేశారనిపిస్తుంది కూడా! రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి అయ్యుండి ఏడాదిగా శాసనసభకు మొహం చాటేసినందుకు కేసీఆర్ సిగ్గుతో తలదించుకోవాలి. ఇంతకాలం రానందుకు స్పీకర్‌కు సంజాయిషీ ఇచ్చుకోవాలి. అహం పక్కన పెట్టి సభ్యులకు క్షమాపణ చెప్పాలి. కానీ కేసీఆర్ చాలా నేర్పుగా ఇలా ఘనంగా స్వాగతం పలికించుకొని, "ఇంతకాలం శాసనసభకు ఎందుకు రాలేదని" అడగాలనుకున్నవారు కూడా 'కేసీఆర్ శాసనసభకు వచ్చారు' అని చెప్పుకునేలా చేశారు. ఏది ఏమైతేనేమి కేసీఆర్ శాసనసభకు వచ్చారు. కానీ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ప్రతీరోజూ రాకపోవచ్చునని తెలుస్తోంది. అదే నిజమనుకుంటే, అనర్హత వేటు పడకుండా హాజరు వేయించుకునేందుకే వచ్చారని భావించాల్సి ఉంటుంది.



## మత్తులోకి దించి, మహిళతో అసభ్యంగా ఫొటోలు.. మిర్యాలగూడలో భారీ మోసం

మిర్యాలగూడ: నల్గొండ జిల్లా మిర్యాలగూడలో అటవీశాఖ విశ్రాంత ఉద్యోగిని బ్లాక్ మెయిల్ చేసి రూ.46 లక్షలు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కారు, 4.5 తులాల బంగారం, 10 ప్రామిసరీ నోట్లను మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను డీఎస్పీ రాజశేఖర్ బుధవారం మీడియాకు వెల్లడించారు. తిరుమలగిరి మండలం గట్టుమీద తండాకు చెందిన ఆంగోత్ గణేశ్ గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లను చోరీ చేసేవాడు. విశ్రాంత అధికారి గతంలో త్రిపురాం మండలం రాగడప బీట్ అటవీశాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసే సమయంలో నిందితుడు పరిచయం అయ్యాడు. అదును కోసం ఎదురు చూశాడు. 2022 జూన్ 11న సూర్యాపేట వెళ్లి.. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. విశ్రాంత అధికారి పూర్తిగా మద్యం మత్తులోకి జారుకున్న తర్వాత.. డబ్బులు ఆశ చూపి ఓ మహిళను తీసుకొచ్చి, ఇద్దరినీ అసభ్యకర భంగిమల్లో ఫొటోలు, వీడియోలు తీసి దగ్గర పెట్టుకున్నాడు. అనంతరం వాటిని చూపుతూ.. కుటుంబ సభ్యులకు తెలుపుతానంటూ బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజటం మొదలు పెట్టాడు. డబ్బులు వడ్డీకి తీసుకున్నట్టుగా 19 ప్రామిసరీ నోట్ల మీద అధికారి సంతకాలు తీసుకొని వాటిని బాధితుడి కుమార్తె, అల్లుడికి చూపించి రూ.46 లక్షలు తీసుకున్నాడు. అప్పనంగా వస్తున్న డబ్బులపై నిందితుడు గణేశ్ భార్య ప్రమీల ఆరా తీయడంతో భర్త నిర్వాకం బయటపడింది. మందలించాల్సింది పోయి.. మరింత డబ్బు గుంజాలని, తనకు బంగారు ఆభరణాలు చేయించాలని భర్తను ప్రోత్సహించింది. తన సోదరుడైన తిరుమలగిరి సాగర్ మండలం ఎల్లాపురం తండాకు చెందిన కుర్ర శంకర్‌కు విషయం చెవిలో వేయడంతో బావ దగ్గర నుంచి వీడియోలు, ఫొటోలు తీసుకున్న అతను సదరు అధికారిని బెదిరిస్తూ రూ. 2.55 లక్షలు వసూలు చేశాడు. నిందితులంతా.. బ్లాక్ మెయిల్ చేసి తీసుకున్న డబ్బులతో ఎర్టిగా కారు, బంగారం, విలువైన ఫోన్లు కొని జల్సాలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో రూ.3లక్షలు ఇవ్వాలని.. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించడంతో విసిగిపోయిన సదరు అధికారి విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలిపి బోరుమన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు బుధవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14లక్షల విలువైన కారు, నాలుగున్నర తులాల బంగారం, సెల్ ఫోన్, పది ఒరిజినల్ ప్రామిసరీ నోట్లు, 9 జిరాక్స్ ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకొన్నట్లు డీఎస్పీ తెలిపారు.

చురకలు





# కోడి.. తిందామా..వద్దా..

## గిరాకీలు లేక వెలవెలబోతున్న దుకాణాలు

హైదరాబాద్: చికెన్ గిరాకీ లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. గత 40 రోజుల నుంచి కస్టమర్లు తగ్గడంతో దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధిపై వస్తున్న వదంతుల నేపథ్యంలో వినియోగదారులు చికెన్ కొనడం తగ్గించారు. దీంతో యజమానులు తీవ్ర నష్టాలలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోజువారీగా వందల కిలోల చికెన్ అమ్ముడుపోయేది. ప్రస్తుతం పదుల సంఖ్యలో కూడా వినియోగం లేకపోవడంతో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. అసలు బర్డ్‌ఫ్లూ కోళ్లకు తాకిందా లేదా అనే విషయం నిర్ధారణ లేదు. కానీ వివిధ మాంధ్యమాలలో వస్తున్న వదంతులతో చికెన్ వాడకం తగ్గింది. ప్రతి రోజు దుకాణాలు తెరిచి ఉంచడమే కానీ గిరాకీ సరిగా ఉండడం లేదు. ఇలా అయితే దుకాణాలు నడుపడం కష్టమేనని పలువురు అంటున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, చందానగర్, శేరిలింగంపల్లి, మియాపూర్ హాఫీజ్‌పేట్ డివిజన్లలో పదిరోజుల నుంచి చికెన్ వాడకం తగ్గింది. వేలల్లో ప్రతి నెల దుకాణాల అద్దె కడుతున్నామని గిరాకీ లేకపోవడంతో అద్దె ఎలా చెల్లించాలని పులువురు అంటున్నారు. ఇలా అయితే తమ పొట్ట గడవడం కూడా కష్టంగానే మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.






## రన్యారావు స్మగ్లింగ్ కేసు సవతి తండ్రి మెడకు!

బెంగళూరు విమానాశ్రయంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులో డిఆర్ఐ అధికారులకు చిక్కిన కన్నడ నటి రన్యా రావు ప్రోటోకాల్ అధికారాలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై, గోల్డ్ అక్రమ రవాణా కేసులో ఆమె సవతి తండ్రి రామచంద్రరావు మెడకు చుట్టుకుంటోంది. కుమార్తెకు సహకరిండంలో రన్యారావు సవతి తండ్రి డిజిపి స్థాయి సీనియర్ ఐపిఎస్ అధికారి కె రామచంద్రరావు ప్రమేయం ఉందనే ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం మంగళవారం ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించింది.

ప్రోటోకాల్ ఉల్లంఘనలపై దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తాను నియమించింది. ఈ విచారణలో భాగంగా, బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం (కెఐఎ)లో పోలీసు అధికారుల లోపాలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై నేర దర్యాప్తు విభాగం (సిఐడి) దర్యాప్తునకు కూడా ఆదేశించింది. " రన్యారావు ప్రోటోకాల్ సంబంధిత సౌకర్యాలను పొందటానికి దారితీసిన వాస్తవాలు, పరిస్థితులను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి), ఐపిఎస్ కేడర్, కర్ణాటక రాష్ట్ర పోలీసు హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రామచంద్రరావు పాత్రను పరిశోధించడానికి ఏసీఎస్ గౌరవ్ గుప్తాను దర్యాప్తు అధికారిగా నియమించారు" అని ఉత్తర్వులో పేర్కొంది. దర్యాప్తు అధికారి వారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. బంగారం కడ్డీల అక్రమ రవాణాలో అరెస్ట్, ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను నిర్వహించడానికి రన్యారావు ప్రోటోకాల్ అధికారాలను దుర్వినియోగం చేసారని ఉత్తర్వులో పేర్కొన్నారు.. రన్యారావు దుబాయ్ నుండి వచ్చినప్పుడు రూ. 12.5 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారు కడ్డీలను తరలించినట్లు డిఆర్ఐ అధికారులు గుర్తించడంతో మార్చి 3న విమానాశ్రయంలో ఆమెను అరెస్టు చేశారు. భద్రతా తనిఖీలను తప్పించుకోవడానికి సీనియర్ ప్రభుత్వ అధికారులు, వారి కుటుంబాలకు విస్తరించిన అధికారిక ప్రోటోకాల్‌లను రన్యారావు దుర్వినియోగం చేసిందని అధికారులు ఆరోపించారు. ఈ అరెస్టు తర్వాత లావెల్లె రోడ్‌లోని ఆమె అపార్ట్‌మెంట్‌లో జరిగిన దాడిలో అధికారులు అదనపు మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు. బంగారం కడ్డీల స్మగ్లింగ్ ప్రక్రియలో ప్రమేయం ఉందనే ఆరోపణలపై రన్యా రావుకు సన్నిహితుడైన వ్యాపారవేత్త తరుణ్ రాజును డిఆర్.ఐ సోమవారం అరెస్టు చేసింది. బెంగళూరులోని ఒక ప్రముఖ హెూటల్ యజమానితో సంబంధం ఉన్న రాజును నగర కోర్టు డిఆర్.ఐ కి ఐదు రోజుల కస్టడీకి పంపింది. రన్యారావు అరెస్టుకు ముందు ఆమెతో కలిసి వ్యాపారవేత్త రాజు కూడా దుబాయ్‌కు వెళ్లాడని అధికారులు తెలిపారు. ఈ వివాదంపై ఐపీఎస్ అధికారి రామచంద్రరావు ఒక ప్రకటనలో తన దిగ్భ్రాంతి, బాధను వ్యక్తం చేశారు. ఇటీవలి పరిణామాలతో షాక్ తిన్నానని, రన్యారావు తనకు తెలియకుండా పెళ్లి చేసుకుని వెళ్లిపోయిందని కూడా వ్యాఖ్యానించారు. అయినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని రామచంద్ర అన్నారు.

## అమెరికా-కెనడా మధ్య ముదిరిన వాణిజ్య యుద్ధం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , పొరుగుదేశం కెనడా మధ్య వాణిజ్య సంబంధాలు మరింత ఉద్రిక్తతకు దారి తీసాయి. ఇటీవల అమెరికా 25% టారిఫ్ విధించిన నేపథ్యంలో దీనికి ప్రతిగా సరిహద్దుల్లోని అమెరికా సంయుక్త రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్న కెనడాలోని ఒంటారియో విద్యుత్‌పై ఎగుమతి సుంకాలను 25% పెంచుతున్నట్లు ప్రకటించింది. దీనిపై ట్రంప్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కెనడా చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు.


**– ట్రంప్ హెచ్చరిక**... ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ నిర్ణయంపై ట్రంప్ మండిపడుతూ కెనడాను అతిపెద్ద సుంకాల దుర్వినియోగదారుగా అభివర్ణించారు. "కెనడాకు అమెరికా సబ్సిడీ ఇకపై అందుబాటులో ఉండదు. మాకు మీ కార్లు, కలప, విద్యుత్తు, ఇంధనం ఏవీ అవసరం లేదు. ఈ విషయం త్వరలోనే మీకు అర్థమవుతుంది" అని ఆయన హెచ్చరించారు. కాగా ప్రస్తుతం అమెరికా అత్యధిక ఇంధనాన్ని కెనడా నుంచే దిగుమతి చేసుకుంటోంది. ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, హైడ్రో పవర్, సహజ వాయువు, ఎలక్ట్రిసిటీ పరంగా యూఎస్ పెద్ద మొత్తంలో కెనడాపై ఆధారపడి ఉంది.

**–కెనడా ప్రతిస్పందన...** అగ్రరాజ్యం తమపై విధించిన సుంకాల నిర్ణయానికి ప్రతీకారంగా, ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ సవాలు విసిరారు. "అమెరికా విధిస్తున్న సుంకాలకు మేము నిరసన వ్యక్తం చేయకుండా ఊరుకోము. విద్యుత్ సరఫరాపై కొత్త చర్యలు తీసుకుంటాం. ఒంటారియోతో మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌కు ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాం. మా ఇంధన వనరులపై అమెరికా ఎంతగా ఆధారపడిందో త్వరలోనే వారికి అర్థమవుతుంది" అని ఆయన హెచ్చరించారు.

ఇంతేకాదు అమెరికా పానీయాలను తమ స్టోర్లలో విక్రయించకూడదనే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలు కెనడా–అమెరికా వాణిజ్య సంబంధాలపై భారీ ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. వాణిజ్య యుద్ధం మరింత ముదిరే అవకాశముండటంతో, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎలా మలుపు తిరుగుతాయో చూడాల్సి ఉంది.

# అసెంబ్లీలో జగన్ "బొమ్మ" మోజును

## బయటపెట్టిన లోకేష్.. ఇక బొమ్మలు లేని యూనిఫాంలు..



వైసీపీ ప్రభుత్వంలో ప్రతీ పథకంలోనూ జగన్ మార్కు ఉండేలా చూసుకున్నారు. అయితే వైఎస్ఆర్ ఫొటో లేదంటే జగన్ ఫొటోలు ఉండేలా వస్తువులను తీర్చిదిద్దారు. జగన్ తన ఫొటోలను ప్రభుత్వం అందించే స్టేషనరీ వస్తువులపై ముద్రించుకునేవారు, వీటిని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేవారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి దానిపై తన చిత్రాలను ముద్రించుకోవడంపై టీడీపీ ఎన్నోసార్లు విమర్శించింది. ఈ అంశాన్ని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తాజాగా వాటిని చూపిస్తూ వివరంగా చర్చించారు.

లోకేశ్ అసెంబ్లీలో జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసిన పెనట్ బర్ఫీ, స్కూల్ బ్యాగ్, నోటుబుక్స్, ఇంకా గుడ్లను ప్రదర్శించారు. వీటి మీద అన్నింటిపైన జగన్ ఫొటో ముద్రించబడి ఉంది. ఆఖరుకు కోడిగుడ్లపై కూడా జగన్ ఫొటో ముద్రించారని లోకేష్ ఎద్దేవా చేశార. విద్యార్థులకు పంపిణీ చేసే స్కూల్ బ్యాగులు, నోటుబుక్స్‌పై తన చిత్రాలను ముద్రించుకోవాలనే మోజు జగన్‌కు ఎక్కువగా ఉందని లోకేష్ విమర్శించారు.

ఇటువంటి ప్రచారం సాధారణ ప్రజలకు అసలు ఆమోదయోగ్యం కాదని ఆయన అన్నార. జగన్ "బొమ్మ" మోజుపై లోకేష్ చేసిన కామెంట్ల వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై టీడీపీ శ్రేణులు విమర్శలు గుప్పిస్తుండగా.. వైసీపీ శ్రేణుల కౌంటర్ ఇస్తున్నాయి. అసెంబ్లీలో లోకేశ్ చేసిన ఈ ప్రదర్శన వీడియో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇకనుండి ఎన్డీఏ ప్రభుత్వం ఏపీలో అసలు బొమ్మలు లేని కొత్త స్కూల్ యూనిఫామ్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ఎలాంటి రాజకీయ గుర్తులు ఉండవు. ఇది పూర్తిగా తటస్థమైన ఆకుపచ్చ రంగులో రూపొందించబడింది. విద్యా వ్యవస్థను పూర్తిగా రాజకీయాల నుండి దూరంగా ఉంచడంలో లోకేశ్ ఎంతో దృఢంగా ఉన్నానని ఈ చర్య ద్వారా నిరూపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, జగన్ ఫొటో ఉన్న ఈ సరఫరాలను తొలగించవచ్చు. అయితే ఆయన ఒక రాష్ట్ర నాయకుడిగా ఆలోచించి, ప్రజా ధనాన్ని వృథా చేయకుండా, వాటిని పిల్లలకు పంపిణీ చేయాలని అనుకున్నారు. కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని గమనించి, విద్యా మంత్రి నారా లోకేష్ దీని పై కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. లోకేష్ సూచనలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలకు కొత్త యూనిఫార్మ్ రూపొందించబడింది. ఇది పూర్తిగా రాజకీయ ప్రభావం లేకుండా రూపొందించబడింది. ఈ కొత్త యూనిఫార్మ్‌కు రాజకీయ రంగులు లేకుండా, తటస్థ గ్రీన్ కలర్‌తో ఆకర్షణీయంగా డిజైన్ చేయబడింది. రాష్ట్రంలోని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలల స్థాయిలోనే దీని రూపకల్పన చేయబడింది.

ముఖ్యంగా ఈ కొత్త యూనిఫార్మ్‌లో ఎలాంటి రాజకీయ గుర్తులు లేదా రాజకీయ నాయకుల చిత్రాలు లేవు. జగన్ పాలనలో బ్యాగులు, కిట్లు ఆయన ఫోటోతో ఉండే పరిస్థితి నుంచి ఇది పూర్తిగా భిన్నంగా ఉంది. ఆ వ్యూహం వైసీపీకి విఫలమైందని చెప్పడంలో సందేహం లేదు. అయితే టీడీపీ దీని నుండి పాఠం నేర్చుకుని, తగిన చర్యలు తీసుకుంది. లోకేష్ ఇప్పటికే విద్యార్థులకు ఉత్తమ విద్యా విధానం , సహాయక వ్యవస్థ అందించేందుకు వాగ్దానం చేశారు. ఇప్పుడు ఆయన ఆ మాటను నిలబెట్టుకుంటున్నారు.

## సజ్జనార్ పైనే ఆరోపణలా? నిజమెంత?

తెలంగాణలో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది, ఇది రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారి తీసింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) వైస్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జన్నార్‌పై కొందరు ఆర్టీసీ ఉద్యోగులు అవినీతి ఆరోపణలు చేశారు. వినూత్న నిరసనకు దిగిన ఈ ఉద్యోగులు, ఆయన అవినీతికి సంబంధించి 9 పేజీల లేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపారు. సజ్జన్నార్ అంటేనే నిఖార్సైన పోలీస్ అధికారి, నేరస్తులకు అతడు సింహస్వప్నంగా మారిన వ్యక్తి.



వరంగల్ యాసిడ్ దాడి కేసు, దిశ హత్య కేసుల వంటి అతి సంచలనాత్మక ఘటనల్లో నిందితులను తక్కువ సమయంలో పట్టుకున్నారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా ఆయన్ను తెలుగు ప్రజలు మరిచిపోలేరు. అలాంటి అధికారి మీద అవినీతి ఆరోపణలు రావడం రాష్ట్ర వ్యాప్తంగా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ ఆరోపణలపై టీఎస్ఆర్టీసీ సంస్థ తక్షణమే స్పందించింది. సంస్థ నిబంధనలను ఉల్లంఘించిన డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ గార్డులపై విచారణ జరిపిన సజ్జన్నార్, అక్రమ కార్యకలాపాలకు పాల్పడ్డ 400 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. తమ ఉద్యోగాలు కోల్పోయినవారే ఇప్పుడు నిరసనకు దిగుతూ సజ్జన్నార్‌పై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని సంస్థ పేర్కొంది. అంతేకాదు, ఈ ఉద్యోగుల దుష్టచర్యలకు సంబంధించిన వీడియోలను కూడా విడుదల చేసింది. ఏకంగా స్ట్రిక్ట్ ఐపీఎస్ ఆఫీసర్ మీదనే ఆరోపణలు చేసిన ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

## రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసు..

### భర్తను అరెస్ట్ చేయలేరా! కోర్టు ఏమంది?

కన్నడ నటి రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. బెంగళూరు విమానాశ్రయంలో స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన రన్యా అరెస్ట్ అయి విచారణను ఎదుర్కొంటోంది. నటి రన్యా రావు భర్త జతిన్ వి హుక్కేరి, ఆమె సవతి తండ్రి అయిన డీజీపీ పైనా విచారణ సాగనుందని కథనాలొచ్చాయి. అయితే రన్యారావు భర్త పై చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా ఎటువంటి బలవంతపు చర్యను ప్రారంభించవద్దని కర్ణాటక హైకోర్టు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌ని తాజా విచారణలో ఆదేశించింది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం అక్రమ రవాణాకు పాల్పడినట్లు తన భార్యపై నమోదైన కేసులో డిఆర్ఐ అరెస్టును నిరసిస్తూ జతిన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై ఏదైనా బలవంతపు చర్య తీసుకునే ముందు డిఆర్ఐ చట్టబద్ధమైన ప్రక్రియను పాటించాలని ఆదేశించాలని జతిన్ కోర్టును కోరారు. దీనిపై కోర్టు విచారించింది. నటి రన్యారావుపై వచ్చిన



ఆరోపణలను ఆమె భర్తతో ముడిపెట్టలేమని జతిన్ తరపు న్యాయవాది వాదించారు. డిఆర్ఐ అతనికి సమన్లు జారీ చేసినప్పుడు, రెండుసార్లు విచారణకు తీసుకెళ్లినప్పుడు కూడా ఆయన దర్యాప్తునకు సహకరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టాన్ని పాటించకుండా అరెస్టు చేసే అవకాశం ఉందని లాయర్ వాదించారు. న్యాయస్థానంలో చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా డిఆర్ఐ అధికారులు తనను పదే పదే విచారణకు హాజరు కావాలని డిమాండ్ చేస్తున్నందున చట్టవిరుద్ధమైన విధానంపై తాను అసంతృప్తి చెంది హైకోర్టును ఆశ్రయించానని జతిన్ వాదనలు వినిపించారు. సమన్లు జారీ చేయకుండా అధికారులు చట్టవిరుద్ధంగా నిర్బంధించడానికి పదే పదే ప్రయత్నిస్తున్నారని, తనను వేధిస్తున్నారని వాదించారు. భర్త జతిన్ కి రన్యారావుతో దీర్ఘకాలిక సంబంధాలేవీ లేవని, పెళ్లి తర్వాత బంధం మాత్రమే ఉందని కోర్టులో న్యాయవాది వాదనలు వినిపించారు. దర్యాప్తు పేరుతో తమకు అనుకూల ప్రకటనలు చేయించేందుకు డిఆర్ఐ జతిన్‌ని వేధిస్తోందని అతడి తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. పదే పదే మానసికంగా గాయం చేస్తున్నారని, వేధింపుల కారణంగా, పిటిషనర్ జతిన్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, దీనికారణంగానే కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని న్యాయవాది తెలిపారు.

చురకలు

## సంపాదకీయం

# అమెరికా ఆర్థిక వ్యవస్థను 'ట్రంప్' కూలుస్తున్నాడా?


అమెరికా ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత దేశం ఆర్థికంగా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. స్టాక్ మార్కెట్ రోజు రోజుకు కుంచించుకుపోతుండగా, ప్రధాన సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ భారీగా పడిపోతోంది. ఇప్పటి వరకు 300 లక్షల కోట్ల మేరకు స్టాక్ మార్కెట్ విలువ కోల్పోయింది. ఈ సంక్షోభం కొనసాగుతుందన్న భయంతో పెట్టుబడిదారులు కూడా వెనుకడుగు వేస్తున్నారు.

**ట్రంప్ నిర్ణయాలు.. అమెరికా కుప్పకూలేలా?...** ట్రంప్ పాలనలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై అనేక ఒత్తిడులు వచ్చిపడుతున్నాయి. ఆయన ప్రభుత్వ వ్యవహారాలను తన వ్యాపార సంస్థల మాదిరిగా నడిపించాలని చూస్తున్నారు. ఇది దేశానికి, ప్రపంచానికి తీవ్ర ముప్పుగా మారింది. పన్నుల విధానంలో చేసిన మార్పులు, ఇతర దేశాలపై ఆంక్షలు విధించడం, వాణిజ్య యుద్ధాలు మొదలుపెట్టడం లాంటి చర్యల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్ దెబ్బతినడం మొదలైంది. చైనా, ఇతర దేశాలతో వాణిజ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ గణనీయమైన దెబ్బ తగులుతోంది. పన్నుల భారంతో కంపెనీలు తమ పెట్టుబడులను తగ్గించుకోవడం, ఉద్యోగులను తొలగించడం వంటి పరిణామాలు అమెరికా పారిశ్రామిక రంగాన్ని మరింత దెబ్బతీశాయి.

**– అమెరికాలో మాంద్యం ముంచుకొస్తుందా?...** ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాను మాంద్యం అంచుకు తీసుకువెళ్తున్నాయి. ఉద్యోగుల తొలగింపు, వ్యాపారాల మూసివేత, పెట్టుబడుల క్షీణత – ఇవన్నీ అమెరికా ప్రజల జీవన స్థాయిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ ఖర్చులను తగ్గించాలని ట్రంప్ భావించడం వల్ల అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఒకప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థ నడిచే విధానం ప్రపంచ దేశాలపై ప్రభావం చూపేది. కానీ ప్రస్తుతం ట్రంప్ పాలనలో అమెరికా తన ప్రభావాన్ని కోల్పోతున్నది. ఒకప్పటి ప్రపంచ ఆర్థిక అగ్రశ్రేణి దేశం, ఇప్పుడు మాంద్యంతో పోరాడే స్థితికి చేరుకుంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

**– భవిష్యత్ పరిస్థితి ఎలా?...** అమెరికా తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలంటే స్థిరమైన వాణిజ్య విధానాలు, పెట్టుబడులకు అనుకూలమైన చట్టాలు, ప్రపంచ దేశాలతో పరస్పర సహకారం అవసరం. అయితే ట్రంప్ విధానాలు దీనికి విరుద్ధంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. అతని పాలన కొనసాగినంత కాలం అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ట్రంప్ తీసుకుంటున్న ఆర్థిక నిర్ణయాలు అమెరికా భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా తన గ్లోబల్ స్టేటస్‌ను కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. ఇది కొనసాగితే, అమెరికా మాత్రమే కాదు – మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# రాజకీయ సాహిత్య సవ్యసాచి బూర్గుల - మార్చి 13... బూర్గుల రామకృష్ణారావు జయంతి



అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయన న్యాయవాది, బహుభాషావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సాహితీ వేత్త. బహు భాషా కోవిదులు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసిన తొలితరం కాంగ్రెస్ నాయకులు. ఆయనే హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పనిచేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు. రామకృష్ణరావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు. బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు. 1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖులు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమం లోను పాల్గొని కారాగార వాసం అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్య మంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్య మంత్రిగా పేరుగాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఆయన అనేక భాషలలో నిష్ణాతులు. అవన్నీ ఆయన సొంతంగా, ఆసక్తితో నేర్చుకున్నవే. అర్ధరాత్రి వరకు ఫైళ్లలో నిమగ్నమై, తర్వాత బూర్గుల సంస్కృతంలో మునిగి తేలేవారు. బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికలో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్కృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరాచార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణ శతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం-మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మదగీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వ్మాయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించడమే కాకుండా ఎన్నో కావ్యాలకు పీఠికలు రాశారు. అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు. ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది. 1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండె పోటుతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు కోలాచలం - మార్చి 13....కోలాచలం శ్రీనివాసరావు జయంతి



ఆంధ్ర నాటక రంగానికి ఆధునిక తను ప్రసాదించిన వారిలో ఎన్నదగిన వారు కోలాచలం శ్రీనివాసరావు, ధర్మవరం రామ కృష్ణమా చార్యులు. ఆధునిక ఆంధ్ర నాటక రంగానికి విశిష్ట సేవలు అందించిన ఈ ఇరువురు బళ్ళారికి చెందిన వారే కావడం విశేషం. కోలాచలం శ్రీనివాసరావు (మార్చి 13, 1854 – జూన్ 20, 1919) ప్రముఖ న్యాయవాది. నాటక కర్త, నాటక శాల నిర్మాత, కవి, పరిశోధ కులు, బహు భాషా వేత్త, సంఘ సంస్కర్త, తెలుగు సాహిత్య సేవకులు. కోలాచలం శ్రీనివాసరావు తెలుగు నాట సాహిత్యానికి, తెలుగు నాటక రంగానికి చేసిన సేవ అనన్య సామాన్యం. అనితర సాధ్యం. తెలుగు నాటక కర్తలలో ఉత్తమ శ్రేణి నాటక కర్తగా ప్రసిద్ధులు, నాటక రచనా ప్రయోగాల్లో విజయం సాధించిన వారు. సంఘంలోని దురాచారాలను నిర్మూలించి సంఘ సంస్కరణం చేయడం, వినోదంతో పాటు ప్రజలకు నీతిని బోధించడం, హాస్యం సమ్మిళితం చేసి ప్రేక్షకుల హృదయాలను చూరగొనడం, వీటికి తోడు ప్రధానంగా ప్రజలకు చారిత్రక నాటకాల ప్రదర్శనవల్ల చరిత్ర తెలియ చేయాలన్నది ఆయన లక్ష్యాలు. చారిత్రక రచనలు, సంఘానికి సంబంధించిన రచనలు సమాజానికి అత్యవ సరమని భావించి ఆ దిశగా కృషి చేశారు. అందుకే ఆయన చారిత్రక నాటక పితామహునిగా పేరెన్నిక గన్నారు. తెలుగు నాటకరంగ అభ్యుదయ, వికాసాలకు తమ జీవితాన్ని అంకితం చేసిన కోలాచలం శ్రీనివాసరావు మల్లినాథ సూరి వంశీయులు. ఆయన పూర్వీకులు విజయనగర సంస్థాన పండితులు. నాటక సాహిత్యాన్ని స్వాధ్యయనం చేశారు. ఆయన 1854 సంవత్సరం, మార్చి 13న బళ్ళారి జిల్లాలోని హంపి వద్ద కమలాపురం గ్రామంలో అచ్చమ్మ, సేతుపతి శాస్త్రి దంపతులకు జన్మించారు. చిన్న వయసులోనే తెలుగు, కన్నడ, సంస్కృత మరియు ఆంగ్ల భాషలలో పట్టు సాధించారు. 1876లో ఎఫ్.ఏ పరీక్ష ఉత్తీర్ణులై, అనంత పురం జిల్లా గుత్తిలో రెవిన్యూ ఇన్స్పెక్టరుగా పనిచేశారు. 1881లో అనంతపుర మండలం డిప్యూటి కలెక్టరు దగ్గర దివానుగా ఉద్యోగం చేశారు. 1888లో జాతీ యోద్యమ పిలుపునందుకొని ఉద్యోగం వదిలి రెండవ తరగతి ప్లీడరు పరీక్షలో ఉత్తీర్ణుడై బళ్ళారి లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. అప్పటి నుండి ఆయన సాహితీ వ్యాసంగంకు అంకితం అయినారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా, నాటక కళ అంటే అత్యంత అభిమానం. రాసిన తళ్ళికోట యుద్ధంలో కీర్తి శేషుడైన రామరాజు కథ ఆధారంగా ఆయన రామరాజు చరిత్ర చారిత్రక రచన చేశారు. మైసూరు రాజ్యము, ప్రతాపాక్బరీయము కూడా చారిత్రక రచనలే. ఆయన భారతదేశం లోనే కాక ఇతర దేశాల నాటకాల చరి త్రలను పరిశోధించి ప్రపంచ నాటక చరిత్ర (ది డ్రమాటిక్ హిస్టరీ ఆఫ్ ది వర్ల్డ్) అనే గ్రంథాన్ని ఆంగ్ల భాషలో రాశారు. తెలుగులో సునందినీ పరిణయము, సుఖమంజరీ పరిణయము మొదలైన నాటకాలు రాశారు. తెలుగులో మొదటి చారిత్రక నాటకం రాసింది కూడా ఆయనే. భగవద్గీత 18 అధ్యాయా లు సవిమర్శగా పఠించి ప్రతి అధ్యాయాన్ని వచనంగా ప్రకటిం చారు. వ్యవహారిక భాషోద్యమానికి వ్యతిరేకుడు. చారిత్రక నాటకాలకు జీవం పోసి, ఆంధ్ర చారిత్రక నాటక పితామహు డన్న పేరు గాంచడమే కాకుండా, సుమనోరమా సభా నాటక సంస్థను స్థాపించిన, తెలుగు నేలపై ప్రప్రథ మంగా వాణీ విలాస నాటక శాలను బళ్లారిలో నిర్మించిన ఘనత కూడా ఆయనదే. దేశంలో తొలి ప్రపంచ నాటక చరిత్ర అనే గ్రంథం ఆంగ్లంలో రచించిన గొప్పతనం ఆయనకే చెందుతుంది భారతీయ. నాటక సాహిత్య నిర్మాతలలో ప్రాతః స్మరణీయులుగా నిలిచి పోయారు కోలాచలం శ్రీనివాసరావు. ఆయన , 1919 జూన్ 23న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రతిజ్ఞా పాలనలో లక్ష్యాన్ని ముద్దాడిన ఉద్ధం సింగ్ - మార్చి 13... జలియాన్ వాలాబాగ్ హంతకుడు డయ్యర్ ను హత మార్చిన రోజు




భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వారెందరో...అయితే అమర వీరుడు ఉద్ధం సింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అగణిత ప్రాణాలను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేత జాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగి పోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్య ఘట్టం. జలియన్ వాలా బాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయట పడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, పగ తీర్చుకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, విదేశానికి శ్రమకోర్చి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నర రూప రాక్షసుడైన డయ్యర్ ను హత మార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్దమ్ సింగ్ సాహసోపేత నేపద్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే 102 ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే. పంజాబ్, బెంగాల్ లో నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులుతున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్ లో), మొదలైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం ద్వారా తిరుగుబాట్లను అణిచి వేయడానికి వైస్రాయ్ లకు విశేష అధికారాలను కట్టబెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగుబాటు దారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టం పై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోట లో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశమవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైపుద్దీన్ కిచ్లూ లను అక్రమంగా నిర్బంధించడాన్ని వ్యతిరేకించడం. ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాల పాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలా వాటికి తాళాలు వేసి ఉన్నాయి. కాల్పుల కారణంగా వందలమంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయపడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారు. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్ సర్ లోని 1919 ఏప్రిల్ 13 న జలియన్ వాలా భాగ్ లో శాంతియుతంగా వేల మంది సామన్య పౌరులు సమావేశం అయి ఉండగా పోలీసులతో చుట్టుముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. షేర్ సింగ్ (ఉధం సింగ్) 1899 డిసెంబర్ 26 న పంజాబ్ లో సంగ్రూర్ జిల్లా సునం అనే గ్రామంలో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించాడు. తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్ లో జమ్ము రైల్వే క్రాసింగ్ కాపలాదారుగా జీవనం సాగించేవారు. షేర్ సింగ్ (ఉధం సింగ్ ) వారి తల్లి తండ్రులు చనిపోయాక అన్న ముక్తా సింగ్ తో కలిసి అమృత్ సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరాడు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉదం సింగ్ అనే పేరుని స్వీకరించాడు. మెట్రిక్యులేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియాన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడైన సింగ్ కూడా ఉన్నాడు. అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడంతో హత్యాకాండకు సూత్రధారి అయిన డై య ర్ను జెనరల్ మైకెల్ ఓ డయ్యర్ ను హతమార్చడానికి ప్రతీకారాన్ని ప్రతిన బూనాడు. భగత్ సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927 న భగత్ సింగ్ ఆదేశాల మేరకు విదేశాల నుండి తుపాకులు తెస్తూ పోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ వీరుడు భగత్ సింగ్ ను ఉరి తీయడం సింగ్ ను కలచి వేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని, పోలీసుల నిఘా నుండి తప్పించుకుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు. డయ్యర్ ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్సరాల తరువాత "మార్చి 1940 మార్చి 13 న" లండన్ కాక్స్ టన్ హాల్ లో డయర్ ని అందరు చూస్తుండగానే తుపాకీతో కాల్చి హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి తను చంపిన కారణాన్ని నిర్భయంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 న, ఓల్డ్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ , అతను మరణశిక్ష విధించాడు జూలై 31, 1940 న, ఉధమ్ సింగ్ ను లండన్ లోని పెంటన్ విల్లే జైలులో ఉరి తీసారు. అలా ఉధం సింగ్ ప్రతిజ్ఞను నెరవేర్చుకుని అమరుడైనాడు.

# భక్తి భావనను శక్తిగా మార్చే దైవం పానకాల నరసింహుడు - మార్చి 13...పానకాల నరసింహుని కళ్యాణం



ఆంధ్రప్రదేశ్ లో గుంటూరు జిల్లాలోని మంగళగిరి, భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో ఓ విశిష్ట స్థానం సంపాదించుకుంది. ప్రకృతి, పురాణం, పరమాత్మ పరస్పరం అల్లుకున్న ఈ పవిత్ర స్థలం పానకాల నరసింహ స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. భక్తి భావనను శక్తిగా మార్చే ఈ క్షేత్రం, నరసింహుని పంచముఖాలలో ఒక స్వరూపంగా నిలిచింది. దక్షిణ భారతదేశంలోనే ఎత్తైన గోపురాలలో ఒకటైన ఈ దేవాలయ గోపురం 153 అడుగుల (47 మీటర్లు) ఎత్తు, 49 అడుగుల (15 మీటర్ల) వెడల్పుతో పదకొండు అంతస్తులతో నిర్మించ బడింది. భక్తులు అభిమానంతో పిలుచుకునే పేరు 'పానకాల రాయుడు'. ఈ ఆలయంలో ఊహించని ఒక అద్భుతం జరగుతుంది. స్వామికి పానకం (బెల్లం, జీలకర్ర మిశ్రమం) నైవేద్యంగా సమర్పిస్తే, స్వామి నోటిలో పానకాన్ని పోసినప్పుడు "గుటక" శబ్దం వినిపిస్తుంది. ఇది స్వామి స్వయంగా పానకాన్ని గ్రహిస్తున్న శబ్దంగా భక్తులు భావిస్తారు. ఇది నిత్యకర్మల భాగంగా కొనసాగుతూ భక్తుల్లో భద్రత, శాంతి, భగవద్భక్తిని కలుగ జేస్తుంది. అంత మాత్రమే కాకుండా, ఆలయ గర్భగుడిలో ఎన్ని లీటర్ల పానకం పోసినా ఒక్క చీమ, ఈగ కూడా కనిపించదు. ఇది ఒక అద్భుత ధ్యాన స్థితిని తెలియజేసే దివ్య రహస్యం. మంగళగిరి ఒక అగ్నిపర్వతం అయినందున స్వామికి చల్లదనానికి పానకం సమర్పిస్తామని శాస్త్రీయంగానూ, లౌకికంగా కూడా భావన ఉంది. మంగళగిరిలో నరసింహ స్వామికి సంబంధించిన మూడు ఆలయాలు ఉన్నాయి. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం – కొండ కింద స్థితి. పానకాల నరసింహ స్వామి ఆలయం – కొండ మధ్యలో ప్రధాన ఆకర్షణ. గండాల నరసింహ స్వామి ఆలయం %–% కొండ శిఖరాన. గండాల స్వామి ఆలయంలో విగ్రహం లేదు, కానీ ఇది అపదర్పణ స్థానంగా భక్తులు కొవ్వొత్తులు వెలిగిస్తూ తమ కష్టాలు తొలగి పోవాలని ప్రార్థిస్తారు. ఇదే గుండెల్లో వెలిగే విశ్వాసానికి ప్రతిరూపం. పౌరాణిక వచనాల ప్రకారం, ఈ మంగళగిరి నరసింహుని స్థలం విశిష్టత గొప్పది. లక్ష్మీ దేవి ఇక్కడ తపస్సు చేసిన స్థలంగా గుర్తింపు పొందింది. నరసింహ స్వామి ఇక్కడ నముచి అనే రాక్షసుని సంహారం చేసినట్లు శాసనాలు చెబుతాయి. కృతయుగంలో అమృతం, త్రేతాయుగంలో ఆవునెయ్యి, ద్వాపర యుగంలో ఆవుపాలు, కలియుగంలో బెల్లపు పానకం...స్వామికి నైవేద్యాలుగా సమర్పించ బడ్డాయి. ఆలయంలో లోహంతో తయారైన స్వామి ముఖం మాత్రమే దర్శనమిస్తుంది, ఇది స్వరూప ధ్యానం నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. దేవాలయాన్ని పాండవ అగ్రజుడు ధర్మరాజు స్థాపించాడని స్థానిక చరిత్ర ఆధారంగా తెలుస్తోంది. దేవాలయ చరిత్ర బ్రహ్మ వైవర్త పురాణంలో నమోదు చేయబడింది. ఈ దేవాలయాన్ని విజయనగర పాలకులు పోషించారనడానికి గుర్తుగా దేవాలయ ప్రాంగణంలో దేవాలయాన్ని సందర్శించిన కృష్ణదేవరాయల కాలం నాటి శాసనం కూడా ఉంది. ఎత్తైన పదకొండు అంతస్తుల గాలి గోపురాన్ని 1807–09 కాలంలో నాటి ధరణికోట జమిందారు రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు నిర్మించాడు. మంగళగిరి ఆలయం ద్రావిడ శిల్పశైలిలో నిర్మించబడింది. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినది గాలిగోపురం – ఇది దక్షిణ భారత దేశంలో అతి ఎత్తైన గోపురాలలో ఒకటిగా గుర్తించ బడుతుంది. మణిమయమైన శిల్ప కళలు, స్థపతికళ ఈ ఆలయాన్ని విశిష్టంగా నిలబెడు తున్నాయి. పానకాల నరసింహుని దర్శించేవారు శ్రీ శంకరాచార్యులు కూడా 'కరావలంబన స్తోత్రం'లో భగవంతుని శరణు కోరినట్లు చరిత్ర చెబుతుంది. ఇది ఈ క్షేత్రానికి ఉన్న ప్రాముఖ్య తను బలంగా తెలియ జేస్తుంది. పానకాల నరసింహ స్వామి ఆలయం భక్తుల శ్రద్ధకు ప్రతీక. ఇది నమ్మకానికి, శాంతికి నిలయం, మోక్ష పథానికి మార్గదర్శి. కాలం గడుస్తున్నా, భక్తుల విశ్వాసం నిలిచి నంతకాలం ఈ ఆలయ చరిత్ర చీకటిని పారద్రోలే దీపంగా వెలుగుతుంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ చతుర్దశి నాడు స్వామివారి శ్రీ లక్ష్మీ సమేత నరసింహ స్వామి కల్యాణం ఘనంగా జరుగుతుంది. ఆ రోజున లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి అనుగ్రహాన్ని అందుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# పెండింగ్ పనులపై ఆశలు!

గోదావరిఖని : రాష్ట్రంలో త్వరలో స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా పుర, నగరపాలికల్లో పాత బిల్లులు చెల్లించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రామగుండం నగరపాలికలో కొన్నేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు మధ్యంతర బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదార్లు పనులు నిలిపివేశారు. ఆయా పనుల పూర్తికి ఎన్ని నిధులు అవసరమో ఆయా పుర, నగరపాలికలు గతంలోనే ప్రభుత్వానికి నివేదించినా పనులు జరగలేదు. తాజాగా పుర, నగరపాలికల ఎన్నికల్లోపు పాత బిల్లులు చెల్లించి పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**గుత్తేదారుల అనాసక్తి**

నగరంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించినప్పటికీ చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లు మిగతా పనులు చేపట్టడం లేదు. బకాయిల కోసం గుత్తేదార్లు ఏళ్లుగా ప్రాధేయపడుతున్నా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల నిర్వహించిన పలు అభివృద్ధి పనుల టెండర్లలో గుత్తేదార్లు పాల్గొనకపోవడం గమనార్హం.



**అన్ని అసంపూర్తిగానే..**

రూ.5 కోట్లతో గోదావరిఖని మల్కాపూర్ శివారులో అంబేద్కర్ విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి సుమారు ఆరేళ్ల క్రితం నిధులు కేటాయించారు. నాలుగేళ్ల క్రితం పనులు మొదలు కాగా.. మధ్యంతర బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులు మధ్యలోనే ఆపేశారు.

గోదావరిఖని నడిబొడ్డున సీనియర్ సిటిజన్ పార్కు, నగరపాలక పాత భవనాన్ని కూల్చి రూ.8 కోట్లతో సుమారు అయిదేళ్ల క్రితం బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం పనులు చేపట్టారు. రూ.2 కోట్ల వరకు పనులు పూర్తి చేసి వదిలేశారు.ఎన్టీఆర్‌నగర్‌లో రూ.4.5 కోట్లతో రెండున్నరేళ్ల క్రితం పనులు చేపట్టినా సమీకృత మార్కెట్ భవనం పునాదులకే పరిమితం అయింది. పిల్లర్ల కోసం వేసిన ఇనుప చువ్వలు తుప్పు పడుతున్నాయి.విఠల్‌నగర్‌లో సుమారు ఏడేళ్ల క్రితం రూ.4 కోట్లతో మొదలుపెట్టిన సమీకృత హోల్‌సేల్, రిటైయిల్ మార్కెట్ భవనాలు, రూ.1 కోటి వ్యయంతో చేపట్టిన సామాజిక భవనం పనులు చివరిదశకు చేరుకున్నాయి.


లక్ష్మీనగర్‌లో సుమారు రెండు దశాబ్దాల క్రితం దాదాపుగా రూ.8 కోట్లతో నిర్మించిన వాణిజ్య భవన సముదాయం నిరుపయోగంగా ఉండగా.. దానిపైన రూ.5 కోట్లతో మరో అంతస్తు నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు.సుమారు రెండు దశాబ్దాల క్రితం హనుమాన్‌నగర్‌లో చేపట్టిన స్వశక్తి భవనం పిల్లర్లకే పరిమితమైంది.

# ఆరుతడి వైపు.. అన్నదాత చూపు

కోనరావుపేట : జిల్లా మెట్టప్రాంతం కావడం.. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో సాగునీటి లభ్యత ఈ యాసంగిలో అంతంతమాత్రంగానే ఉంటోంది. వరిసాగుకు నీటి ఎద్దడి సమస్య ఏర్పడుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి ఎండిపోవడంతో జీవాలకు మేతగా మారుతోంది. పూర్తిస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని భావించిన పలువురు రైతులు యాసంగిలో మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న సాగుతో శ్రమ, పెట్టుబడి వ్యయం, నీరు, సమయం ఆదా అవుతుందని అన్నదాతలు చెబుతున్నారు. పంట మార్పిడితో భూమిలో పోషక విలువలు పెరిగి వానాకాలంలో సాగు చేసే పంటలకు మేలు జరుగుతుందని చెబుతున్నారు.

జిల్లాలో 1,775 ఎకరాల్లో మొక్కజొన్న సాగు...

జిల్లాలో 2.40 లక్షల ఎకరాల భూమి పంటల సాగుకు అనుకూలంగా ఉంది. యాసంగిలో రైతులు సాధారణ పంట వరి 1.78.350 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 1,775.23 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. సాగుకు ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి అవుతోంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 30కి పైగా అనుబంధ గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో 1,775 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలోనే ఏకంగా 100కు పైగా



ఎకరాల్లో సాగు చేశారు.

ఆదాయం బాగుంది నాకున్న ఐదు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నా. కొద్దిపాటి నీటి సౌకర్యం ఉన్న ఎకరం భూమిలో రెండు దశల్లో మొక్కజొన్న సాగుచేశా. మొదటి దశలో శివరాత్రి సమయానికి పంట చేతికి వచ్చింది. సుమారు రూ.60 వేలు సమకూరగా అన్ని ఖర్చులు పోను రూ.40 వేల ఆదాయం సమకూరింది. మరో పదిరోజుల్లో మిగతా పంట చేతికి వస్తుంది. పంట మార్పిడితో మెరుగైన దిగుబడి వస్తుంది.

సాసాల నాగరాజు, రైతు మంగళ్లపల్లి

ఆదర్శంగా మంగళ్లపల్లి

పంటల సాగులో జిల్లాలోనే మంగళ్లపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. ఒక్కో రైతు 5 నుంచి 10 ఎకరాల్లో పత్తి, ఎండు మిర్చి, కూరగాయాలు సాగు చేస్తుంటారు. యాసంగిలో మొక్కజొన్న సాగు చేయటంతో మంచి దిగుబడి వస్తుంది. పంట మార్పిడి చేయటంతో భూసారం పెరిగి పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. అన్నదాతలకు మెరుగైన ఆదాయం సమకూరుతుంది.

సందీప్ వ్యవసాయాధికారి కోనరావుపేట

# ఉపాధి కూలీలకు వసతులు కరవు



గంగాధర : జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతుంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 15 వేల మంది పనులకు హాజరవుతున్నారు.

**ఎండదెబ్బతో ముప్పు**

జిల్లాలో ఆయా గ్రామాల్లోని పని ప్రదేశాల్లో వడదెబ్బ తగిలి ఏటా ఆరెడుగురు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. అప్పుడు కూలీల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతోంది. ఉపాధి కూలీలు భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు (టెంట్లు)పంపిణీ చేసేది. ఏడేళ్ల నుంచి వాటి పంపిణీ పక్కన పెట్టింది. ఈ సారైనా వాటిని అందిస్తే కూలీలకు ఉపశమనం కలుగుతుంది.

**ఇంటి నుంచే తాగునీరు**

పని ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం లేక ఇళ్లనుంచే నీటి డబ్బాలు వెంట తెచ్చుకుంటున్నారు. మరికొందరు తడారిన గొంతులతో తల్లడిల్లుతున్నారు. పని ప్రదేశాల్లో నేల గట్టిగా ఉండటంతో.. భూమిని తడిపేందుకు ట్యాంకర్లతో నీరు పట్టే వెసులుబాటు ఉంటున్నప్పటికి అలా చేయడం లేదు. పదేళ్లుగా పనిముట్లు అందించడం లేదు. దీంతో కూలీలే ఎవరికి వారు పనిముట్లు తెచ్చుకుంటున్నారు.

అందుబాటులో లేని చికిత్స కిట్లు

పనులు చేసే సమయంలో కూలీలకు గాయాలు జరిగిన సందర్భంలో ప్రాథమిక చికిత్స కిట్లు సమకూర్చాలి. కిట్‌లో అయోడిన్, బ్యాండేజి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలు అందుబాటులో ఉంచాలి. ఎనిమిదేళ్లుగా వీటి పంపిణీ నిలిచిపోయింది. ఎండలు తీవ్రమైన వెంటనే గుడారాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో అధికారులు పేర్కొన్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

గ్రామ పంచాయతీలు: 313మొత్తం జాబ్ కార్డులు: 1,24,002 నమోదైన కూలీలు: 2,32,569100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలు: 3268

# పెద్దాసుపత్రిలో ఉక్కపోత



కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అత్యవసరంగా చికిత్స అందించడానికి పలు వార్డులతోపాటు ఆపరేషన్ థియేటర్, ఐసీయూల్లో సరిపడా ఏసీలు లేక.. ఉన్నదాంట్లో కొన్ని పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే అవకాశముండటంతో.. వీటిని మరమ్మత్తు చేయడంతోపాటు కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. కాలిన గాయాలతో వచ్చినవారు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఉన్నవి పనిచేయక**ఆసుపత్రిలో 15 పడకల ఐసీయూలు రెండున్నాయి. ఇందులో ఎనిమిది ఏసీలు అవసరముండగా.. 6 మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందులోనూ నాలుగు పని చేయడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పాతవి తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. 30 నుంచి 40 శాతానికి పైగా కాలిన గాయాలతో ఆసుపత్రికి వచ్చినవారికి రెండు గదులు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు, శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత ఉంచే వార్డులో ఐదు ఏసీలు అవసరముండగా కేవలం రెండే ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్‌లో నాలుగు ఏసీలు అవసరమున్నాయి.

**మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనూ ఇదే పరిస్థితి**

మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవ గదులు 6 ఉండగా.. అందులో రెండే ఏసీలు పనిచేస్తున్నాయి. ప్రసవం తర్వాత ఉంచే వార్డులో నాలుగు ఏసీలు, అత్యంత క్లిష్ట పరిస్థితులో ఉంచే బాలింతల వార్డులో మరో నాలుగుండాలి. నవజాత శిశువు సంరక్షణ కేంద్రంలో ఉన్నవి సరిగా పనిచేయడం లేదు. హెచ్‌డీయూలో కిటికీలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ఉక్కపోత నెలకొంది. రక్తనిధి కేంద్రంలో ఒక ఏసీ అవసరముంది.

**ఇబ్బందుల్లేకుండా చూస్తాం**

వేసవికాలం దృష్టిలో ఉంచుకొని రోగులకు ఇబ్బందుల్లేకుండా ఉండడానికి ఏసీల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఆసుపత్రిలోని అత్యవసర వార్డులన్నింటిలో కలిపి 40 ఏసీల వరకు అవసరమున్నాయి. జిల్లా కలెక్టర్‌కు నివేదించగా 30 ఏసీలు మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతానికి చల్లదనం ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.డా.వీరారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

# చుక్‌చుక్.. చకచకా

హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశలో చేర్చాల్సిన మూడు మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రూపకల్పన తుది దశకు చేరింది. దీని తయారీకి అవసరమైన భూసామర్థ్య పరీక్షలు, పర్యావరణ మదింపు అధ్యయనం, ట్రాఫిక్ సర్వేలు ఇప్పటికే పూర్తి చేశారు. అవసరమైన సందర్భంలో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు.

మెట్రో రెండోదశ మొదటి భాగంలో ఐదు కారిడార్లు ఉన్నాయి. వీటి డీపీఆర్‌లు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం ఇప్పటికే పంపించింది. ప్రజల నుంచి డిమాండ్లు రావడంతో రెండోదశ రెండో భాగంలో మరో మూడు మార్గాలను ప్రతిపాదించింది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట (21కి.మీ.), జేబీఎస్ నుంచి మేడ్చల్ (24 కి.మీ.) తోపాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీకి మెట్రోని ప్రతిపాదించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్, రావిర్యాల మీదుగా ఫోర్త్‌సిటీకి (40 కి.మీ.) ప్రతిపాదించింది. వీటి డీపీఆర్ ప్రక్రియనే ప్రస్తుతం మెట్రోరైలు అధికారులు రూపొందిస్తున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ ప్రక్రియను కొలిక్కి తీసుకొచ్చి ప్రభుత్వానికి నివేదించి.. మార్పులు చేర్పులు ఏమైనా సూచిస్తే వాటిని జోడించి తుది నివేదికను సిద్ధం చేస్తారు. ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ఈ ప్రక్రియను వేగిరం చేశారు.

**ఉమ్మడి భాగస్వామ్యంతోనేనా..?**

రెండోదశ మొదటి భాగం 76.4 కి.మీ.కు డీపీఆర్ ప్రకారం రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదించారు. కేంద్రం వాటా 18 శాతం, రాష్ట్రం వాటా 30 శాతంగా నిర్ణయించారు. 48 శాతం రుణాలు, 4 శాతం పీపీపీకి అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించారు.



రెండో దశ రెండోభాగంలో 85 కి.మీ.కు జేబీఎస్–శామీర్‌పేట, జేబీఎస్–మేడ్చల్ రెండు కారిడార్లు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతోనే నిర్మించేలా ఆర్థిక ప్రణాళిక ఉండనుంది. ఫోర్త్‌సిటీపై త్వరలోనే స్పష్టత రానుందని అధికారులు అంటున్నారు.

# రూ.కోట్లు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి

సిరిసిల్ల : రాష్ట్రంలోని మరమగ్గాల్లో సింహభాగం సిరిసిల్లలోనే ఉన్నాయి. అందుకే ప్రభుత్వశాఖలకు అవసరమైన వస్త్రోత్పత్తుల ఆర్డర్లు జిల్లా పరిశ్రమకు కేటాయించేందుకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ రంగంలో ఎప్పటికప్పుడు కొత్తఉత్పత్తులతోనే మనుగడ సాధ్యం. దీనికోసం టెక్స్‌టైల్‌పార్కులో 2006లో వస్త్రపరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు.. ఈ రంగంలో రాణించాలని ఆసక్తి ఉన్న కొత్తతరానికి శిక్షణనిచ్చేందుకు మరమగ్గాల సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులోనే పరిశ్రమలో ఉపయోగించే నూలు నాణ్యత పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించగా కేంద్రం ఇప్పుడు వృథాగా మారింది.

**యంత్రాలకు తుప్పు**

జిల్లాలో కార్మికులకు ఉపాధి నైపుణ్యాలు మెరుగుపరిచే ఉద్దేశంతో 2006లో టెక్స్‌టైల్ పార్కులో మరమగ్గాల సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అయిదేళ్లు ఉపకారవేతనాలతో కూడిన 21 రోజుల శిక్షణ అందించారు. దాని తర్వాత మారుతున్న వస్త్రోత్పత్తులు.. మరమగ్గాల్లో వస్తున్న మార్పులకు తగిన శిక్షణలేకపోవడంతో యువతలో ఆసక్తి తగ్గింది. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చే వస్త్రోత్పత్తుల ఆర్డర్లకు వినియోగించే నూలు నాణ్యతను పరిశీలించేందుకు రూ.2 కోట్లతో ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. పదిహేనేళ్లుగా సేవాకేంద్రం వినియోగంలేకపోవడంతో మరమగ్గాలు, ప్రయోగశాలలోని పరికరాలు తుప్పు పడుతున్నాయి. ఉన్న ఒక అటెండరు, టెక్నీషియన్ పార్కు పరిపాలన విభాగంలో పనిచేస్తున్నారు.

**వినియోగంలోకి తీసుకువస్తే...**

జిల్లాలో సాధారణ మరమగ్గాలకే డాబీ, జకార్డ్ నుంచి ఎలక్ట్రానిక్ జకార్ట్ అమర్చి ఆధునిక వస్త్రోత్పత్తులు చేపడుతున్నారు. నూతన ఉత్పత్తులు వచ్చిన ప్రతిసారి కార్మికులకు వృత్తి నైపుణ్యం తప్పనిసరి. ఉత్పత్తిలో మెలకువలు నేర్పించడంతోపాటు వాటిని మార్కెటింగ్ చేసే అవకాశాలపై సూచనల కోసం సేవాకేంద్రాన్ని వినియోగంలోకి తీసు



కొస్తే జిల్లా పరిశ్రమకు మేలు జరుగుతుంది. జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి. మరమగ్గాలు, నూలు నాణ్యతా పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తే సేవాకేంద్రం వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఈ రంగంలో రాణించేందుకు ఆసక్తి పెరుగుతుంది.

**కొత్త ఆర్డర్లకు శిక్షణ అవసరం**

జిల్లాకు ఏకరూప దుస్తులతోపాటు, మహిళా సంఘాలకు పంపిణీ చేసే చీరల ఆర్డర్లు వచ్చాయి. చీరలను డాబీ, జకార్డు పింజర్లు ఉన్న 16 వేల మర మగ్గాలపై ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక చేశారు. వీటికి ట్విస్టింగ్ నూలు వాడతారు. వీటికి జిల్లాలోఉన్న వార్పిన్ యూనిట్లపై ఈ నూలు రాదు. దీనికోసం ప్రత్యేక యంత్రాలు అవసరం. ఇప్పటికే పరిశ్రమలో వార్పిన్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. చీరల ఉత్పత్తికి ప్రభుత్వం నూలు కంపెనీలకు టెండర్లు పిలిచింది. ఒప్పందం జరిగితే కంపెనీలు నూలు సరఫరా చేస్తాయి. ఈ లోపు వార్పర్లకు మరమగ్గాలపై ట్విస్టింగ్ నూలుతో కార్మికులకు శిక్షణఇస్తే ఉత్పత్తిలో జాప్యం జరగదు. గతంలోనూ బతుకమ్మ చీరల ఆర్డర్ల సమయంలో డిజైన్లు మారినపుడు కార్మికులు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులోని నిపుణులను సిరిసిల్లకు రప్పించుకుని మెలకువలు తెలుసుకున్నారు.

# పదేళ్లయినా అసంపూర్తిగానే!

మల్లాపూర్ : వచ్చే రెండేళ్లలో గోదావరి పుష్కరాలు రానున్నాయి. గత పుష్కరాల సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం నిధుల మంజూరులో జాప్యంతో నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట గంగా గౌరీశ్వర దేవస్థానం దేవదాయశాఖ పరిధిలో ఉన్నప్పటికీ ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత పుష్కరాల సందర్భంగా గోదావరి నదిలో రెండు చోట్ల స్నానాల కోసం మెట్లు, ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు చేపట్టిన గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు



అర్ధాంతరంగా నిలిపివేశారు. మెట్ల నిర్మాణం పూర్తిచేసిన గుత్తేదారు ఆలయ నిర్మాణ పనులను మాత్రం స్లాబ్ దశలోనే వదిలేశారు.

మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట గ్రామంలో గంగా గౌరీశ్వర ఆలయ పునఃనిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో ప్రభుత్వం రూ.25లక్షల వ్యయంతో ఆలయాన్ని పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టింది. అదే సంవత్సరం జూన్ నెలలో గుత్తేదారు పనులు ప్రారంభించారు. దాదాపు రూ.13 లక్షల మేర పనులు పూర్తయ్యాయి. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి నిధుల కేటాయింపు జరిగింది. పదేళ్లు గడుస్తున్నా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆలయ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోవడంతో దర్శనానికి వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. భక్తులు అధిక సంఖ్యలో వస్తే గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి సైతం వీలులేని పరిస్థితి. భక్తులు స్నానాలు చేసే ఘాట్‌లో ప్రమాద హెచ్చరిక బోర్డులు, నీటిలో కొట్టుకుపోకుండా రక్షణ జాలీలను ఏర్పాటు చేయలేదు. నీటిలోకి దిగి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆలయ ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గుడి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి సౌకర్యాలు మెరుగుపరచాలని భక్తులు కోరుతున్నారు.

# జలం.. ఒడిసిపడితే పదిలం

పెద్దపల్లి : ఏటా జులై, ఆగస్టు నెలల్లో వరదలు.. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి ఇక్కట్లు.. ఇదీ కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో కనిపిస్తున్న పరిస్థితి. పల్లెలు, పట్టణాలు కాంక్రీట్ అరణ్యాలుగా మారిపోతుండగా నీటి సంరక్షణ చర్యలు కరవయ్యాయి. వర్షపు నీటిని నేలలోకి ఇంకించేందుకు కార్యాచరణ లేక ప్రతి సంవత్సరం సముద్రం పాలవుతోంది. నీటి వృథాకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా.. పొదుపు, సంరక్షణపై ప్రజల్లో చైతన్యం లోపిస్తోంది.

**అమలుకు నోచని నిబంధన**

పురపాలికలు, నగరపాలికలల్లో ఇంకుడు గుంత నిర్మిస్తామని హామీ పత్రం రాసిస్తేనే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్న నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. ఇంకుడు గుంత నిర్మాణానికి స్థలం విలువలో చదరపు గజానికి 10 శాతం చొప్పున రూ.2 వేలు బల్దియాకు చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని కూడా పట్టించుకున్న వారు లేరు.



**నిర్లక్ష్య ఫలితం**

వాల్టా(నీరు భూమి వృక్ష చట్టం) అమలులో అధికారుల నిర్లక్ష్యంతో విచ్చలవిడిగా బోర్లు తవ్వుతున్నారు.

రెవెన్యూ, పోలీసు, భూగర్భ జల శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేయాల్సి ఉండగా సమన్వయ లోపం కనిపిస్తోంది.

ఇంకుడు గుంతలు తవ్వి ఇంటి అవసరాలకు వినియోగించిన నీటిని అందులోకి మళ్లించాలి.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణంలో నిర్లక్ష్యమే కనిపిస్తోంది.

ప్రజా చైతన్యంలోనే ఫలితం

ప్రతి నీటి బొట్టునూ నేలలోకి ఇంకించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలి. ఇంటి ఆవరణలో కొంత స్థలాన్ని మొక్కలు, ఇంకుడుగుంతల నిర్మాణానికి కేటాయించాలి. ఉమ్మడి జిల్లాలో 1,48,878 ఇంకుడుగుంతలు నిర్మించారు. సాగు భూములు, అటవీ ప్రాంతాల్లో భూగర్భ జలాలను ఒడిసిపట్టేందుకు ఉపాధిహామీలో నీటి కుంటలు తవ్వుతున్నారు. పెద్దపల్లిలో 275, కరీంనగర్‌లో 368, జగిత్యాలలో 547, సిరిసిల్లలో 246 నిర్మించారు. వ్యవసాయ బోరు సమీపంలో కుంట నిర్మిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. క్షేత్ర స్థాయిలో చైతన్యం కల్పిస్తున్నా నిర్మించుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

ఏడాది పొడవునా నిండు కుండ

సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల వద్ద మానేరుపై నిర్మించిన చెక్‌డ్యాం ఏడాదంతా నిండు నిండను తలపిస్తోంది. గతంలో వాగులో బోర్లు తవ్వుకొని రైతులు సాగునీటిని తోడుకునేవారు. ప్రస్తుతం నీరు పైనే ఉండటంతో ఖర్చు తగ్గింది. మానేరుకు రెండు వైపులా ఉన్న పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో భూగర్భ జల మట్టం ఆశాజనకంగా ఉంది.

నీటి కష్టాలు తీరాయి

అయిదేళ్ల కిందట ఇంటిని నిర్మించాం. ఏటా వేసవిలో బోరులో నీరు లేక ఇబ్బంది పడేవాళ్లం. మూడేళ్ల కిందట ఇంకుడు గుంత తవ్వించగా అప్పటి నుంచి బోరులో సమృద్ధిగా నీరుంటోంది.

బొమ్మకంటి జ్యోతి, రంగంపల్లి, పెద్దపల్లి

అవగాహన కల్పిస్తున్నాం

ఇళ్లలో ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాలు, అటవీ ప్రాంతాల్లో కాంటూరు, సమతల కందకాలు, నీటి కుంటలతో భూగర్భ జలాలు పెరుగుతాయి. నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. నిషేధిత ప్రాంతాల్లో బోరుబావుల తవ్వకాలు చేపట్టరాదు. లావణ్య, భూగర్భ జల శాఖ అధికారి, పెద్దపల్లి

# విద్యుత్తు కనెక్షన్‌కు మొబైల్ నంబరు మార్పు సులువిక

హైదరాబాద్ : విద్యుత్తు వినియోగదారుల మొబైల్ నంబరు మార్పిడిని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సులభతరం చేసింది. గతంలో నంబరు మార్చుకోవాలంటే అప్పటికే రిజిస్టరై ఉన్న మొబైల్ నంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ) వచ్చేది. పాత నంబరు వినియోగంలో లేకపోతే ఇబ్బందులు తలెత్తేవి. విద్యుత్తు పంపిణీ సంస్థ అధికారిక ఐడీకి మెయిల్ పంపిస్తే కొత్త నంబరును అప్‌డేట్ చేసేవారు. ఈ ప్రక్రియను ఇప్పుడు డిస్కం సులభతరం చేసింది. టీజీసదరన్ పవర్ వెబ్‌సైట్ %https://tgsouthernpower.org%/ లోకి వెళ్లి సర్వీస్ నంబరు–మొబైల్ నంబరు లింక్‌ను క్లిక్ చేయాలి.



మొదట యూనిక్ సర్వీస్ మొబైల్ నమోదు చేయగానే ఎవరి పేరున విద్యుత్తు కనెక్షన్ ఉంది, ఇంటి చిరునామా వివరాలు వస్తాయి. అప్‌డేషన్‌లో ఛేంజ్ నంబరు కొడితే.. కొత్త నంబరు నమోదుచేయాలని సూచిస్తుంది. కొత్త నంబరుకే ఓటీపీ వస్తుంది. నమోదు చేయగానే కొత్త నంబరు అప్‌డేట్ అవుతుంది. విద్యుత్తు బిల్లులు సమాచారం, నిర్వహణ కోసం ముందస్తు షెడ్యూల్ చేసిన అంతరాయాల సమాచారం నేరుగా వినియోగదారుల మొబైల్‌కు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. ఫీడర్ల వారీగా వందశాతం మొబైల్ మ్యాపింగ్ కాకపోవడంతోనే చాలామందికి మొబైల్స్ అప్‌డేట్స్ రావడం లేదని చెబుతున్నారు.

# ఉస్మానియా వర్సిటీలో సీపీఎస్ 'లొల్లి'



హైదరాబాద్ : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొత్తగా చేరిన 330 మంది గ్రూప్–4 ఉద్యోగులకు, వర్సిటీ అధికారుల మధ్య కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) లొల్లి మొదలైంది. సీపీఎస్‌లో యాజమాన్య వాటా జమ చేయకుండా కేవలం తమ వేతనాల్లోంచే డబ్బు తీసుకోవడం సమంజసం కాదని, పైగా సీపీఎస్‌ను ఎల్ఐసీతో అనుసంధానం చేయడం తమకు ఇష్టం లేదంటున్నారు. తమకు మొత్తం జీతం ఇవ్వాలంటూ అధికారులను 3 నెలల నుంచి అభ్యర్థిస్తుంటే వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సీపీఎస్, వేతనాల విడుదల అంశాలపై ఓయూ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

**పింఛన్లు.. వేర్వేరు పద్ధతులు**

రాష్ట్రవ్యాప్త గ్రూప్4 ఉద్యోగుల్లో 20 శాతం మంది వర్సిటీల్లో విధులకు ఆసక్తి ప్రదర్శించగా గతేడాది డిసెంబరులో ప్రభుత్వం నియామకపత్రాలిచ్చింది. ఉస్మానియా, పొట్టిశ్రీరాములు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలు, జేఎన్‌టీయూలలో జూనియర్ అసిస్టెంట్లుగా చేరారు.

జేఎన్‌టీయూలో ఎల్ఐసీ సీపీఎస్‌ను జూనియర్ అసిస్టెంట్లకు వర్తింపజేస్తున్నారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయాలు ఎస్‌బీఐ సీపీఎస్‌ను అమలు చేస్తున్నాయి

కాకతీయ విశ్వవిద్యాలయంలో కొత్త పింఛన్ పథకం (ఎన్‌పీఎస్) అమల్లో ఉంది ఓయూ మినహా అన్ని విశ్వవిద్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్‌ల వేతనాల్లో 10 శాతం, వర్సిటీల యాజమాన్యం నుంచి 10 శాతం డబ్బును ఎల్ఐసీ, ఎస్‌బీఐ సీపీఎస్ విధానంలో పెడుతున్నాయి.

భవిష్యత్‌లో యూపీఎస్ శ్రేయస్కరం

కొత్త పింఛన్ విధానం (ఎన్‌పీఎస్) 2004 నుంచి అమలవుతుండగా.. వర్సిటీల్లోని బోధనేతర సిబ్బందికి ఎల్ఐసీ, ఎస్‌బీఐ అనుబంధ సీపీఎస్ విధానాన్ని వర్సిటీలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ను 2016–17లో ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఉద్యోగి వేతనం 10 శాతం, యాజమాన్య వాటా 14 శాతం ఉంటుంది. దీంతో యోగి వేమన, కాకతీయ విశ్వవిద్యాలయం సహా మరికొన్ని వర్సిటీలు ఎన్‌పీఎస్‌లోకి మారిపోయాయి. అయితే కొత్తగా చేరుతున్న ఉద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ స్థానంలో యూపీఎస్ (యూనిఫైడ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్)ను తీసుకువస్తోంది. ఈ పథకంలో ఉద్యోగుల వాటా 10 శాతం ఉంటే.. యాజమాన్య వాటా 18.25 శాతం ఉండనుంది. అయితే ప్రస్తుతం ఎన్‌పీఎస్ పింఛన్ పథకం ఉన్నవారికే ఇది వర్తించనుంది. భవిష్యత్తులో తాము నష్టపోకూడదంటే యాజమాన్య వాటాతోపాటు ఎస్‌బీఐ లేదా ఎన్‌పీఎస్ పథకంలో తమను చేర్చాలంటూ ఉస్మానియా వర్సిటీ గ్రూప్–4 ఉద్యోగులు అధికారులను కోరుతున్నారు.

# ఎల్ఆర్'ఎస్ అంటున్నా.. నిర్లక్ష్యమే



హైదరాబాద్: అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పథకాన్ని జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం చేస్తోంది. మార్చి నెలాఖరులోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం రెండు వారాల కిందట ప్రకటించింది. గడువు మూడు వారాల్లో ముగియనుంది. అయినా బల్దియా నిద్ర మత్తు వీడటం లేదు. దరఖాస్తుల పరిశీలన పురోగతిపై కేంద్ర కార్యాలయంలోని కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్ ఇప్పటివరకు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించలేదు.

**అటకెక్కిస్తే ఎవరికి ఆదాయం..**

ఎల్ఆర్ఎస్–2020 పథకంలో భాగంగా జీహెచ్ఎంసీకి లక్షకుపైగా దరఖాస్తులొచ్చాయి. వాటిని వేగంగా పరిష్కరించి, నెలాఖరులోపు అందరి నుంచి ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తద్వారా బల్దియాకు ఆదాయం సమకూరుతుంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలోని పలువురు సర్కారు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. సర్కారు రాయితీ ప్రకటన చేయగానే, హెచ్ఎండీఏ కమిషనర్.. ఉన్నతాధికారులు, కన్సల్టెంట్లు, స్ట్రక్చరల్ ఇంజినీర్లు, దరఖాస్తుదారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, సందేహాలను తీర్చారు. దరఖాస్తుదారుల కోసం ఓ టోల్ ఫ్రీ నంబరును ప్రకటించి, రోజువారీ నివేదికలు తీసుకుంటున్నారు. పాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయమై సర్కారుతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆరు జోన్లకు, ఆరు ప్రత్యేక ఫోన్ నంబర్లను ప్రకటించాలని సీసీపీ శ్రీనివాస్.. జోనల్ అధికారులను ఆదేశించగా.. వారు పట్టించుకోలేదు. సేవా కేంద్రాలను సవ్యంగా నిర్వహించడం లేదు.

అరకొరగా కొందరికి జీహెచ్ఎంసీ నుంచి ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించాలని సందేశాలు వెళ్తున్నాయి. అందులో 10 శాతం మంది రుసుము చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. వారినీ జీహెచ్ఎంసీ సవ్యంగా సమన్వయం చేసుకోలేకపోతోంది. ఫీజు చెల్లించిన వారి దరఖాస్తులను వారంలో పరిష్కరించాలని కేంద్ర కార్యాలయం సర్కిల్ అధికారులకు అధికారం అప్పగించింది. దరఖాస్తును ఆమోదించాక.. దరఖాస్తుదారులు వెబ్‌సైట్ నుంచి ఆమోదపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ సమస్యలు..: జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని దరఖాస్తుల పరిశీలనలో సాఫ్ట్‌వేర్ సమస్యలు తలెత్తుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఫీజు చెల్లించినా.. రసీదులు రావట్లేదని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అంగన్‌వాడీలకు మహర్దశ



కరీంనగర్ : చిన్నారుల భవిష్యత్తుకు బీజం పూర్వ ప్రాథమిక విద్య. ఆ విద్యకు నిలయాలైన అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాలకు చిరునామాగా నిలిచాయి. జిల్లాలో ఇప్పటికీ సగం కేంద్రాలకు సొంత భవనాలు లేవు. మరికొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీరు, ప్రహరీ లేకుండా ఉన్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు కోరింది. పూర్తి వివరాలతో కథనం. అసౌకర్యాల కారణంగా చిన్నారులను చేర్పించడానికి కొందరు తల్లిదండ్రులు వెనుకడగు వేస్తుండగా.. లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడానికి సుముఖత చూపడంలేదు. ప్రతిపాదనల్లో శిథిలావస్థలో భవన నిర్మాణాలకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలకు మాత్రమే అవకాశం కల్పించింది. కానీ విద్యుత్తు సౌకర్యం, ప్రహరీల నిర్మాణాలకు అవకాశం ఇవ్వలేదు.

**కనీస సౌకర్యాల కల్పనకు..**

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, ఇతర కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం జిల్లా నుంచి రూ.1,34,79,000తో ప్రతిపాదనలు కోరింది. జిల్లాలో 100 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని గుర్తించారు. అందుకుగాను ఒక్కోటి రూ.36 వేల చొప్పున రూ.36 లక్షలు, పూర్తిగా దెబ్బతిన్న 15 భవనాల మరమ్మతులకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షలు, తాగునీటి సౌకర్యం లేని 87 కేంద్రాలకు రూ.17 వేల చొప్పున రూ.14.79 లక్షలు కలిపి మొత్తంగా అన్ని కలిపి రూ.80.79 లక్షలతో ప్రతిపాదనలు తయారుచేసి పంపించినట్లు జిల్లా సంక్షేమ అధికారి సబిత కుమారి తెలిపారు.

జిల్లాలోని వివరాలు..

మొత్తం కేంద్రాల సంఖ్య : 777
సొంత భవనాలు : 307
అద్దెవి : 259
అద్దె లేని భవనాలు : 211
మరుగుదొడ్లు లేనివి : 100
తాగునీటి సౌకర్యం లేనివి : 87
విద్యుత్తు సరఫరాలేని కేంద్రాలు : 125
ప్రహరీ లేనివి : 463

# సర్వే పారితోషికం సంగతేమిటి?

కరీంనగర్ : జిల్లాలోని గ్రామాలు, మండలాలు, పురపాలికల పరిధిలో గతేడాది నవంబరు, డిసెంబరు నెలలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ స్టిక్కర్లు అందించి, కుటుంబ వివరాలను సేకరించారు. సుమారు 45 రోజులపాటు సర్వే చేశారు. పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ, పురపాలిక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మెప్మా రీసోర్స్ పర్సన్లు, సీవోలు, ఇతర సిబ్బంది ఇంటింటా తిరిగి వివరాలు నమోదు చేశారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. సమగ్ర సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికం ఇస్తామని ప్రకటించిన అధికారులు ఇప్పటికీ ఇవ్వలేదు. చిరు ఉద్యోగులు ఆ మొత్తం ఎప్పుడు వస్తుందా? అని ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.



**బ్యాంకు ఖాతాలు తీసుకున్నా..**

సర్వే చేపట్టిన సమయంలో ఎన్యుమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12 వేల చొప్పున ఆపరేటర్లకు పారితోషికం ఇస్తామని ప్రకటించారు. క్షేత్రస్థాయిలో తిరిగి.. సర్వే పూర్తయిన తర్వాత ఎంపీడీవోలు, కమిషనర్లు సిబ్బంది బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు. నాటి నుంచి ఈ డబ్బులు వస్తాయని ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకూ ఖాతాల్లో మాత్రం జమ కాలేదు. బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని రెండు నెలల కిందట అధికారులు పేర్కొన్నా స్పందన లేదని అంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపించి పారితోషికం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అనుమతిని చూపి.. పరిమితికి మించి


చొప్పదండి : జిల్లాలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సహజ వనరులు తరిగిపోతున్నాయి. కొన్నేళ్ల తర్వాత మట్టి గుట్టలు మైదానాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ అవసరాల నిమిత్తం తాత్కాలిక అనుమతులు ఇస్తే.. దానిని ఆసరాగా చేసుకొని గుట్టలను కనుమరుగు చేస్తున్నారు. ఇందుకు నిదర్శనం చొప్పదండి పురపాలక సంఘం పరిధిలోని తొగరుమామిడికుంట శివారులో జోరుగా మట్టి రవాణా. కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణానికి పట్టణ పరిధిలోని 118/ఏ సర్వే నంబర్‌లోని 1.214 హెక్టార్లలో మట్టిని తీసుకెళ్లడానికి జిల్లా మైనింగ్ అధికారులు గత నెల 8న ఓ సంస్థకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి నిరాటంకంగా తవ్వకాలు కొనసాగుతున్నాయి.



ఈ తవ్వకాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేళాపాల లేకుండా సాగిస్తున్నారు. అనుమతికి మించి తవ్వకాలు చేపట్టడంతో స్థానిక తహసీల్దార్ ఆదేశాలతో టిప్పర్ వాహనాలను పోలీసులు ఠాణాకు తరలించారు. వారం రోజులుగా తవ్వకాలు నిలిపివేశారు. శని, ఆదివారాలు సెలవులు రావడంతో ఆ సంస్థ ప్రతినిధులు మళ్లీ తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రి వేళ కూడా యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. తొగరుమామిడికుంట ప్రాంతంలో రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తుండడంతో స్థానికులు సైతం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా అనుమతికి మించి మట్టి తరలిస్తుండటంతో సరఫరా నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చామని సెలవు దినాలు కావడంతో మళ్లీ కొనసాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మైనింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎస్సై అనూషను వివరణ కోరగా మట్టి తరలింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.

# తొలిమెట్టు లక్ష్యం నెరవేరేనా?

కరీంనగర్ : విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఏ మేరకు ఫలితాలు ఇస్తుందనే అంశంపై రెండో తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యా శిక్షణా పరిశోధనా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో నమూనా సర్వే నిర్వహించేందుకు విద్యాశాఖ సమాయత్తమైంది. ఇందులో భాగంగా రెండో తరగతి విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం.. గణిత ప్రక్రియల్లో ప్రగతి పరిశీలించేందుకు



డిగ్రీ విద్యార్థులతో సర్వే నిర్వహించనున్నారు. సర్వే జరిపే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ పూర్తి చేశారు.

మొబైల్ యాప్‌లో నమోదు ఈ నెల 10 నుంచి 12 వరకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థులను పరీక్షించనున్నారు. మొదటి రోజు తెలుగు, రెండో రోజు ఆంగ్లం, మూడో రోజు గణితం అంశాలపై అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తారు. విద్యార్థుల ప్రతిస్పందనలను టాంగరిన్ అనే మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఆయా పాఠశాలలకు రెండో తరగతి విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూడాలని.. సర్వేకు సహకరించాలని జిల్లా విద్యాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. సర్వే నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

చురకలు



# విద్యుత్తు డిమాండ్ పైపైకి..

కొత్తగూడెం : ఎండల తీవ్రత మొదలవటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విద్యుత్తు వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలకు విద్యుత్తు వాడకం అధికమవటంతో పాటు గృహవినియోగం భారీగా ఉండటంతో గరిష్ఠ స్థాయిలో విద్యుత్తు డిమాండ్ నమోదవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని నాలుగు సర్కిళ్ల పరిధిలో ఫిబ్రవరి 1 నుంచి 6 వరకు 35.30లక్షల యూనిట్ల విద్యుత్తును కేటాయిస్తే.. 47.28లక్షల యూనిట్లు వినియోగించటం గమనార్హం. భద్రాద్రి జిల్లాలో 2024-25 సంవత్సరానికి 1,014.34లక్షల యూనిట్లు కేటాయిస్తే.. డిసెంబర్ నాటికే 962.28లక్షల యూనిట్ల విద్యుత్తును వాడేశారు. వచ్చే ఏప్రిల్ నాటికి కేటాయింపుల వినియోగం భారీగా పెరిగే అవకాశముంది.

**అధిక వినియోగానికి కారణాలు**

సాధారణంగా యాసంగి సీజన్‌లో సాగునీటి అవసరాలు పెరుగుతుంటాయి. విద్యుత్తు డిమాండ్ అధికంగా ఉంటుంది. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో కొంతమంది రైతులు అవసరానికి మించి వినియోగిసున్నారు.

ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ లాంటి పట్టణాల్లో పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాలు పెరుగుతుండటంతో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన విద్యుత్తు వినియోగం 20శాతం పెరిగినట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా సామాన్యులకు సైతం వాటర్ హీటర్లు, కూలర్లు ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అందుబాటులో ఉండటంతో విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇది విద్యుత్తు వినియోగం పెరగటానికి కారణమవుతోంది. ఖమ్మం నగరం, కొత్తగూడెం, పాల్వంచ తదితర పట్టణాల్లో జనాభాకు అనుగుణంగా అపార్టుమెంట్ల సంఖ్య పెరుగుతుండటంతో విద్యుత్తు వినియోగమూ అధికంగా ఉంటోంది.

**అధికారులు తీసుకుంటున్న చర్యలు..**

విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు ప్రతినెలా సమీక్షలు నిర్వహిస్తూ.. డిమాండ్‌కు తగ్గ సరఫరా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యుత్తు వినియోగం పెరిగిన సమయంలో సరిగ్గా పంపిణీ చేయటానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో విద్యుత్తు వినియోగం భారీగా నమోదయ్యే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని సౌరశక్తి ద్వారా విద్యుదుత్పత్తిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. అధిక విద్యుత్తు వినియోగం నేపథ్యంలో విద్యుత్తు నియంత్రికలపై భారం పడకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటివరకు 13 సబ్‌స్టేషన్లలో లోడ్‌కు అనుగుణంగా వాటి సామర్థ్యాన్ని పెంచాం. అవసరాన్ని బట్టి కొత్త నియంత్రికలు అమర్చుతున్నాం. వేసవిలో విద్యుత్తు కోతలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. సురేందర్, ఎస్ఈ, టీజీఎన్‌పీడీసీఎల్, ఖమ్మం

# వంతెన.. కథ కంచికేనా?

హైదరాబాద్ : నగరాభివృద్ధికి చిహ్నాలు అనుకున్న మూసీ నది వంతెనలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నగరంలో 55కి.మీ పొడవున ప్రవహిస్తోన్న నదిని అబ్బురపరిచే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా.. ఆ కారణంతో హెచ్‌ఆర్‌డీసీఎల్(హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ), ఎంఆర్‌డీసీఎల్(మూసీ నది అభివృద్ధి సంస్థ) 14 వంతెనలను రద్దు చేసింది. ఒక్క ముసారంబాగ్‌లోని వంతెన పనులే ప్రస్తుతం జరుగుతున్నాయి. రద్దయిన వాటిలో.. సగం పూర్తయిన పనులు ఉండటం ఆందోళనకు తావిస్తోంది. అనేక మంది రైతులను ఒప్పించి, వారి పొలాలను రోడ్డు నిర్మాణం కోసం సేకరించి, యుద్ధప్రాతిపదికన చేపట్టిన పీర్జాదిగూడ మూసీ వంతెన, పిల్లర్ల దశలో నిలిచిన చింతల్‌మెట్ వంతెన, ఇతరత్రా ఉన్నాయి. కోట్లాది రూపాయలతో చేపట్టిన రోడ్ల పనులను అర్ధాంతరంగా నిలిపేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఆర్‌డీసీఎల్, ఎంఆర్‌డీసీఎల్ తీసుకున్న నిర్ణయంతో.. తమ ప్రాంతాలు ట్రాఫిక్ చిక్కుల్లో కూరుకుపోతున్నాయని ప్రజలు గగ్గోలుపెడుతున్నారు.

**వెలవెలబోతున్న పీర్జాదిగూడ వంతెన..**

మూసీ నదిపై రూ.545కోట్లతో పలు వంతెనలు నిర్మించాలన్నది గత సర్కారు ప్రణాళిక. ముసారాంబాగ్, చాదర్‌ఘాట్, నార్సింగి, ప్రతాపసింగారం, సన్‌సిటీ, తదితర ప్రాంతాల్లో వంతెనల పనులకు నాడు టెండర్లు పిలవగా.. పలు చోట్ల పనులు మొదలయ్యాయి. అందులో పీర్జాదిగూడ వంతెన కీలకమైనది. నాగోల్ బండ్లగూడ నుంచి ఇప్పటికే మూసీ నది వరకు లింకు రోడ్డు నిర్మించారు. పీర్జాదిగూడ ప్రధాన రహదారి నుంచి మూసీ వరకు భారీ రోడ్డు మార్గాన్ని నిర్మించి, బండ్లగూడ, పీర్జాదిగూడ ప్రాంతాలను కలపాలన్నది ప్రణాళిక. తద్వారా



వరంగల్ జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడుతుందని అధికారులు భావించారు. అనుకున్నట్టే.. మూడేళ్ల కిందట రూ.40కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలయ్యాయి. పీర్జాదిగూడవైపు 50శాతం పనులు పూర్తయ్యాయి. అంతలోనే ప్రాజెక్టును ఆపేయాలంటూ ఎంఆర్‌డీసీఎల్ కోరిందంటూ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సూచనతోనే తాము పనులు ఆపాలని కోరినట్టు ఎంఆర్‌డీసీఎల్ చెబుతోంది.

**ఇతర ప్రాజెక్టులదీ అదే పరిస్థితి..**

రూ.12.88కోట్లతో సన్‌సిటీ-చింతల్‌మెట్ ప్రాంతాల మధ్య నిర్మించనున్న పైవంతెన పనులు 20శాతం జరిగాయి. ఎంఆర్‌డీసీఎల్ పనులు ఆపేయాలని కోరినట్టు హెచ్‌ఆర్‌డీసీఎల్ చెబుతోంది. సన్‌సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

ముసారాంబాగ్‌లో మూసీపై మొదలైన వంతెన నిర్మాణం నిధుల్లేక నత్తనడకన సాగుతోంది. నాలుగు నెలల్లో వర్షాకాలం రాబోతుందని, పనుల్లో వేగం పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతాపసింగారం-గౌరెల్లి గ్రామాల మధ్య, చాదర్‌ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన వంతెనలకు రెండేళ్ల కిందట శంకుస్థాపన జరిగింది. పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. భూసేకరణ సమస్య పేరుతో సున్నంచెరువు-బోరబండ లింకు రోడ్డును మధ్యలో ఆపేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

# గొంతెండే ఊళ్లు.. అందేనా తాగునీళ్లు!



పాల్వంచ : వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదురవకుండా జిల్లా అధికార యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రిడ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శితో కూడిన ప్రత్యేక బృందం పంచాయతీలను సందర్శించి సమస్యలను గుర్తిస్తోంది. సమస్యల వారీగా ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనుంది.

మారుమూల గొత్తికోయ గ్రామాల్లో దాహార్తి తీరే పరిస్థితుల్లేవు. చాలాగ్రామాల్లో తాగునీటి పథకాలు పనిచేయట్లేదు. వాటిల్లో అత్యధికం సౌర విద్యుత్, మోటారు ఆధారంగా ఏర్పాటు చేసినవే. గతంలో వేసిన చేతిపంపులు నిర్వహణలేక మూలనపడ్డాయి. అటవీశాఖ ఆంక్షల నేపథ్యంలో తక్కువ లోతులో పైపులు దింపగా.. అవన్నీ వేసవి ఆరంభంలోనే అడుగంటుతున్నాయి. ఫలితంగా వందలాది గిరిజన గూడేల ప్రజలు సమీప వాగులు, చెలమలపై ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం కింద పలు గొత్తికోయపల్లెల్లో ఇంటింటికీ నల్లాలు బిగించినా చుక్కనీరు సరఫరా కావటం లేదు.

**అక్రమ కనెక్షన్లపై నజర్..**

అధికారులు చేపట్టే ప్రత్యేక పరిశీలనలో మొత్తం తాగునీటి వనరులను పరిశీలిస్తారు. స్థానిక పథకాలెన్ని ఉన్నాయి? వాటిలో పనిచేసేవి ఎన్ని? చేపట్టాల్సిన మరమ్మతులేమిటి? అనేవి నమోదు చేస్తారు. పంచాయతీ స్థాయిలో పరిష్కారమయ్యేవి ఉంటే అధికారుల ప్రత్యక్ష పరిశీలనలో ఆయా పనులు పూర్తిచేయిస్తారు. లేదంటే ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తారు. గ్రామ సందర్శన సమయంలోనే 'మిషన్ భగీరథ' పైపులైన్‌కు ఏమైనా అక్రమ కనెక్షన్లు ఉన్నాయా? అని గమనిస్తారు. ఉదాహరణకు.. పాల్వంచ మండలం పాండురంగాపురం ఏరియాలో మిషన్ భగీరథ పైపులైన్‌కు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చారు. కొందరు పైపు అడుగు భాగం నుంచి మరీ పైపులు అక్రమంగా బిగించారు. దీంతో పైప్రాంతాలకు నీళ్లు సరిగా సరఫరా కావడం లేదు. ఇలాంటి కనెక్షన్లు ప్రతి పల్లెలో పదుల సంఖ్యల్లో ఉన్నాయి.

ప్రత్యేక డ్రైవ్‌లో ప్రతి పంచాయతీ సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. మరమ్మతులకు ఎక్కువ మొత్తం కావాల్సిన చోట ప్రతిపాదనలు రూపొందిస్తాం. తాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకొస్తాం. మహేశ్వరి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పాల్వంచ

# ప్రసాద్ అందివస్తేనే.. పర్యాటక శోభ..!



భద్రాచలం : పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం, పర్ణశాలల్లో పర్యాటక శాఖ చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులు అనుకున్న సమయానికి పూర్తయి ఉంటే ఇప్పటికే భక్తులకు ఉపయోగకరంగా అందుబాటులోకి వచ్చేవి. ఈ ఏడాది ఏప్రిల్ 6న శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణం, 7న పట్టాభిషేక మహోత్సవం జరగనున్నాయి. ఆ వేడుకలకు వచ్చే భక్తులకు టూరిజం విభాగం ద్వారా సదుపాయాలను కల్పించాలంటే ఈ పనులను నాణ్యతతో పూర్తి చేయాల్సి ఉంది. ఈ అంశంలో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో 'ప్రసాద్' పథకం ద్వారా రూ. 41.38 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు 2022 డిసెంబరులో ఇక్కడ పర్యటించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భూమి పూజ చేశారు. ఈ పనులు 2024 డిసెంబరులో పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా తుది దశకు చేరలేదు. దీంతో ఈ ఏడాది మార్చికి పూర్తి చేస్తామని ఇంజినీర్లు గడువు కోరారు.

**సాగుతున్న పనులు..** రాముడు కొలువైన భద్రగిరితో పాటు వనవాసం సమయంలో నివాసం ఉన్న పర్ణశాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. భద్రాచలం రామాలయ కల్యాణ మండపం ప్రాంగణంలో భక్తులు కూర్చునేందుకు వీలుగా షెడ్ల నిర్మాణం పనులు బేస్‌మెంట్ వరకే సాగాయి.

భక్తుల వసతి సదుపాయాల కల్పనకు స్థానిక శిల్పినగర్‌లో కల్యాణ కట్ట, భద్రాతా సిబ్బంది కార్యాలయం, వ్రత మండపం, వసతి విభాగం, శౌచాలయ నిర్మాణం సాగుతోంది. ఈ పనులు దాదాపు సగం మేర పూర్తయ్యాయి. గోదావరి బ్రిడ్జి వద్ద క్యాంటిన్, పార్కింగ్, శౌచాలయ నిర్మాణం సాగుతోంది. ఈ రెండు చోట్ల విద్యుత్తు స్తంభాలు, ప్రత్యేక దీపాలు, సీసీ కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

భద్రాచలం, పర్ణశాల వద్ద నదిలో భక్తులు బోట్ షికారు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. పర్ణశాలలో స్తంభాలు, షెల్టర్లు, కిచెన్, సమాచార కేంద్రం, వెయిటింగ్ హాల్, శౌచాలయాల నిర్మాణాల పనులు చేస్తున్నారు. వీటిని వీలైనంత త్వరగా పూర్తిచేసి పర్యాటకులను ఎక్కువ సంఖ్యలో రప్పించాలని పలువురు కోరుతున్నారు. ఇవన్నీ భక్తులకు అందుబాటులోకి వస్తే పుణ్యక్షేత్రానికి పర్యాటక శోభ పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. మార్చి నాటికి పూర్తిచేస్తాం.. : ప్రసాద్, ఏఈమార్చి ఆఖరుకు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుని వస్తాం. ఇందుకోసం నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. ఇవి ఉపయోగంలోకి వస్తే పర్యాటకులకు సౌకర్యాలు పెరుగుతాయి.

# ఎడతెగని పంచాయతీ..!



ఖమ్మం:చింతకాని మండలం నామవరంలో సుమారు ఎనిమిదేళ్ల క్రితం రూ.10లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ పూర్తవలేదు. నిధుల కొరతే కారణం.

కామేపల్లి మండలం రుక్కీతండాలో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండేళ్లు దాటుతున్నా పునాదుల దశలోనే పనులు ఉన్నాయి. నిధుల కొరత, అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ప్రధాన కారణాలు అని తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఓ భవనంలో గ్రామపంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అనేక గ్రామాల్లో పంచాయతీ భవనాలకు ఏళ్ల క్రితమే శంకుస్థాపన జరిగినా.. ఇప్పటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిధుల కొరత ఏర్పడిన చోట మరికొంత డబ్బులు కేటాయించి పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం సంకల్పించినా అడ్డంకులు ఎదురవుతున్నాయి. కొన్ని భవనాలు పునాదుల దశ దాటకుండా ఆగిపోతే.. ఇంకొన్ని పిల్లర్ల దశలో కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల స్థల వివాదాలతో పనులు మొదలుకాలేదు. మరికొన్నిచోట్ల పనులు పూర్తయినా భవనాలను వినియోగంలోకి తీసుకురావటం లేదు.

**నిధులు పెంచినా..**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొన్ని, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో మరికొన్ని, ఐటీడీఏ నిధులతో ఇంకొన్ని భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. వీటి నిర్మాణం కోసం తొలుత రూ.13 లక్షలు, అనంతరం మరో రూ.3 లక్షలు కేటాయించారు. ఈ నిధులూ సరిపోకపోవటం వల్ల మేజర్ గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల వ్యయాన్ని రూ.20లక్షలకు పెంచారు. పనులను అప్పట్లో సర్పంచులు, గుత్తేదారులు చేపట్టారు. సర్పంచుల పదవీకాలం ముగియటంతో పనులను ఆపేశారు. ప్రత్యేక అధికారులు పట్టించుకోవటం లేదు.

**ఒక్కోచోట ఒక్కో పరిస్థితి**

గ్రామాల్లో పంచాయతీలకు భవనాలు లేనిచోట కార్మికులు, గ్రామ అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కడక్కడ పాత భవనాలు శిథిలావస్థకు చేరటంతో దస్త్రాలను భద్రపరిచే పరిస్థితి లేకుండా పోయింది. సమావేశాలు, గ్రామసభల నిర్వహణ సక్రమంగా సాగటం లేదు. నూతన గ్రామపంచాయతీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పంచాయతీ కార్యాలయాలు లేకపోవటంతో స్థానికంగా ప్రభుత్వ భవనాలను వినియోగిస్తున్నారు. వసతులు లేనిచోట చెట్ల కిందే కార్యకలాపాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ భవన నిర్మాణ పనులను డీఆర్డీఓ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో పూర్తి చేస్తామని ఖమ్మం డీపీఓ ఆశాలత తెలిపారు.

## కొనసాగుతున్న సందిగ్ధం

ఖమ్మం : ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 577కి తగ్గింది. మరో రెండు పంచాయతీలపై సందిగ్ధం నెలకొంది. ఖమ్మం రూరల్ మండలంలో 12 గ్రామపంచాయతీలను ఏదులాపురం పురపాలక సంఘంగా ఏర్పాటు చేశారు. 12 పంచాయతీల్లో 10 పూర్తిగా, రెండు పాక్షికంగా తీసుకున్నారు. గ్రామ పంచాయతీ అధికారుల లెక్కల ప్రకారం 12 గ్రామ పంచాయతీలు, అందులోని 132 వార్డులు మున్సిపాలిటీగా ఏర్పడ్డాయి. జిల్లాలో మొత్తం 589 గ్రామ పంచాయతీలు ఉండగా.. 12 తొలగిస్తే ప్రస్తుతం 577 పంచాయతీలున్నాయి. 589 పంచాయతీల్లో 5,398 వార్డులు ఉండగా.. ప్రస్తుతం 577 పంచాయతీల్లో 5,266 వార్డులున్నాయి. మున్సిపాలిటీలో పాక్షికంగా కలిసిన రెండు పంచాయతీలు, వాటిలో మిగిలిన 22 వార్డులను పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సి ఉంటుంది. పాక్షికంగా మిగిలిన రెండు పంచాయతీలు, 22 వార్డులు నోటిఫై అయిన తర్వాతే తమ లెక్కలోకి వస్తాయని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉందని, అప్పటి వరకు 577 పంచాయతీలు, 5,266 వార్డులుగానే పరిగణిస్తామని తెలిపారు.

# పిల్లలు తినే జెల్లీ.. ప్రమాదకరమే!

హైదరాబాద్ : ఆహార పదార్థాల తయారీ సంస్థలు నిర్లక్ష్యంగా వహిస్తే.. మార్కెట్లోకి వచ్చే ఉత్పత్తులు హానికరంగా మారతాయి. పలు సంస్థలు తయారుచేసిన కొన్ని నమూనాలను ఇటీవల జీహెచ్‌ఎంసీ పరీక్షించగా.. విస్తుపోయే నిజాలు వెలుగులోకొచ్చాయి. పిల్లలు తినే మామిడిపండు జెల్లీలో పది రెట్లు అధికంగా సల్ఫైట్ ఉంది. ఏం కలిపారో తెలియని వంట నూనె మార్కెట్లో చలామణి అవుతోంది. రంగులతో తయారయ్యే టీ పొడి, బెల్లం, బిర్యానీ, ఇతర మాంసాహారాలు, మిఠాయిలు, ఇతరత్రా ఆహార పదార్థాల్లోనూ మోతాకు మించి రసాయనాలు, రంగులు ఉన్నట్టు తేలింది.

**మ్యాంగో జెల్లీలో..**

దీపు మ్యాంగో జెల్లీ పేరుతో ఉన్న ప్యాకెట్‌లోని పదార్థాన్ని నాచారంలోని రాష్ట్ర ఆహార నమూనాల పరీక్ష కేంద్రానికి పంపగా.. అందులో 100 పీపీఎంగా ఉండాల్సిన సల్ఫైట్ 1,146 పీపీఎం ఉన్నట్టు తేలింది. అలాంటి జెల్లీని తింటే ఎలాంటి ప్రభావం ఉంటుందని ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్‌ను అడగ్గా.. పిల్లలు, పెద్దల్లో వాంతులు, విరేచనాలు, చర్మంపై దద్దుర్లు వచ్చే అవకాశముందని తెలిపారు. అలాగే తింటూ ఉంటే.. కొంత కాలానికి నరాల సమస్య, క్యాన్సర్ వచ్చే ప్రమాదముందన్నారు. "సాధారణంగా సల్ఫర్‌ను, కొన్ని రకాల ఆహార రంగులను వంటల్లో ఉపయోగించవచ్చు. వాటి శాతం మోతాదులోపే ఉండాలి. మార్కెట్‌కు తయారైన వస్తువులను పంపించే ముందు పరీక్షలు



జరపాలన్న నిబంధన అమలు చేస్తే.. నాసిరకం, అనారోగ్యకర పదార్థాలను బయటకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు" అని డాక్టర్ లక్ష్మణ్ వివరించారు.

**ఇతర అనారోగ్యకర పదార్థాలు..**

ప్రీమియం క్వాలిటీ ఒరిజినల్ కిమియా డేట్స్ ప్యాకెట్‌లోని కర్జూరాను పరిశీలించగా.. అందులో ఏ ఒక్కటీ తినేందుకు పనికిరాని స్థితిలో ఉన్నట్టు తేలింది. పైపొర కింద బూజు ఉన్నట్టు నిపుణులు తేల్చారు. బెల్లంలో సల్ఫైట్, టెట్రాజైన్‌తో పాటు సన్‌సెట్ ఎల్లో రంగులు కలిపినట్లు తేలింది. శ్రీసూర్య కాష్యూ పేరుగల ప్యాకెట్‌లోని జీడిపప్పులో పురుగులు, ఫ్రీ ఫ్యాటీ యాసిడ్స్.. నేషనల్ జింజర్ అండ్ గార్లిక్ పేస్టులో తక్కువ ఆమ్లం(ఇతర పదార్థాలతో కల్తీ జరిగిప్పుడు అలా జరుగుతుంది)హెల్త్‌కేర్ రిఫైన్డ్ వంట నూనె డబ్బాపై ఉన్న సమాచారానికి తగ్గట్టు.. అందులోని ప్రమాణాలు సరిపోలకపోవడం, తప్పుడు సమాచారంతో ప్యాకింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు నాచారం ప్రయోగశాలలో గుర్తించారు. పైవన్నీ తినేందుకు పనికిరావని తేల్చారు.

**శిక్షలు, జరిమానాలు..**

పరీక్షల్లో అనారోగ్యకర పదార్థాలుగా తేలితే.. తయారు చేసిన వారిపై ఆహార భద్రత చట్టం ప్రకారం మొదటి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ కేసు నమోదు చేస్తామని, పదార్థాల నాణ్యతలో లోపాలను బట్టి జైలు శిక్ష, జరిమానాలు ఉంటాయని జీహెచ్‌ఎంసీ ఆరోగ్య విభాగం చెబుతోంది. గత కొన్ని రోజులుగా నమూనాల సేకరణను పెంచామని అధికారులు చెబుతున్నారు.

# పుడమి పులకరించేలా పండగ

హైదరాబాద్: ఆధునిక ప్రపంచం.. కాంక్రీటు పట్టణం.. పుడమి ప్రాధాన్యం తెలియని చిన్నారులు.. మానవ తప్పిదాలతో భూమికి వాటిల్లే ముప్పు.. వీటన్నింటిపైనా అవగాహన కల్పించడానికి రాజధానిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) వేదికైంది. ఎక్కడ చూసినా ప్రకృతికి సంబంధించిన సహజ సిద్ధ ఉత్పత్తులే. మన భూమి ప్రత్యేకత.. అందులో నుంచి వచ్చే ప్రకృతిసిద్ధమైన వస్తువులు, ఇతర ఉత్పత్తుల గురించి పిల్లలతో పాటు పెద్దవాళ్లు కూడా తెలుసుకున్నారు. ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైమిసం ఎర్త్ ఫెస్టివల్ రెండో ఎడిషన్ ఆదివారం గచ్చిబౌలిలో జరిగింది. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, ప్రముఖ కూచిపూడి కళాకారిణి స్వప్నసుందరి, ఈఎస్‌సీఐ డైరెక్టర్ జి.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. 'ప్రకృతి రక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటేనే మనుగడ ఉంటుంది. పుడమిని కూడా



సొంతిల్లుగా భావించాలి. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రస్తుత తరానికి మంచి సందేశం ఇస్తున్నారు" అని పేర్కొన్నారు. పత్తి నుంచి వస్త్రం ఎలా తయారవుతుందని నేతన్నలు ప్రత్యక్షంగా చూపించారు. పత్తి నుంచి నూలు, ఆ తర్వాత వస్త్రం.. అన్ని రకాల దశలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. నేటి తరానికి రెడీమేడ్ డ్రెస్సులపై అవగాహన ఉంది. సంప్రదాయ ఖాదీ వస్త్రాల గురించి పెద్దగా తెలియదు. ఖాదీ ప్రత్యేకత, మన్నిక తెలియజేయాలనే ఈ స్టాల్‌ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**మట్టి, నీరు, విత్తనాలు..** మొక్కలు నాటడం ఓ అలవాటుగా చేసుకోవాలని చిన్నారులకు ఈ ఫెస్టివల్‌లో అవగాహన కల్పించారు. 'పాట్ ప్లాంట్' పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్‌లో స్వయంగా పిల్లలతోనే చిన్న కుండీల్లో మొక్కలు నాటించారు. అందులో వాడే మట్టి, నీరు, విత్తనాలు, మొక్కలు ఎలా పెరుగుతాయనే అంశాలపై అవగాహన కల్పించారు. సీడ్ బాల్ తయారీ, ఆకులతో బుట్టల తయారీపై శిక్షణ ఇచ్చారు.

# చిన్నారులకు సుజలం

శ్రీకాకుళం: చిన్నారుల్లో సూక్ష్మక్రిముల సంక్రమణ వ్యాధులకు మూలకారణం తాగునీరు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధజలం అందించడానికి సన్నాహాలు చేసింది. వైకాపా హయాంలో యంత్రాలు ఏర్పాటు చేసినా పర్యవేక్షణ కొరవడటంతో కొన్నిచోట్ల మూలకు చేరాయి.
కేంద్రాలకు వస్తున్న వారిలో కొందరు ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కాచి చల్లార్చిన నీరు అందించేవారు. ఈ పరిస్థితికి ముగింపు పలకడానికి అవసరమైన ప్రాంతాల్లో శుద్ధజలం పంపిణీకి ఉపకరణాలను ఏర్పాటు చేసే కార్యాచరణకు సిద్ధమైంది. సాధారణంగా వేసవిలో చిన్నారులు డయేరియా, వైరల్ జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. ఈ సమస్యను అరికట్టడానికి ప్రతి కేంద్రంలో శుద్ధజలం అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడతలో 14 ప్రాజెక్టులకు 153 శుద్ధజల యంత్రాలు పంపిణీ చేసింది. గత ప్రభుత్వం జిల్లాలోని కేంద్రాలకు 813 యూనిట్లు సమకూర్చింది. వాటిలో ప్రస్తుతం 273 పని చేస్తుండగా మిగిలినవి మూలకు చేరాయి. నాణ్యత, నిర్వహణ లోపాల కారణంగా వినియోగం పూర్తిస్థాయిలో లేదు. చాలావాటికి మరమ్మతులకు చేయకపోవడంతో




శుభ్రమైన నీరు తాగే వీలు లేకుండా పోయింది.
మొత్తం 16 ప్రాజెక్టుల్లో 2,759 మెయిన్, 599 మినీ కేంద్రాలున్నాయి. వీటిలో ఆరు నెలల నుంచి ఏడాది వయసున్న చిన్నారులు 12,402 మంది, ఏడాది నుంచి మూడేళ్ల లోపు 43,013 మంది, ఆరేళ్ల లోపు 30,624 మంది ఉన్నారు.

**సురక్షిత నీరు అందిస్తాం..**
జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధజలం అందించడానికి ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ఆర్‌వో యంత్రాలను సిద్ధం చేయడానికి సంబంధిత సిబ్బంది పని చేస్తున్నారు. గతంలో సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సి వచ్చేది.
బి.శాంతిశ్రీ, పీడీ, ఐసీడీఎస్, శ్రీకాకుళం

# నీడ లేక.. నీరందక!

కవిటి : మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా జిల్లాలో 33 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కనీస వసతులు లేకుండా సాగుతున్నాయి. కూలీలకు క్షేత్రస్థాయిలో అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో మండుటెండలో అవస్థలు పడుతున్నారు. రోజురోజుకు భానుడి సెగ పెరుగుతున్నా పని ప్రాంతాల్లో వేతనదారులకు వసతులు కల్పించడం లేదు. కొందరు నీరసించి అస్వస్థతకు గురవుతున్నా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు.
జిల్లాలోని 30 మండలాల్లో 3.84 లక్షల క్రియాశీల జాబ్ కార్డులున్నాయి. 6.18 లక్షల మంది వేతనదారులున్నారు. ప్రస్తుతం 1.14 లక్షల మంది పనులకు వస్తున్నారు. వైకాపా ప్రభుత్వం పని ప్రదేశాల్లో వసతులు కల్పించకపోవడంతో కూలీలకు ఇక్కట్లు తప్పలేదు. కేంద్రం ఏటా వేసవిలో వేతనదారులకు నీడ కోసం టెంట్లు, మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ సౌకర్యాలు కల్పించడం లేదు. కూలీలు తాటి, కొబ్బరి కమ్మలు తెచ్చుకుని సేద తీరుతున్నారు.

**వేసవి భృతి రద్దు**



గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం చొప్పున భృతి ఇచ్చేవారు. మజ్జిగ సరఫరా చేసేవారు. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకు రూ.13 చెల్లించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సౌకర్యాలను రద్దు చేయడంతో వేతనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ఒకరోజు గరిష్ఠ వేతనం రూ.300గా ప్రకటించినా రూ.265 దాటడం లేదు.

**మట్టి తవ్వలేకపోతున్నాం..**
మూడు నెలల నుంచి వర్షాలు లేకపోవడంతో మట్టి బాగా గట్టిపడింది. తవ్వడానికి ఇబ్బందులు పడుతున్నాం. కొద్ది సేపు పని చేసినా అలసిపోతున్నాం. తాటి, కొబ్బరి కమ్మలు తెచ్చుకుని సేద తీరుతున్నాం. వేతనం ఆశించిన స్థాయిలో రావడం లేదు. వేసవి భృతి ఇస్తే ప్రోత్సాహకంగా ఉంటుంది. చలపరాయి పొట్టమ్మ, ఉపాధి కూలీ, డొంకూరు, ఇచ్ఛాపురం మండలం

**ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నాం..**
పని ప్రదేశాల్లో పరదాలు కట్టి కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతానికి వేసవి భృతి అందించే అవకాశం లేదు. బి.సుధాకర్, పీడీ, డ్వామా, శ్రీకాకుళం

# 'తల'కెక్కించు కోవాల్సిందే...!




విశాఖపట్నం : వెంకోజీపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి ఆంజనేయస్వామి ఆలయం ఎదుట మలుపు వద్ద అదుపు తప్పి కింద పడిపోయాడు. శిరస్త్రాణం ధరించకపోవడంతో తలకు గాయమై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు.
రహదారి ప్రమాదాల్లో నిత్యం పలువురు చోదకులు మృత్యువాత పడుతున్నారు. వీరిలో అధికశాతం శిరస్త్రాణం ధరించలేదని పోలీసులు గుర్తించారు. ఈ పరిస్థితి నివారణకు నూతన మోటారు వాహన చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ద్విచక్రవాహనంపై వెళ్లే ఇద్దరూ తప్పని సరిగా శిరస్త్రాణం ధరించాలని కొత్త చట్టం చెబుతోంది. ధరించకుంటే గతంలో రూ.100 జరిమానా విధించేవారు. కొత్త చట్టం ప్రకారం అది రూ.1000కు పెరిగింది. ఇదే కాకుండా మిగిలిన అంశాల్లోనూ భారీగా జరిమానాలు పెంచారు.

**నిబంధనలకు మరింత పదును**
ద్విచక్ర వాహనం కొనుగోలు చేసే సమయంలో యజమాని తప్పనిసరిగా శిరస్త్రాణం కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. అలా అయితేనే వాహనం రిజిస్ట్రేషన్ చేస్తారు. అయితే చోదకులు ఆ శిరస్త్రాణాన్ని ధరించకుండా పక్కన పెడుతున్నారు. రూ.100 జరిమానే కదా అనే నిర్లక్ష్యం చాలా మందిలో కనిపిస్తోంది. భారీ జరిమానాలు విధిస్తామని ట్రాఫిక్ పోలీసులు గత ఏడాది నుంచి విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు కేసులు నమోదు చేయడంతో పరిస్థితిలో కొంత మార్పు కనిపించింది. పూర్తిస్థాయిలో మార్పు తీసుకురావడానికే నూతన మోటారు వాహన చట్టాన్ని అమల్లోకి తెచ్చారు.

**శిరస్సుకు దెబ్బ తగలకుండా నివారణ**
పోలీసు కేసుల నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో చాలా మంది చోదకులు శిరస్త్రాణాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే వాటిల్లో నాణ్యత ఉండడం లేదు. ఫలితంగా ప్రమాదాలు జరిగినప్పుడు అవి తలకు రక్షణ కల్పించలేకపోతున్నాయి. తలకు గాయమైతే మెదడుపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొద్దిసేపు స్పృహ కోల్పోవడం, తలనొప్పి, అయోమయం, దృష్టి మందగించడం, చెవిలో హోరున శబ్దం, రుచి తెలియకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. అందుకే ఐ.ఎస్.ఐ. మార్కు ఉన్న శిరస్త్రాణం కొనుగోలు చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

# పైనుంచొస్తాయ్.. నక్కినా పని పడతాయ్!



పీఎంపాలెం : చోరీ చేసి చాకచక్యంగా పారిపోతున్నాం... నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం, గంజాయి తాగుతున్నాం... ఇక మమ్మల్ని పోలీసులు గుర్తించలేరని భ్రమ పడే రోజులు పోయాయి. ఏకంగా నింగి నుంచే నిఘా పెడుతున్నారు. ఆకాశంలో డ్రోన్ ఎగురవేసి నిర్దేశించిన ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు 'క్లౌడ్ పెట్రోలింగ్' దిశగా అడుగులు వేస్తున్నారు. కాలానికి తగ్గట్టుగా నేరాల నియంత్రణకు సరికొత్త పద్ధతులు అవలంభిస్తున్నారు.
నిర్మానుష్య ప్రాంతాలే లక్ష్యంగా: నగరంలో విశాల తీర ప్రాంతంలో పచ్చని కొండలు విస్తరించి ఉండడంతో నిర్మానుష్య ప్రదేశాలకూ కొదవ లేదు. దీంతో గంజాయి, మద్యంతాగే వారి కార్యకలాపాలకు అవి నిలయంగా మారుతున్నాయి. ఇటీవల బీచ్‌రోడ్డు, ఐటీహిల్స్, బీఆర్‌టీఎస్ రోడ్లపై బైక్ రేసింగ్‌లు ఎక్కువయ్యాయి. యువత రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వారిని అరికట్టేందుకు పోలీసులు ఎంత నిఘా పెట్టినా పూర్తి స్థాయిలో నియంత్రణ సాధ్యపడటం లేదు. దీంతో 'క్లౌడ్ పెట్రోలింగ్' పేరుతో డ్రోన్ కెమెరాలను రంగంలోకి దింపుతున్నారు.లైవ్‌లో చూస్తూ పోలీసులు అక్కడ పరిస్థితులను అంచనా వేస్తారు.అనుమానం వస్తే వెంటనే సమీప పోలీసు బృందాలను అప్రమత్తం చేస్తున్నారు.

**నార్త్‌జోన్‌లో ప్రయోగాత్మకంగా...:** నగర పోలీసు కమిషనరేట్ పరిధి నార్త్‌జోన్‌లో డ్రోన్ కెమెరాలతో గస్తీ చర్యలకు రెండు రోజుల క్రితం పోలీసులు శ్రీకారం చుట్టారు. పీఎంపాలెం పోలీసుల ఆధ్వర్యంలో రుషికొండ ఐటీసెజ్‌లోని మూడు కొండలు, పరిసర ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి చిత్రాలు, వీడియోలు తీశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకూ ఇవి దోహదపడనున్నాయి.

**డ్రోన్లతో నిశిత గస్తీ..**
బీచ్‌రోడ్డు, ఐటీహిల్స్ ప్రాంతాల్లో సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో డ్రోన్ కెమెరాలతో గస్తీ చర్యలు అమలు చేస్తున్నాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు 'క్లౌడ్ పెట్రోలింగ్'కు శ్రీకారం చుట్టాం. అనుమానం వచ్చిన ప్రాంతంలో డ్రోన్లను వినియోగించి నిందితులను పట్టుకుంటాం. బైక్ రేసింగ్‌లు, వేగంతో దూసుకెళ్లే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. అన్ని ముఖ్యమైన కూడళ్లు, ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పెట్టాం.
ఎస్.అప్పలరాజు, ఏసీపీ, నార్త్‌జోన్

# నదీమతల్లికి గర్భశోకం..!



రాజమహేంద్రవరం : గోదావరి నది.. ఉత్తరాంధ్ర ప్రజలకు పరమ పూజ్యం.. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు మాతృ సమానం. అలాంటి ఉత్కృష్టమైన జీవనదీ గర్భంలో అడుగడుగునా అగాధాలు అధ్వానంగా మారాయి. ఇసుక తవ్వకాల మాటున ఇష్టారాజ్యంగా కబళిస్తుండటంతో సమస్య ఏర్పడుతోంది. డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వేయడమే ఇందుకు ప్రధాన కారణమైంది. అధికారులు దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నా ఆగని దుస్థితి. రెండు నెలల క్రితం కూడా రోడ్డు కం రైలు వంతెన పిల్లర్ల వద్ద తెల్లవారుజామున డ్రెడ్జింగ్ చేస్తున్న 18 బోట్లను అధికారులు దాడులు సీజ్ చేశారు. ఈ తరహా తవ్వకంతో వంతెన ఉనికికే ప్రమాదమని స్పష్టం చేశారు. అంతకు ముందు కోటిలింగాల రేవు సమీపంలోనూ కలెక్టర్ పరిశీలనలో పట్టుకోవడం విదితమే. ఈ సందర్భంలోనూ నాలుగు బోట్లు సీజ్ చేశారు. గతంలో కాతేరు కేంద్రంగా గామన్ వంతెన వద్ద డ్రెడ్జింగ్ తవ్వకాల వల్ల వంతెన బేరింగ్ వంగి పోయి.. కొన్ని రోజులు ఓవైపు మాత్రమే రాకపోకలకు అనుమతులు ఇచ్చిన పరిస్థితి ఉంది. ఇంత జరుగుతున్నా ఈ విషయంలో శాశ్వత పరిష్కారం కరవవడంతో నది నిండా అగాధాలు, నదిపై బోట్ల మీద ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి.

**ఇదీ పరిస్థితి** సాధారణంగా కార్మికులు నావలపై గోదావరిలోకి వెళ్లి కేటాయించిన స్థలంలో ఇసుకను సేకరిస్తారు. ఈ విధానం నదీ సమతుల్యతకు ప్రమాదకరం కాదు. కానీ డ్రెడ్జింగ్ విధానంలో యంత్రాల సాయంతో కార్మికుల అవసరం లేకుండా ఒక్కో చోట 40 నుంచి 70 అడుగుల వరకూ తవ్వుతుండటం సమస్యగా మారుతోంది. అవి అగాధాలుగా ఏళ్ల తరబడి ఉండిపోయి.. ఏటా వరదలు వచ్చినా ఇసుకతో పూడని దుస్థితి. ఫలితం.. నదిలో సుడిగుండాలకు అవకాశమేర్పడుతోందన్నది నిపుణుల మాట. ఆ సమయంలో పడవలపై ప్రయాణం చేస్తే ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. తాజాగా జరిగిన ప్రమాదం కూడా రాత్రి పూట పిల్లర్ వద్ద అగాధం తెలియకపోవడంతో బోటు అదుపు తప్పినట్లు స్పష్టమవుతోంది. **వంతెనలకు ప్రమాదం**
గామన్ వంతెన మరమ్మతులకు గురైన సందర్భంలో పరిశీలించిన అధికారులకు అనేక విషయాలు అవగతమయ్యాయి. రోడ్డు కం రైలు వంతెన నాణ్యత విషయంలోనూ రైల్వే అధికారులు నదీగర్భంలో ఇసుక తవ్వకాల వ్యవహారంపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. మొత్తంగా ఇక్కడ నదీ సమతుల్యతపై జలవనరులశాఖ యంత్రాంగం ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇసుక ఎక్కడ తవ్వాలనేది ఇరిగేషన్ అధికారులు నిర్ణయిస్తారు కాబట్టి ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. నిబంధనలు తుంగలో తొక్కి ఇసుక మాఫియా చెలరేగిపోతున్న క్రమంలో పోలీసులు, రెవెన్యూ, మైన్స్ యంత్రాంగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నదీ తీర ప్రాంతం ధవళేశ్వరం, కోటిలింగాల రేవులు, కాతేరు రేవుల వద్ద ఇష్టానుసారంగా డ్రెడ్జింగ్ జరుగుతున్న క్రమంలో కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. సుమారు 2వేల కుటుంబాలు గోదావరి ఇసుక తరలింపుపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా.. ఈ డ్రెడ్జింగ్ వల్ల వారి బతుకులు రోడ్డున పడేలా పరిస్థితులు నెలకొంటున్నాయి. పర్యాటక శాఖ పరిధిలో బోట్లు తిరుగుతుండగా, నిబంధనల అమల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతుండటం.. లైఫ్ జాకెట్లు వంటి కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

# బడుగులకు అ'ధనం'..!

శ్రీకాకుళం: పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను వైకాపా ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. పెరిగిన ధరలతో చాలా మంది లబ్ధిదారులు ఆర్థిక భారంతో కుదేలయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఆయా నిర్మాణాలపై దృష్టి సారించింది. ప్రణాళిక ప్రకారం దశల వారీగా బడుగుల సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యంతో ఎస్టీ, ఎస్టీ, చేనేత కార్మికులకు అదనంగా నిధులు మంజూరు చేయనుంది.

**50 శాతం మందికి లబ్ధి**
వైకాపా పాలనలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు అదనపు సొమ్ము ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీలకు రూ.50 వేలు, చేనేత కార్మికులకు రూ.50 వేలు మంజూరు చేయనుంది. మే నెలాఖరు నాటికి నిర్మాణాలు



పూర్తి చేసేలా లక్ష్యం విధించారు. జిల్లాలో 29,530 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో 50 శాతం గడువులోగా పూర్తి చేసేలా అదనపు సాయం మంజూరుకు సన్నాహాలు చేస్తున్నారు.
వైకాపా పాలనలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసేవారు. కూటమి ప్రభుత్వం ఎస్టీలకు రూ.3.25 లక్షలు, ఎస్సీలు, చేనేత కార్మికులకు రూ.3 లక్షలు, ఇతరులకు రూ.2.50 లక్షలు అందజేయనుంది.

**నిధులు మంజూరుకు అవకాశం..**
ఇళ్లు నిర్మిస్తున్న ఎస్సీ, ఎస్టీ, చేనేత కార్మికులకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. ఆయా వర్గాల లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపాం. అదనపు సాయం విడుదలైతే మధ్యలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. నగేశ్, ప్రాజెక్టు డైరెక్టర్, గృహ నిర్మాణ సంస్థ, శ్రీకాకుళం

# కొలిక్కిరాని నాడు-నేడు

రణస్థలం : రణస్థలం మండలం నారువ ఉన్నత పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు 146 మంది విద్యార్థులున్నారు. ఏడు గదులుండగా ఒకదాంట్లో సిమెంటు నిల్వ చేశారు. మరొకటి సిబ్బందికి కేటాయించారు. మిగిలిన వాటిలో తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు గదుల నిర్మాణం స్తంభాల స్థాయిలో నిలిచిపోయింది. ఇనుము, ఇతర సామగ్రి దెబ్బతింటున్నాయి. బోధన పరికరాలు వరండాలో ఉంచి తరగతులు నిర్వహిస్తున్నారు.
పాతర్లపల్లి ఉన్నత పాఠశాలలో 470 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఐదు గదుల నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా ఉంది. జేఆర్‌పురం ఉన్నత పాఠశాలలో ఆరు గదుల నిర్మాణం సగంలో వదిలేశారు. ఇక్కడ సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు.
వైకాపా పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయా బడుల్లో వసతి సమస్య, సౌకర్యాల లేమి నెలకొంది. నిర్మాణ సామగ్రి, బోధనా పరికరాలను వినియోగించక దెబ్బతింటున్నాయి. కొన్నిచోట్ల గుర్తు తెలియని వ్యక్తులు కాజేస్తున్నారు.



ప్రజాధనం పెద్దఎత్తున దుర్వినియోగమవుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
జిల్లాలో రెండో విడతలో 1,054 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.416.89 కోట్లు మంజూరు చేశారు. భవన నిర్మాణం, ఇతర పనులకు రూ.166.57 కోట్లు ఖర్చు చేశారు. విద్యుద్దీకరణ, తలుపుల ఏర్పాటు, బోధన సామగ్రికి రూ.90.11 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన నిధులు రావాల్సి ఉంది. అన్ని పాఠశాలల్లోనూ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. 38 జూనియర్ కళాశాలలకు రూ.28.45 కోట్లు మంజూరు చేశారు. రూ.14 కోట్లు విడుదల చేశారు. రూ.13.45 కోట్లు ఖర్చు చేశారు.
నిధులు రాగానే పూర్తి చేస్తాం.. నాడు-నేడు రెండో విడతలో మంజూరైన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం అనుమతించగానే ప్రారంభిస్తాం. శశిభూషణరావు, ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం

# నిధులు ఎత్తిపోయాల్సిందే

కర్నూలు : బీడు భూములను సస్యశ్యామలం చేసే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల వద్ద ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేసింది. వీటిని సమర్థంగా నిర్వహించడంతోపాటు వేలాది ఎకరాలకు సాగు నీరు అందించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసింది. పథకాల నిర్వహణను గాలికొదిలేయడంతోపాటు విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు. ఫలితంగా ఈ భారమంతా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై పడింది. **హంద్రీనీవా పరిధిలో రూ.2,302 కోట్లు**
హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలోని మల్యాల వద్ద ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్తు బిల్లులు భారీగా పేరుకుపోయాయి. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు రూ.17 కోట్ల నుంచి రూ.18 కోట్లు ఖర్చవుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు. మల్యాల నుంచి ఏడు ఎత్తిపోతల పథకాల (పంపింగ్ స్టేషన్లు) ద్వారా అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు నీటిని తరలిస్తారు. ఏటా 22 నుంచి 25 టీఎంసీల వరకు నీటిని ఎత్తి పోయడం ద్వారా రూ.450 కోట్ల వరకు విద్యుత్తు భారం పడుతుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.2,902 కోట్ల మేర విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో ఒకసారి రూ.600 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.2,302 కోట్ల బిల్లులు పెండింగులో పెట్టింది. ప్రస్తుతం ఆ భారమంతా కూటమి ప్రభుత్వంపై పడింది.

**నిర్వహణ అటకెక్కించి..:** ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి రూ.13 కోట్లు, గురురాఘవేంద్ర.. రూ.129 కోట్లు, సిద్ధాపురం.. రూ.73 కోట్లతోపాటు మిగిలిన 78 ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.79 కోట్ల మేర విద్యుత్తు బకాయిలు ఉన్నాయి. ఇలా హంద్రీనీవా పరిధిలో రూ.2,302 కోట్లు, మిగిలిన ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.294 కోట్లు కలిపి మొత్తం రూ.2,596 కోట్ల విద్యుత్తు బకాయిలు ఉండటం గమనార్హం. : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 78 ఎత్తిపోతల పథకాల ద్వారా 56 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. ప్రధానంగా తుంగభద్ర, శ్రీశైలం వెనుక జలాలు, కుందూ నదిపై ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టుకు నీరందుతోంది.

# 33 అడుగులకు నర్సీపట్నం రోడ్డు

నర్సీపట్నం : నర్సీపట్నం పురపాలికలోని పెదబొడ్డేపల్లి కూడలి నుంచి మాకవరపాలెం మీదుగా తాళ్లపాలెం కూడలి వరకు ప్రస్తుతమున్న 25 అడుగుల రోడ్డుని 33 అడుగులకు విస్తరించాలని యోచిస్తున్నారు. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు రూ. 50 కోట్ల ఖర్చు అంచనాతో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇటీవలి కాలంలో ఈ రహదారిలో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. మాకవరపాలెం మండలం రామన్నపాలెం సమీపం నుంచి తాళ్లపాలెం వరకు పయనీర్ కంపెనీకి నిత్యం 200 నుంచి 300 వరకు లారీలు వచ్చి వెళుతుంటాయి. ఇవి సామర్థ్యానికి మించిన లోడుతో వస్తుంటాయి. అధిక బరువు వల్ల రోడ్డు పాడవుతున్నాయి. ప్రమాదాలు పెరుగుతున్నాయి. కొద్ది వారాల క్రితం మాకవరపాలెం మండలానికి చెందిన పలు గ్రామాల వారు పయనీర్ కంపెనీ నుంచి వచ్చే లారీలను అడ్డుకోవడం తెలిసిందే. రోజుల తరబడి ఆందోళన కొనసాగడంతో అధికారులు వచ్చి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. రోడ్డు విస్తరించాల్సిందేనని ప్రజలంతా డిమాండ్ చేయడంతో ఈ దిశగా దృష్టిసారిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తక్షణ పరిష్కారంగా రామన్నపాలెం నుంచి తాళ్లపాలెం వరకు రహదారికి ఇరువైపులా ఆర్అండ్బీ స్థలం వరకు రోడ్డు అంచుల వెంబడి తుప్పలు నరికించారు. అడ్డుగా ఉన్న కొన్ని



చెట్లను తొలగించారు. ఇప్పుడు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఈ రోడ్డు అభివృద్ధిని పూర్తిగా వదిలేశారు. పలుచోట్ల గోతులమయమై ప్రమాదాలు జరుగుతుండేవి. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక ఈ రోడ్డులో గోతులు పూడ్చారు. దీంతోపాటు నర్సీపట్నం నియోజకవర్గంలోని మరో రెండు రోడ్లు విస్తరించేందుకు ప్రతిపాదించారు. మాకవరపాలెం మండలం రాచపల్లి నుంచి కోడూరు మీదుగా కోటవురట్ల మండలం కైలాసపట్నం వరకు ప్రస్తుతమున్న 12 అడుగుల రోడ్డును 23 అడుగులకు విస్తరించేందుకు రూ. 21 కోట్లు, మాకవరపాలెం మండలం గిడుతూరు నుంచి కోటవురట్ల వరకు ప్రస్తుతమున్న 12 అడుగుల రోడ్డును 23 అడుగులకు విస్తరించేందుకు రూ.22 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రతిపాదించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే పనులు మొదలవుతాయి.

# అవస్థలు అరి'కడ'తారా?

సోంపేట: ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన వనరు పైడిగాం ప్రాజెక్టు ఆధునికీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం సూచనల మేరకు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట, ప్రధాన కాలువ, ఇతర నిర్మాణాల పరంగా నెలకొన్న ఇబ్బందులతో మహేంద్రతనయ నదికి పెద్దఎత్తున వరద చేరినా పంట పొలాలకు అందడం లేదు. ఈ అంశాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అన్నదాతల సూచనలు**

నది నుంచి కాలువకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగేలా ప్రధాన కాలువ 2.2 కి.మీ., లేదా 3.2 కి.మీ. వద్ద ఆనకట్ట నిర్మించాలి.
ఒడిశా నుంచి నీటి లభ్యత పూర్తిగా తగ్గిపోవడంతో మహేంద్రగిరుల నుంచి వచ్చే వరద నీటిని నిల్వ చేసి కాలువలోకి మళ్లించేందుకు వీలుగా హంసమెర వద్ద మినీ జలాశయం నిర్మిస్తే ప్రయోజనం ఉ



ంటుంది. ప్రధాన కాలువ ఆనకట్ట, స్లూయిజ్లు, ఇతర నిర్మాణాల లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్టు ఆధారిత 69 చెరువులను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటే ఖరీఫ్, రబీలో సాగుకు ఇబ్బంది ఉండదు.

ప్రాజెక్టు స్వరూపం
ఆయకట్టు, ఆధారిత భూమి: 10 వేల ఎకరాలు
ప్రధాన కాలువ పొడవు: 16.5 కి.మీ
పిల్ల కాలువలు 11బీ వాటి విస్తీర్ణం 33 కి.మీ.
నిర్మాణ సమయంలో సాగునీటి లభ్యత: 185 క్యూసెక్కులు
అందుబాటులో ఉన్న జలాలు: 40 క్యూసెక్కులు

అనుమతులు రాగానే పనులు చేపడతాం..
పైడిగాం ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.38 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రధాన కాలువ మిగిలిన భాగాల లైనింగ్, ఆనకట్ట పనులు, ఇతర నిర్మాణాలు చేపడతాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కార్యాచరణ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.జీవీ రమణ, డీఈఈ, జలవనరుల శాఖ

# జీవనాడికి 'జల'సత్వాలు



అనంతపురం : గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు(టీబీ హెచ్చెల్సీ) శాశ్వత మరమ్మతులు చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నీటి ప్రవాహం సాఫీగా సాగేలా రూ.34.95 కోట్లు అంచనాతో 10 పనులు చేపట్టడానికి ఉపక్రమించింది. 2024-25 నీటి సీజన్ మూడు రోజుల కిందటే ముగియడంతో మరమ్మతు పనులు వేగంగా చేపట్టేలా టెండర్లను సైతం ఖరారు చేశారు. ఎంపికైన ఇద్దరు గుత్తేదారులకు పనుల అప్పగింత(వర్క్ ఆర్డర్) ఉత్తర్వులను జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ జారీ చేశారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా ఈ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

**రూ.26.25 కోట్లకు ఒప్పందం**

హెచ్చెల్సీ ప్రధాన కాలువ జిల్లా సరిహద్దు 105 కి.మీ. నుంచి 189 కి.మీ. దాకా కొనసాగుతుంది. మొత్తం 84 కి.మీ. పొడవు ఉంది. ఈ ప్రధాన కాలువ అనేక చోట్లా శిథిలావస్థకు చేరింది. డబుల్, సింగిల్ రోడ్ల వంతెనలు సైతం కుప్పకూలిపోయాయి. 2,600 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్నా.. కాలువ అధ్వానంగా ఉండటంతో 2,000 క్యూసెక్కులకు మించి తీసుకోలేని దుస్థితి. వీటన్నిటిని గ్రహించిన కూటమి ప్రభుత్వం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్లో నిర్దేశిత నిధులు కేటాయించడం విశేషం. ఐదు డబుల్ లైన్ రోడ్డు వంతెనల నిర్మాణానికి రూ.8.49 కోట్ల అంచనా పనులను అనంతకు చెందిన వెంకటరమణ నిర్మాణ సంస్థకు రూ.6.24 కోట్లకు, అవుట్ఫాల్ రెగ్యులేటర్, అండర్టన్నెల్ (యూటీ) పీఏబీఆర్ అవుట్‌ఫాల్ వంతెన, ఎంపీఆర్ అవుట్ఫాల్ వంతెన, 115-130 కి.మీ. మధ్యన లైనింగ్ పనులు చేసేందుకు రూ.26.46 కోట్ల అంచనా పనులను బళ్లారికి చెందిన శ్రీనివాస్ నిర్మాణ సంస్థకు రూ.20.01 కోట్లకు అప్పగించారు. అతి త్వరలో ఈ పనులు ప్రారంభిస్తారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నీటి సీజన్ ముగియడంతో మరమ్మతులకు శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈదఫా ఆశించిన దాని కంటే ఎక్కువ జలాలు జిల్లాకు చేరడం ప్రస్తావనార్హం. ఈ నీటి సీజన్‌లో మొత్తం 33.780 టీఎంసీలు టీబీ డ్యాం వద్ద విడుదల చేయగా.. జిల్లా సరిహద్దుకు 29.626 టీఎంసీలు చేరాయి. ఇందులో తాగునీటికి 8.278 టీఎంసీలు, ఆయకట్టుకు 13.791, జలాశయాల్లో నిల్వ 4.214, వృథా రూపంలో 3.342 టీఎంసీల మేర ఖర్చు అయ్యాయి.

**జులై నాటికి పూర్తి చేస్తాం**రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ
రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో నిధుల కేటాయింపు, టెండర్ల ఖరారు.. వంటి పనులు వేగంగా పూర్తి అయ్యాయి. వచ్చే జులై నాటికి పది పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ, పరిశీలన కొనసాగిస్తాం. వచ్చే నీటి సీజన్‌లో 2,500 క్యూసెక్కులకు తక్కువ కాకుండా తీసుకునేలా కాలువను పటిష్ఠం చేస్తాం.

# యువత ఉపాధికి బాసట.. రైతుకు ఊరట



అనంతపురం : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్‌ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటల్లో తెగుళ్లు, చీడపీడల నివారణకు మందుల పిచికారీకి డ్రోన్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రోన్‌లతో పలువురు యువకులు స్వయం ఉపాధి పొందుతుండగా.. పంటలకు పురుగు మందుల పిచికారీలో రైతులు ఊరట చెందుతున్నారు. రోజుల తరబడి చేసుకొనే పనులను నిమిషాలు, గంటల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు.

**డబ్బు, సమయం ఆదా**

సాధారణంగా రైతులు స్ప్రేయర్‌తో పురుగు మందు పిచికారీ చేయాలంటే చాలా సమయం పట్టేది. కూలీలు, స్ప్రేయరు అద్దె, పెట్రోలు ఖర్చు కింద వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. కూలీ రూ.500, టిఫిన్ ఇతరత్రా ఖర్చులకు ఒక్కొక్కరికి రూ.650 వరకు వ్యయం అయ్యేది. డ్రోన్‌తో కూలీలు, ఖర్చుల బెడద తప్పింది. మందు పిచికారీకి ఎకరాకు ఐదు నిమిషాలు సరిపోతుంది. ఎకరా విస్తీర్ణంలో వరికి రూ.350, మిరపకు రూ.400 లెక్కన అద్దె చెల్లిస్తున్నారు. సమయంతో పాటు సొమ్ము ఆదా చేసుకొంటున్నారు. డ్రోన్‌తో పిచికారీ చేసే పురుగు మందు పైరు మొదళ్ల వరకు చేరుతుండటంతో తెగుళ్లు, చీడపీడల నియంత్రణ సులభతరమై ఆశాజనక దిగుబడి సాధిస్తున్నారు.

**ఉపాధికి ఊతం :** డ్రోన్, బ్యాటరీ కొనుగోలు, నిర్వహణకు రూ.10-15 లక్షల వరకు సొమ్ము వ్యయం చేయాల్సి వస్తోంది. ఇది రైతులకు భారం కావడంతో ఆసక్తి గల యువకులు డ్రోన్ అందుకు అవసరమైన బ్యాటరీలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. ఎక్కువ మంది స్వయం ఉపాధి పొందేలా రాయితీ కింద బ్యాంకు రుణాల ద్వారా డ్రోన్‌ల సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

శ్రమ తగ్గింది హేమారెడ్డి, రైతు
ఐదెకరాల్లో వరి పైరుకు డ్రోన్‌తో మందు పిచికారీ చేశా. అరగంటలో పని పూర్తయ్యింది. సమయంతో పాటు ఖర్చు తగ్గింది. రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్‌లు అందించాలి.

**ప్రతి నెలా రూ.30 వేల వరకు ఆదాయం**

రూ.10 లక్షల దాకా వెచ్చించి డ్రోన్, బ్యాటరీలు కొనుగోలు చేశా. మిరప, వరి పంటలకు మందులు పిచికారీ చేస్తూ అద్దె రూపేణా ఆదాయం పొందుతున్నా. ఖర్చులుపోనూ సగటున నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తున్నా.జగన్నాథ, యర్రగుంట

# ఉచిత వ్యూహం.. అంతా అనూహ్యం!!



విశాఖపట్నం : హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యా సంస్థకు వైకాపా ప్రభుత్వ హయాంలో అగనంపూడిలో 16.17 ఎకరాలు ఉచితంగా కేటాయించింది. విద్యారంగానికి చేయూత ఇచ్చే నిర్ణయమే అయినా...తెర వెనక సాగిన వ్యవహారాలు అనుమానాలు రేపుతున్నాయి. 2023లో భూ కేటాయింపు చేస్తూ రహస్య జీవో విడుదలయింది. ఆ స్థలాన్ని వ్యూహాత్మకంగా కట్టబెట్టడం వెనుక కొందరికి భారీగా లబ్ధి చేకూరిందన్న ఆరోపణలున్నాయి. ఇందులో కీలక నేతలతో పాటు ప్రభుత్వ అధికారుల హస్తం ఉందని సమాచారం. విలువైన ఆ స్థలాన్ని ఉచితంగా అప్పగించడంలో ఓ ఉన్నతాధికారి, మండలాధికారి కీలకంగా వ్యవహరించారనే చర్చ సాగుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.వందల కోట్లు విలువ చేసే ఆ భూములను ఎలా కట్టబెట్టారన్న అంశంపై కూటమి ప్రభుత్వం ఆరాతీస్తున్నట్లు సమాచారం.

**నివేదికలు కాదని:** ఎకరా రూ.1.8 కోట్లకు కేటాయించొచ్చని నాడు కలెక్టరు నుంచి నివేదిక వెళ్లింది. దాన్ని భూపరిపాలనశాఖకు పంపగా రూ.34 కోట్లు చెల్లించాలని సూచించారు. అయితే జిల్లా ప్రతిపాదనలు, సీసీఎల్ఏ నిర్ణయాలు పక్కన పెట్టేశారు. భూమి ఉచితంగా కేటాయించేలా దస్త్రాలు నడిచాయి. విద్యాహక్కు చట్టం కింద 25 శాతం సీట్లు, స్థానికులకు మరో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తామని పేర్కొనగా...పరిశీలించిన ప్రభుత్వం ఉచితంగా కేటాయిస్తూ జీవో ఇచ్చింది. వాస్తవానికి విద్యాహక్కు చట్టం కింద కొన్ని సీట్లు తప్పక కేటాయించాలి. ఉచిత సీట్ల పేరుతో దస్త్రం నడిపించి తెరవెనుక కొందరు భారీగా లబ్ధి పొందినట్లు సమాచారం.

**వివాదాస్పద భూములైనా:** అగనంపూడిలో ఓ భూస్వామికి చెందిన 30 ఎకరాలు భూ పరిమితి చట్టం ప్రకారం 1975-76లో ప్రభుత్వానికి దక్కాయి. ఈ భూముల్లో కొందరు రైతులకు ప్రభుత్వం డీపట్టాలు ఇచ్చింది. కొంతకాలం తర్వాత లక్ష్యానికి విరుద్ధంగా వినియోగిస్తున్నారని పట్టాలను రద్దు చేశారు. అనంతరం రైతులు కోర్టును ఆశ్రయించగా అవకాశం ఇవ్వాలని చెప్పడంతో మళ్లీ వారికే అప్పగించారు. రైతులు మళ్లీ ఆ భూములను దుర్వినియోగం చేశారు. దీంతో ఆ పట్టాలను ప్రభుత్వం రద్దు చేసింది. 1990లో కొందరు ఈ భూముల్లో పదెకరాలు తమవని పత్రాలు సృష్టించారు. అప్పటి ఆర్డీవో కోర్టులో వాటిని కొట్టేశారు. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లినా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. 2023లో ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంది. విద్యా సంస్థకు అప్పగించడం గమనార్హం.

# కౌలు రైతులకు తీపి కబురు

కాకినాడ : వ్యవసాయంలో 90 శాతం వాటా కౌలు రైతులదే. అలాంటి కౌలు రైతులకు అటు ప్రభుత్వ పరంగా, ఇటు బ్యాంకుల నుంచి తగిన ప్రోత్సాహం అందడం లేదు. దాంతో పంటల సాగుకు పెట్టుబడులకోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వపరమైన రాయితీలు అందాలంటే సవాలక్ష ఆటంకాలు ఎదురువుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రభుత్వ ప్రకటన కౌలురైతులకు ఊరటనిస్తోంది. ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో సీఎం చంద్రబాబు మే నెలలో రైతులకు 'అన్నదాతా సుఖీభవ' అమలు చేస్తామని ప్రకటించారు. బుధవారం అసెంబ్లీలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కౌలు రైతులకూ 'అన్నదాతా సుఖీభవ' అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఆరుగాలం శ్రమిస్తున్న కౌలు రైతులకు ఏటేటా ఏదో ఒక రూపంలో నష్టాలు తప్పటం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలతో రైతులు పంట నష్టాలు చవిచూస్తున్నారు. కొన్ని సార్లు పండిన పంటకు



గిట్టుబాటు ధర లభించకా ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వ రాయితీలు పొందేందుకు సాగు అర్హత(సీసీఆర్సీ) కార్డులు అవరోధంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వాలు ఇచ్చే పెట్టుబడి రాయితీ, బ్యాంకు రుణాలు, ఇతర పథకాలు పొందేందుకు సీసీఆర్ కార్డులు తప్పనిసరి. ఇవి పొందాలంటే భూయజమాని కౌలు రైతుకు సహకరించాలి. ఇందుకు కావాల్సిన పత్రాలను భూయజమానులు ఇవ్వకపోవటంతో అధిక శాతం కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వ రాయితీలకు, బ్యాంకు రుణాలకు దూరంగా ఉంటున్నారు. పెట్టుబడుల కోసం అధిక వడ్డీలు భరించి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ తాజా ప్రకటన కౌలు రైతులకు ఊరటనిస్తోంది. సాగు అర్హత(సీసీఆర్) కార్డులతో పనిలేకుండానే 'అన్నదాతా సుఖీభవ' పథకాన్ని అమలు చేస్తామని వ్యవసాయ మంత్రి హామీ ఇచ్చారు. ఈ-పోర్టల్‌లో నమోదు చేసుకున్నవారికి ఏటా రూ.20 వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేసిన ప్రకటన కౌలురైతుల్లో ధీమా పెంచుతోంది. ఈ పథకం అమలుకు 2025-26 వార్షిక బడ్జెట్‌లో రూ.9,400 కోట్లు కేటాయించారు.

# పేదలకు ఉపాధి భద్రత

కాకినాడ : జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లో జిల్లా ముందంజలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024-25 సంవత్సరానికి పెద్దఎత్తున ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులకు భారీగా సామగ్రి వ్యయాన్ని కల్పించింది. చెరువుల్లో పూడికతీత, పుంతదారులు, ఫారం పాండ్స్, ఉద్యాన పంటలు వంటి వనరులను అభివృద్ధి చేస్తోంది. జిల్లాలో 20 మండలాల పరిధిలో 2024-25 సంవత్సరానికి 69 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటివరకు 69.62 లక్షల పనిదినాలు కల్పించి రికార్డు సాధించారు. ఈనెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 72 లక్షల పనిదినాలు కల్పించే అవకాశం ఉంది.

**రూ.173.85 కోట్లు వేతనాల చెల్లింపు..**

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి కూలీల విషయంలో ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంది. పనులు చేసిన వారంలో సొమ్ము జమ చేస్తున్నారు. ఈ ఏడాదిలో గరిష్ఠంగా రోజుకు రూ.289 చెల్లించగా, సగటున రూ.251 ఇవ్వగలిగారు. ఇప్పటివరకు 2,30,356 మందికి పని కల్పించడం ద్వారా రూ.173.85కోట్లు చెల్లించారు. ఇప్పటివరకు కల్పించిన పనిదినాలతో జిల్లాకు రూ.112కోట్ల మేర మెటీరియల్ కాంపొంనెంట్(సామాగ్రి వ్యయం) సమకూరింది. దీని ద్వారా పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. ఈనెలాఖరుకు మరింత సామగ్రి వ్యయం నిధులు సమకూరే అవకాశం ఉంది. జిల్లాలో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించగలిగామని, ఈనెలాఖరులోగా మరింత మందికి పని కల్పిస్తామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలు నిర్దేశించి బడ్జెట్ తయారు చేస్తున్నట్లు చెప్పారు.

# అపురూప కట్టడం.. నిర్వహణ కష్టం

పి.గన్నవరం : పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదీ పాయపై ఉన్న డొక్కా సీతమ్మ అక్విడక్టు కం రోడ్డు వంతెనకు ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఏళ్లతరబడి నిర్వహణ కరవైంది. దీనిద్వారా రాజోలు దీవిగా వ్యవహరించే పి.గన్నవరం మండలంలోని లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, మానేపల్లి గ్రామాలతో పాటు మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగు, లక్షలాది మందికి తాగునీరు అందించే సమగ్ర రక్షిత పథకాలకు ముడినీరు(రా వాటర్) చేరుతుంది. రోడ్డు రవాణా మార్గంగా ఉపకరిస్తుంది. ఇంతటి ప్రాధాన్యం గలిగిన ఈ అక్విడక్టు నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రధానంగా అక్విడక్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు పుష్కర కాలంగా వెలగడం లేదు. రోడ్డు మార్గం దెబ్బతింది. ట్రఫ్ మీదున్న టోపాత్‌పై పూర్తిస్థాయిలో రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు దీపాల పునరుద్ధరణ, రోడ్డు మార్గానికి మరమ్మతులు, టోపాత్‌పై పూర్తిగా రెయిలింగ్ ఏర్పాటు చేసేందుకు గత వైకాపా ప్రభుత్వంలో స్థానిక జలవనరుల శాఖ డీఈఈ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ పనులు చేయాలంటే రూ.కోటి కావాలి. అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఒ.ఎన్.జి.సి. సీఎస్సార్ పనుల కింద నిధులు తీసుకొస్తామని ప్రకటించి ఆరు నెలలు దాటిపోయింది. ఇంతవరకు రాలేదు. ఇప్పటికైనా మంజూరైతే పనులు చేసేందుకు వీలుంటుంది. ముఖ్యమైన కట్టడం దృష్ట్యా ఏటా నిర్వహణ నిధులు కేటాయించేందుకు పాలకులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**కలెక్టర్‌కు నివేదించాం**

డొక్కా సీతమ్మ అక్విడక్టు మరమ్మతు పనుల కోసం రూ.కోటి కావాలని స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయం అధికారులు తెలియజేశారు. ఈ నిధులను ఒ.ఎన్.జి.సి. ద్వారా సేకరించేందుకు కలెక్టర్‌కు పంపాం. తప్పకుండా మంజూరవుతాయి. ఏటా నిర్వహణ నిధులు కేటాయించేలా కృషి చేస్తాను. గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్యే, పి.గన్నవరం

చురకలు



## కల్లాల్లో పంట.. కళ్లల్లో మంట

కర్నూలు : ఓ వైపు పెట్టుబడుల భారం.. మరో వైపు తెగుళ్ల భయం.. వీటికి తోడు మార్కెట్‌లో ధరలేక మిర్చి రైతులు సతమతం అవుతున్నారు. కర్నూలు విపణిలో గత 15 రోజులుగా ధరలు 'నేల'చూపులు చూస్తున్నాయి. వ్యాపారులు సిండికేటై ధరలు అమాంతం తగ్గించేశారు. రెండు, మూడు లాట్లకు మాత్రమే అధిక ధర రాస్తున్నారు. మిగిలిన లాట్లకు రూ.10 వేల లోపే ధర నమోదు చేస్తున్నారు. నాణ్యత సరిగా లేదని.. తేమశాతం అధికంగా ఉందని.. రెండో రకం సరకు అంటూ వివిధ కారణాలతో ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెడితే కనీసం ఖర్చులు రావడం లేదని.. అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

**వారంలోనే రూ.3 వేలు తగ్గింది**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 26,250 క్వింటాళ్ల వరకు ఎండుమిర్చి క్రయవిక్రయాలు జరిగాయి. ఇప్పటి వరకు క్వింటా గరిష్ఠ ధర రూ.20 వేలు ఒక్కసారి పలకలేదు. గతేడాది డిసెంబరు 19న మధ్యస్థ ధర క్వింటా రూ.15,8 20 పలికింది. ఆ తర్వాత అదే నెల 27న రూ.15,909, ఈ ఏడాది జనవరి 3న రూ.15,313, 22న రూ.13,809, 27న రూ.13,009, 31న రూ.12,249గా ఉంది. ఫిబ్రవరి 8వ తేదీన రూ.8,899కు పడిపోయింది. వారం రోజుల వ్యవధిలోనే క్వింటాపై రూ.3 వేలకు పైగా ధర పతనమవడం గమనార్హం.

**తూకాల్లో మోసాలు**

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలతో తూకాలు వేస్తున్నారు. ఈ-పాస్ యంత్రాలకు అనుసంధానం చేయడం లేదు. ఒక రైతుకు సంబంధించి ఒక సంచి తూకం వేయగా 44.800 కిలోలు తూగింది. గన్నీ బ్యాగు బరువు ఒక కిలో.. ఈ నేపథ్యంలో వ్యాపారికి 43 కిలోల కింద మాత్రమే లెక్కేశారు. 800 గ్రాముల అప్పనంగా ఉచితంగా మిగిలింది. ఇలా ఒక రైతు.. ఒక్కో బస్తాపై 500 గ్రాముల నుంచి 800 గ్రాముల వరకు కోల్పోతున్నారు. గన్నీ బ్యాగుల బరువు పోను ఒక్కో బస్తాపై అదనంగా 500 గ్రాముల ఎక్కువ తూకాన్ని వ్యాపారుల ఖాతాల్లోకి రాసేసుకున్నారు.

**అప్పులే మిగిలాయి..: మూరెప్ప, సి.బెళగల్**

రెండెకరాల్లో మిర్చి సాగు చేశా. రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. నెల కిందట 6 క్వింటాళ్ల విక్రయించా. ప్రస్తుతం 4 క్వింటాళ్ల తీసుకొస్తే వ్యాపారులు మరీ అధ్వానంగా ధర తగ్గించి రాస్తున్నారు. క్వింటా రూ.12-13 వేల ధర పలకాల్సి ఉంది. సరకు నాణ్యతగా ఉన్నా.. నాసిరకం, తేమ శాతం అధికంగా ఉందంటూ తక్కువ ధర రాశారు. క్వింటాపై రూ.4 వేల వరకు ధర పతనమైంది. చివరికి అప్పులే మిగులుతున్నాయి.

## నీరు.. అందని శివారు!

విశాఖ : విశాఖ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ఇతర జిల్లాల్లోని నీటి వనరుల్లో ఆశించినస్థాయిలో నిల్వలు ఉండడంతో... ఈ ఏడాది వేసవిలో నీటి ఎద్దడి ఉండకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులతో కొన్ని ప్రాంతాలకు నీటి ఇక్కట్లు తప్పేలాలేవు.

**ఇదీ పరిస్థితి:** నగరానికి నీరందించే ఏలేరు కాలువ నిర్వహణ పనుల నిమిత్తం త్వరలో నీటి సేకరణ పూర్తిగా నిలిపేస్తారు. అదే సమయంలో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మేహాద్రిగెడ్డ నుంచి నీటిని తీసుకోవాలని ప్రణాళికలు రూపొందించారు. వేసవి ప్రారంభం నాటికి ఏలేరు కాలువ పునరుద్ధరణ పనులు పూర్తయితే... నీటికి కొదవ ఉండదు.నగర ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్న టీఎస్సార్‌తో సహా, ఇతర ప్రధాన కేంద్రాల్లో నీటిని పంపింగ్ చేసే మోటార్ల స్థానంలో ఇటీవలే కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు అమృత్ పథకంలో భాగంగా రూ.50 కోట్లు ఖర్చు చేశారు. దీంతో సరఫరాలో వేగం పెరగనుంది.

**ఆ ప్రాజెక్టు పూర్తయితే..:** తాటిపూడి, రైవాడ, ఏలేరు రిజర్వాయర్ల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి, టీఎస్సార్‌కు పంపిస్తున్నారు. అక్కడ నుంచి నగర వ్యాప్తంగా పంపింగ్ జరిగిన తర్వాత శివారు ప్రాంతాలకు పంపింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ఆలస్యమవడంతో పాటు, తక్కువ మొత్తంలో నీరు అందుతుంది.
అయితే నరవలోని మంచినీటి శుద్ధి కేంద్రం నుంచి రూ.250 కోట్ల వ్యయంతో ముడసర్లోవ వరకు నిత్యం 2 ఎంజీడీల నీటిని తరలించే



ప్రాజెక్టును జీవీఎంసీ ప్రాజెక్టు విభాగం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే టీఎస్సార్ నుంచి వెంకోజీపాలెం వరకు మాత్రమే నీటిని సరఫరా చేస్తే సరిపోతుంది. బీ హనుమంతువాక నుంచి ఆరిలోవ, రవీంద్రనగర్, ఇతర శివారు ప్రాంతాలన్నింటికీ కొత్త ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసే వీలుంటుంది. అయితే మూడేళ్ల నుంచి ప్రాజెక్టు పనులు ముందుకు కదలకపోవడంతో, శివారు ప్రాంతవాసులు వేసవిలో నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అక్కడే సమస్య:** ప్రజలకు అవసరమైన నీటిని సకాలంలో సేకరిస్తున్నప్పటికీ, శివారు ప్రాంతాలకు సక్రమంగా సరఫరా జరగడం లేదు. ఆరిలోవ, రవీంద్రనగర్, విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఎండాడ, మధురవాడ, కారుషెడ్డు, పీఎంపాలెం, కొమ్మాది ప్రాంతాలకు వేసవిలో రెండు రోజులకోసారి మాత్రమే నీటిని అందించే వీలుంటుంది.
టీఎస్సార్ (టౌన్ సర్వీసు రిజర్వాయర్) నుంచి ఆయా ప్రాంతాలకు పైపులైను ద్వారా నీటిని పంపింగ్ చేసే సమయం తక్కువగా ఉండటం, మిగతా ప్రాంతాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో శివారు ప్రాంతాల రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండడం లేదు. దీంతో వేసవిలో రోజూ నీటిని సరఫరా చేసే పరిస్థితి ఉండడం లేదు.
త్వరలో పనులు చేపడతాం: నరవ నుంచి ముడసర్లోవ వరకు ప్రతిపాదించిన పైపులైన్ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభమవు తాయి. ఈ మేరకు ప్రభుత్వం డీపీఆర్‌ను (సవివర పథక నివేదిక) అంగీకరించింది. వచ్చే ఏడాది వేసవి నాటికి పనులు పూర్తి చేస్తాం. ఈ ఏడాది శివారు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూస్తాం.కేవీఎన్.రవి, జీవీఎంసీ మంచినీటి సరఫరా, ప్రాజెక్ట్స్ పర్యవేక్షక ఇంజినీర్

## పేరుకోసం పట్టు.. కష్టాన్ని తీర్చేటట్టు



ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు చేనేత కార్మికులు అగ్గిపెట్టెలో ఇమిడే చీరను తయారు చేసి అందరి మెప్పును పొందారు. మారుతున్న అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లతో చీరలను తయారుచేస్తున్నా సొంత ఊరికి గుర్తింపు రావడం లేదనే ఆవేదన కార్మికుల్లో నెలకొంది. నేసిన చీరలన్నీ గద్వాల పట్టు, ధర్మవరం పట్టుగా గుర్తింపు పొందుతున్నాయని, ఎమ్మిగనూరు బ్రాండ్‌మీదుగా నమోదవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు.

**కొత్త డిజైన్లకు ప్రాధాన్యం**

కర్నూలు, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, గుడేకల్లు, కోసిగి, ఆదోని, గూడూరు, కోడుమూరు, ప్రాంతాల్లో దాదాపు 17వేల చేనేత పట్టు మగ్గాలు ఉన్నాయి. మగ్గాలకు అవసరమైన ముడిసరకు, మగ్గాలు, పట్టుదారాలను మాస్టర్ వీవర్స్ సరఫరా చేస్తారు. గద్వాల, అనంతపురం జిల్లాలకు చెందిన మాస్టర్ వీవర్స్ దాదాపు 400 మందికి పైగానే కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఒక చీర విలువ రూ.5 వేల నుంచి రూ.20వేలుండగా, పట్టుచీరను తయారు చేయాలంటే ఆరు రోజుల నుంచి 15 రోజులు పడుతుంది. చేనేత కార్మికులకు కూలి కింద ఒక చీరకు రూ.600 నుంచి రూ.2 వేలు ఇస్తారు. ఎమ్మిగనూరులో తయారుచేసిన చీరలకు వివిధ ప్రాంతాల వారు పేర్లు పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. గద్వాల, కళాంజలి, ధర్మవరం పట్టుచీరలు ఇక్కడ తయారు చేసినవే కావడం గమనార్హం.

**అమరావతిలో ప్రదర్శన**

అమరావతిలో ఇటీవల రెండు రోజుల పాటు చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మిగనూరు నుంచి 25 మంది కార్మికులకు అవకాశం కల్పించారు. దిల్లీకి చెందిన ఐఏఎస్ అధికారులు, ఏపీ అధికారులు నేతలు తయారు చేసిన చీరల విధానాన్ని పరిశీలించారు. కోటకొమ్మలు, శంఖులు, ఏనుగు, బుట్టబొమ్మలు, ఒంటె, జింక, ఇతర చిత్రాలతో నేసిన చీరల్ని పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు. పలు సూచనలు అందించారు.

**కోటకొమ్మలపై ప్రత్యేకం: పెద్ద రంగన్న, మాస్టర్ వీవర్స్ ఎమ్మిగనూరు**

అమరావతిలో రెండు రోజుల చేనేత వస్త్రాల ప్రదర్శనకు వెళ్లాం. ఎమ్మిగనూరులో తయారు చేసిన చీరల్ని చూపించాం. కొన్ని సూచనలు చేసి మెలకువలు నేర్పించారు. పట్టుదారాలతో బార్డర్, కోటకొమ్మలు, బుట్టలను నేయాలని సూచించారు. మనం తయారుచేస్తున్న వాటిలో ఈ మార్పులు చేస్తే మరింత మెరుగుదల కన్పిస్తుందన్నారు.

**నూతన ఆకృతుల్లో చీరలు: వెంకటేశ్వర్లు, వ్యాపారి**

కొత్త ఆకృతుల్లో చీరల్ని నేసేందుకు ప్రభుత్వం కొంత అవగాహన కల్పించింది. డిజైన్లలో కొన్ని మార్పుల్ని నేర్చుకున్నాం. ఏనుగు, జింక, బుట్ట, పెద్ద అంచు చీరపై వంకర వంకరగా ఉండే గీతలను, బుట్టలను నేయిస్తున్నాం. తమిళనాడు, మహారాష్ట్రలకు వెళ్లి కొత్త అంశాలు నేర్చుకున్నా. ప్రభుత్వం కూడా మాకు మూడు రకాల డిజైన్లు చూపించింది. పెద్ద బార్డర్‌కు కొత్త పువ్వులు, ఆకులతో కలిసి ఉండేలా అందమైన బొమ్మలు వేస్తే బాగుంటుందని సూచించారు. ప్రభుత్వం మాకు మార్కెట్ వసతి, రాయితీ నూలు, ఇతర సదుపాయాలు కల్పించాలి.

**30 ఏళ్లుగా వృత్తిలో.. : పరమేశ్, మాస్టర్ వీవర్స్, ఎమ్మిగనూరు**

చేనేత వృత్తిలో 30 ఏళ్లుగా ఉన్నా. గతంలో చేనేత మగ్గం నేసి చిన్నగా వ్యాపార రంగం వైపు వచ్చా. ఇప్పుడు దాదాపు వంద మగ్గాల వరకు నడుపుతున్నా. ఇప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా పట్టు మగ్గాలను నేస్తున్నా. ప్రభుత్వం మాస్టర్ వీవర్స్‌కు మార్కెట్ వసతి, చేనేత శాల, తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

## గురుకులాల్లో ప్రవేశాలకు వేళాయె!



డోన్ : పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి కార్పొరేట్ తరహాలో బోధించేందుకు గానూ 2025-26 ఏడాదికి గానూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేరికలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.అయిదో తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య, వసతిని పొందే అవకాశం ఉంటుంది. ఐఐటీ, నీట్ అకాడమీ శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశాలకు వచ్చేనెల ఆరోతేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 15 వరకు డా.బి.ఆర్.గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని అరికెర, సి.బెళగల్, చిన్నటేకూరు, నంద్యాల జిల్లాలో జూపాడుబంగ్లా, డోన్ ప్రాంతాల్లో బాలుర ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో డోన్, ఆళ్లగడ్డ రెగ్యులర్, ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పిఆర్, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలో కంబాలపాడు, వెల్దుర్తి, దిన్నెదేవరపాడు, లక్ష్మాపురం ప్రాంతాల్లో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 8,575 మంది చదువుతున్నారు. చిన్నటేకూరులో సైతం బాలుర ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐఐటీ, నీట్‌నకు అకాడమీ కోచింగ్ ఇస్తారు. ఈ గురుకులంలో 2023-24 ఏడాదిలో మెడికల్ సీట్లకు గానూ 60 మంది రాస్తే 20 మందికి, ఐఐటీ, ఎన్ఐటీలలో 41 మందికి సీట్లు వచ్చాయని డీసీవో శ్రీదేవి తెలిపారు.

**ఇవి తప్పనిసరి**

ఐదో తరగతిలో చేరికకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించాలి.
ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీ-సి) విద్యార్థులు 2014 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలి.
జూనియర్ ఇంటర్‌లో చేరికలకు 2024-25 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు.
ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రుల ఏడాది ఆదాయం రూ.లక్షకు మించకూడదు
ఐదో తరగతికి హెచ్‌టిటిపి/ ఏపీబీఆర్ఏజిసిఇటి.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్, ఇంటర్‌కు సంబంధించి హెచ్‌టిటిపి/ఏపిబిఆర్ఏజిసిఇటి. ఏపిసిఎస్ఎస్. ఇన్-ఇంటర్‌ద్వారా దరఖాస్తులు చేయాలి
ఒక్కో పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు, కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌కు 80 సీట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.
జూనియర్ ఇంటర్‌లో డోన్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల మినహాయిస్తే 14 కళాశాలల్లో 1,120 సీట్లు, ఐదో తరగతికి సంబంధించి 15 పాఠశాలల్లో 1,200సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు.
ఏవేవి అవసరమంటే..?
విద్యార్థి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్‌కార్డు, పూర్వ తరగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి.
చరవాణి నంబరు తప్పు లేకుండా నమోదు చేయాలి.
ప్రతిభా పరీక్షలో మెరిట్ జాబితా ప్రకారం నేరుగా కేంద్ర కార్యాలయం నుంచి సీటు కేటాయింపు ఉంటుంది.
ఉచితంగా దరఖాస్తు: డా.ఐ.శ్రీదేవి, ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీవో ఏటా ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. బయట దరఖాస్తు చేయించుకుంటే డబ్బులు చెల్లించాలి. మీ సమీపంలోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లోకి వెళ్లి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తాం. ఐదో తరగతి పిల్లలందరికీ సీటు రావడానికి 4వ తరగతి సిలబస్ వరకు చదివించాలి. ఇంటర్ వారికి పదో తరగతి సిలబస్ చదవాలి. నిర్ణీత సమయంలో దరఖాస్తు చేయించుకోవాలి.

## సబ్జీ కూలర్.. రోజంతా తాజా కూరగాయలు..!

విశాఖ : రైతుబజారుకు తీసుకొచ్చిన కూరగాయలు, ఆకుకూరలు తాజాగా లేకపోతే ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ముఖ్యంగా ఆకుకూరలు గంటల వ్యవధిలోనే వాడిపోతున్నాయి. కష్టనష్టాలు పడి పండించిన పంటను పడేయలేక రైతులు తల్లడిల్లుతున్నారు. మరో వైపు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కూలర్ పెట్టుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. వారి సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేకంగా పర్యావరణ హిత సబ్జీ కూలర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆసక్తి గల రైతులకు రాయితీపై వీటిని విక్రయించనున్నారు. ప్రయోగాత్మకంగా ఒక సబ్జీ కూలర్‌ను ఎంవీపీ రైతుబజారులో ఏర్పాటు చేశారు. **విద్యుత్తు అవసరం లేదు.. నీరుంటే చాలు** విద్యుత్ లేకుండానే సబ్జీ కూలర్ పని చేస్తుంది. కేవలం నీటిని మాత్రమే ఇందులో పోయాల్సి ఉంటుంది. అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలను నాలుగు రోజుల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దీన్ని ప్రతి రోజూ 25 లీటర్లకు తక్కువ కాకుండా నీటితో నింపాలి. కూలర్‌కు నాలుగువైపులా ఉన్న రంధ్రాల ద్వారా సమానంగా నింపాలి. ఆ నీరు నాలుగువైపులా వ్యాపించి బయట నుంచి వచ్చే వేడి గాలిని నియంత్రిస్తుంది. తద్వారా కూలర్ లోపల చల్లగా ఉంటుంది.సాధారణంగా ఆకుకూరలు విక్రయించే రైతులు ప్రతి 15 నిమిషాలకు నీటిని చిలకరిస్తుంటారు. వాటిని ఈ సబ్జీ కూలర్‌లో నిల్వ ఉంచితే తాజాదనం కోల్పోకుండా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. తద్వారా రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. రైతులు వీటిని సొంతానికి కొనుగోలు చేయాలనుకుంటే 50 శాతం రాయితీపై మార్కెటింగ్ శాఖ సరఫరా చేస్తుంది. 100 కిలోల సామర్థ్యం కలిగిన సబ్జీ కూలర్ రాయితీపై రూ.25వేలకు లభిస్తుంది. విద్యుత్తు ఖర్చు ఉండదని, మరమ్మతులు కూడా రావని అధికారులు చెబుతున్నారు.

## బస్టాండుల్లో నీరోచక్రవర్తులు

కర్నూలు : పెళ్లిళ్ల సీజన్ మొదలైంది.. బస్సుల్లో రద్దీ నెలకొంది.. బస్టాండులు కిటకిటలాడుతున్నాయి.. అక్కడ తాగడానికి నీళ్లు కొనుక్కోవాల్సిందే.. కనీసం చేతులు శుభ్రం చేసుకుందామంటే నీటిధారలు కనిపించడం లేదు.. రూ.20 వెచ్చిస్తే తప్ప దాహం తీరడం లేదు. ఎండవేడిమి పెరిగింది.. ఫ్యాన్లు తిరక్క ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. కనీసం కూర్చోవడానికి సరిగా కుర్చీలు ఉండటం లేదు.. టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికుల నుంచి సేవా రుసుము కింద రూ.1 నుంచి రూ.3 వరకు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతినెలా రూ.కోటి వరకు సమకూరుతుంది. వీటితో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి. ఏ బస్టాండులోనూ సరైన మంచినీటి వసతి లేనట్లు 'బృందం పరిశీలనలో తేలింది.
మొత్తం డిపోలు: 12 (కర్నూలు-1, 2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి డోన్, కోవెలకుంట్ల, నందికొట్కూరు, నంద్యాల)
ప్రస్తుతం బస్సులు : 960



నిత్యం బస్సుల ప్రయాణం : 3 లక్షల కి.మీ.
రాకపోకలు సాగించే ప్రయాణికులు : 1.60 లక్షలు
రోజువారీ ఆదాయం : రూ. 40-60 లక్షలు

**జోరందుకున్న వ్యాపారం**

రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు బస్టాండుకు నిత్యం వెయ్యికి పైగా బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.
తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు పలు జిల్లాల బస్సులు వస్తుంటాయి. 30-40 వేల మంది ప్రయాణికులు వెళ్తుంటారు. 24 గంటలూ రద్దీ ఉంటుంది. ఇంత ముఖ్యమైన బస్టాండులో కనీసం చేతులు కడుక్కోవడానికి నీళ్లు లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీన్ని ఆసరా చేసుకొని దుకాణదారులు నీటి దందా చేస్తున్నారు. 200 వరకు దుకాణాలు ఉండగా ఒక్కోదాంట్లో నిత్యం రూ.2 వేలకు పైగా నీటి వ్యాపారం జరుగుతోంది.

**శుభ్రం చేసి ఎన్నాళ్లు అయ్యిందో**

కర్నూలు నంద్యాల, ఆదోని బస్టాండ్లలో బోరు నుంచి వచ్చే నీరు వాసన వస్తుండటంతో ప్రయాణికులు తాగలేకపోతున్నారు.
కర్నూలు బస్టాండులో ఉన్న నీటి కేంద్రాలన్నీ మరుగుదొడ్లు, మూత్ర విసర్జనశాలలకు సమీపంలో ఉండటం.. భరించరాని వాసన వస్తుండటంతో ఈ నీటిని తాగేందుకు జనం ఇష్టపడటం లేదు.
తాగునీరు సరఫరా చేసే పైపులు అధ్వానంగా ఉన్నాయి. బస్టాండ్లపై ఉన్న ట్యాంకులకు సంబంధించి మూతలు దెబ్బతిన్నాయి. తాగునీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికితోడు నీటి ట్యాంకులు శుభ్రం చేసి ఏళ్లు అవుతుండటం గమనార్హం.

## ఈ నిర్లక్ష్యాన్ని ఏ'మందు'రు

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యశాలలో అవసరమైన ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. చేసేది లేక బయటకు రాస్తున్నారు. ఒక్కోరోగిపై రూ.1,000 నుంచి రూ.1,200 వరకు భారం పడుతోంది.

**ఏటా రూ.8 కోట్లు కేటాయింపు**

ఔషధాల కోసం ఏటా నాలుగు క్వార్టర్లకు కలిపి రూ.8 కోట్ల వరకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ప్రస్తుతం రోగుల సంఖ్య భారీగా పెరగడంతో ఔషధాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. మరోవైపు సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి అవసరమైన ఔషధాలు రాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొంతమేర బయట నుంచి తెప్పిస్తున్నారు.
1. విశ్రాంత ఉద్యోగి అనిల్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆదివారం అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి ఫ్లూయిడ్స్ ఎక్కించారు. అత్యవసర విభాగంలో ప్యాంటోప్ ఇంజెక్షన్ లేకపోవడంతో బయటకు రాశారు.
2. కొత్తపల్లెకు చెందిన శిరీషా కర్నూలు సర్వజన ఆస్పత్రిలో బాబుకు జన్మనిచ్చారు. శిశువుకు ఫిట్స్ రావడంతో వైద్యశాలలోని పీడియాట్రిక్ విభాగానికి రెఫర్ చేసి పంపారు. అక్కడ గత నెల 19వ తేదీ నుంచి చికిత్స అందిస్తున్నారు. నిత్యం మధుమేహం పరీక్షలు చేసేందుకు మూడుసార్లు గ్లూకోజ్ స్లిప్స్ రాసిస్తున్నారు. సుమారు 20 రోజుల నుంచి రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.
ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి రోగులొస్తుంటారు.
నిత్యం ఓపీ 3,420
ఐపీ 1,201
అత్యవసర విభాగానికి 400
వీటిని ఎందుకు తెప్పించడం లేదో
అత్యవసర విభాగంలో డైక్లోఫెనాక్, ప్యాంటోప్, హైడ్రో కార్టిసోన్, యాంటీ బయాటిక్స్, ఇన్సులిన్ సిరంజి, గ్లౌజ్‌లు, రక్తనమూనాలు సేకరించే ట్యూబ్‌లు తదితరాల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇవి అందుబాటులో లేకుంటే ఆసుపత్రి అధికారులు కొనుగోలు చేసి రోగులకు అందించాల్సి ఉంటుంది. అయినా ఎవరూ దృష్టి సారించడం లేదు. ఔషధాల సరఫరాకు టెండర్లు పిలిచి తెప్పించే అవకాశమున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఔషధాలకు సంబంధించి ఇండెంట్ పంపామని.. త్వరలో వస్తాయన్నారు.

చురకలు



# అభ్యసన తీరు అంచనాకు అవకాశం..

హిందూపురం : విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకం. ఇందులో ఉత్తీర్ణులైతేనే ఉన్నత విద్య, ఉద్యోగాలకు అవకాశం. పాఠశాల దశలో చివరి పబ్లిక్ పరీక్షలు పదో తరగతి విద్యార్థులు రాయనున్నారు. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ఆరంభం కానున్నాయి. ఈ పరీక్షల మాదిరిగానే ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 నుంచి 20 వరకూ ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పబ్లిక్ పరీక్షలు అనగానే విద్యార్థులకు భయం పుట్టుకొస్తుంది. విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలనే ఉద్దేశం. సన్నద్ధం చేయడానికి ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు రూపొందించింది. ఇప్పటికే ప్రశ్నపత్రాలు ఎంఆర్‌సీ కేంద్రాలకు సరఫరా చేశారు. నిర్ణీత సమయం ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులందరూ రాయడం వల్ల వారికి ఉపయోగంగా ఉంటుంది.

**అన్నీ కొత్త పాఠ్యాంశాలే** పదోతరగతి విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి పుస్తకాలు మారాయి. అన్ని కొత్త పాఠ్యాంశాలే.



గతంలో ఉన్న ప్రశ్నపత్రం, పాఠ్యాంశాలకు ఇప్పటి పుస్తకాలు, పరీక్షలకు వ్యత్యాసం ఉంది. కొత్త సిలబస్‌లో ఏఏ ప్రశ్నలు పరీక్షల్లో వస్తాయో తెలియని పరిస్థితి. ప్రీఫైనల్‌తో పాటు మార్చి 3 నుంచి గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలు విద్యార్థుల ఉత్తీర్ణతను దాదాపు నిర్ణయిస్తాయి. తాము ఎంత వరకూ అభ్యసనం చేశామో విద్యార్థులకు కూడా అంచనా వేసుకోవచ్చు. డిసెంబరు 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ అమలు చేస్తున్నారు. మార్చి 10 వరకూ ఈ కార్యక్రమం అమలులో ఉంటుంది. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రీఫైనల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని డీఈవో ప్రసాద్‌బాబు తెలిపారు.

# నీరుగార్చిన వైకాపా.. నీరు తెచ్చిన కూటమి

హిందూపురం : యోగివేమన జలాశయం నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకుండా నీరుగార్చింది. ఆయకట్టులో వేల ఎకరాల భూములున్నా కాలువల ఆధునికీకరణలేక గట్లు దెబ్బతినడంతో విడుదల చేసిన నీరంతా వృథాగా పోయేది. చివరి చెరువు వరకు నీరు రాకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు ఎదురయ్యేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువగట్ల నిర్వహణ, మరమ్మతులు చేపట్టడంతో లీకేజీలకు అడ్డుకట్టపడుతోంది.

జలాశయం నుంచి కుడికాలువ 18 కి.మీ, ఎడమ కాలువ 13.74



కి.మీ, గాండ్లవారిపల్లికి వెళ్లే ఉపకాలువ 6 కి.మీ. మొత్తం కాలువలు 38 కిలోమీటర్ల పొడవు ఉంది. కాలువకు గండ్లుపడి నీరు వృథాగా పోవడం, కాలువల్లో పూడిక పేరుకుపోయి కంపచెట్లు మొలవడంతో నీరు వేగంగా వెళ్లేదికాదు. వీటిపై 'నిధుల్లేక నీరసించిన యోగివేమన', 'పంటకాలువలు అస్తవ్యస్తం.. మరమ్మతులు శూన్యం', 'వృథాజలం.. వినియోగిస్తే ప్రయోజనం', దీంతో నిధులు మంజూరైనా టెండర్లు నిర్వహించడంలో జాప్యంతో పనులు మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక టెండర్లు నిర్వహించిన కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కుడికాలువలో నీరు వెళుతుండటంతో ఎడమ కాలువలో పూడికతీత, కంపచెట్లు తొలగిస్తున్నారు. తర్వాత గట్లకు కాంక్రీట్‌తో మరమ్మతులు చేయనున్నారు. కాలువ ఆధునికీకరణ పూర్తయితే ఆయకట్టు కింద ఉన్న ప్రతి చెరువుకు వేగంగా నీరువెళుతుంది. వీటిపై ఇరిగేషన్ జేఈ కృష్ణకుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం పూడికతీత, కంపచెట్లు తొలగించామని, త్వరలోనే గట్లకు మరమ్మతులు చేస్తామని తెలిపారు.

# దీపం.. డబ్బులొచ్చాయి

చిత్తూరు : జిల్లాలో దీపం–2 పథకం కింద ఉచిత సిలిండర్ల పంపిణీ పక్కాగా సాగుతోంది. తొలుత పథకం అమలుకు ఆపసోపాలు పడ్డారు. చరవాణులకు సంక్షిప్త సమాచారం రాకపోవడం, సిలిండరు బుక్ చేసుకున్నాక సొమ్ము జమకాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. వినియోగదారుల సందేహాల నివృత్తి నిమిత్తం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా ముగ్గురు సాంకేతిక సిబ్బందిని నియమించారు. నగదు జమకాని వినియోగదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్దకెళ్లి.. ఆధార్, బియ్యంకార్డు సమర్పిస్తే రాయితీ నగదు ఎందుకు రాలేదో కారణాలు తెలియజేస్తున్నారు. మూడునెలలకొకటి చొప్పున తొలి సిలిండరు పంపిణీ గతేడాది అక్టోబరు 31న ప్రారంభించారు. రూ.837 చెల్లిస్తే ఆ సొమ్ము మళ్లీ ప్రభుత్వం జమ చేస్తుంది. కేంద్రం రూ.19–50 రాయితీ సొమ్ము ఇస్తోంది. దీని ప్రకారం ఇప్పటివరకు జిల్లాలో వినియోగదారులకు రూ.26.23 కోట్లు జమయింది.

**తొలి సిలిండరు గడువు వచ్చేనెల వరకు..** ఈ పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వినియోగదారుల సందేహాలు నివృతి చేస్తున్నాం. తొలి సిలిండర్ పంపిణీ వచ్చే మార్చి నెలాఖరు వరకు గడువు ఉంది. అర్హులందరికీ రాయితీ నగదు జమవుతోంది. శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిపథకం పేరు : దీపం–2

లబ్ధిదారులు: 5,80,287

ఉచిత సిలిండర్ల పంపిణీ 3.27 లక్షలు

రాయితీ నగదు జమ రూ.26.23 కోట్లు

# అనధికార లేఅవుట్లు.. నిబంధనలకు తూట్లు



కదిరి : 'మండల కేంద్రమైన తలుపులలోని కుమ్మరపేట చింతవనంలో సుమారు మూడెకరాల్లో లేఅవుట్ ఏర్పాటు వేశారు. ఇక్కడ సెంటు విలువ రూ.4 లక్షల వరకు పలుకుతోంది. లేఅవుట్ తలుపుల–కదిరి ప్రధాన రహదారికి ఆనుకునే ఉంది. నిబంధనల మేరకు రోడ్లు, రిజర్వు స్థలం కూడా కేటాయించలేదు. పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి పొందలేదు.'

స్థానిక సంస్థల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పన్నుల రాబడి ఎంతో కీలకం. ఇంటి, ఆస్తి, సేవా పన్నులు చెల్లించని ప్రజలకు నోటీసులిచ్చి మరీ వసూలు చేస్తారు. పెద్ద మొత్తంలో వచ్చే ఆదాయానికి వ్యాపారులు ఎగవేత నామం పెడుతున్నారు. పంచాయతీల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. ప్లాట్ల వ్యాపారంతో రియల్టర్లు లాభాలు పొందుతూ పంచాయతీల ఆదాయానికి గండి కొడుతున్నారు. అడ్డుకోవాల్సిన పంచాయతీ సిబ్బంది రియల్టర్లతో కుమ్మక్కై చోద్యం చూస్తున్నారు. తద్వారా స్థానిక సంస్థల ఆదాయానికి భారీగా గండి పడుతోంది.'ఓబుళ దేవరచెరువు మండలం తిప్పేపల్లి రెవెన్యూ పొలం సర్వేనంబరు 163, 166ఎలో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా, క్రయవిక్రయాలు జరుపుతున్నారు. అధికారులు ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగిస్తూ అక్రమాలను చూస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు.'

**వ్యాపారులకే అధికారుల వత్తాసు**

ఇళ్ల స్థలాల కోసం వేసే లేఅవుట్ల విషయంలో అధికారుల తీరు వ్యాపారుల లాభానికే సాయమన్న చందంగా కనిపిస్తోంది. లేఅవుట్ల ఏర్పాటుకు అహుడాకు దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల మేరకు ఎకరాకు పదిసెంట్ల రిజర్వు స్థలం కేటాయించాలి. లేఅవుట్‌కు కనెక్టివిటీ రోడ్డు 40 అడుగులు, 33 అడుగుల ఇంటర్నల్ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అనుమతి పొందడానికి చతురస్రపు అడుగుకు రూ.40 చెల్లించాల్సి ఉంది. అలా పంచాయతీలకు రావాల్సిన రూ.కోట్ల ఆదాయాన్ని ప్రైవేటు వ్యక్తులు జేబులు నింపుకొంటున్నారు. ఇవేమీ పాటించకుండా 525 చోట్ల ప్లాట్లు వేసినట్లు అధికారులే గుర్తించారు. వీటన్నిటినీ క్షేత్రస్థాయిలో గమనిస్తున్నా పంచాయతీల ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేటు వ్యాపారులపై చర్యల్లేవు.

**చర్యలు తీసుకుంటాం- సమత, డీపీఓ** జిల్లావ్యాప్తంగా అక్రమ లేఅవుట్ల పరిశీలనకు ఆదేశించాం. క్షేత్రస్థాయిలో పంచాయతీల సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇప్పటికే వందల సంఖ్యలో అనధికారిక లేఅవుట్లను గుర్తించాం. రావాల్సిన ఆదాయాన్ని వసూలు చేస్తాం. అక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# దాణా కర్మాగారం.. ఎన్నాళ్లకు ప్రారంభం?




హిందూపురం : పశువుల అభివృద్ధి, పాల ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన దాణా తయారీ కోసం ఉమ్మడి రాష్ట్రంలో పశు దాణా ఉత్పత్తి కర్మాగారం తెలంగాణ పరిధిలోని జహీర్‌బాద్‌లో ఉండేది. రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో దీని ఏర్పాటుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించే ఈ ప్రాజెక్టును వెనుకబడిన రాయలసీమలో హిందూపురంలో ఏర్పాటు చేయాలని అప్పటి తెదేపా ప్రభుత్వం 2016లో నిర్ణయించింది. ఈ ప్రాంతంలో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకొంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కేంద్రం నిధులు కేటాయించింది. రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో 2016 నవంబరులో ఎమ్మెల్యే బాలకృష్ణ చేతులమీదుగా, పట్టణంలోని డెయిరీ కేంద్రం ప్రాంగణంలో దాణా తయారీ కర్మాగార నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. 2017లో పనులు చేపట్టారు. భవన నిర్మాణం, యంత్ర పరికరాల సరఫరా తదితర పనులన్నీ 2018 చివరి నాటికే పూర్తి అయ్యాయి. యంత్ర పరికరాలను అమర్చే పనులు మాత్రమే మిగిలాయి. అయితే అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం ఈ కర్మాగారం పాలిట శాపంగా మారింది. వైకాపా ప్రభుత్వం దాణా కేంద్రం పనులను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా ఉండిపోగా ఆరుబయట ఉన్న విలువైన యంత్రపరికరాలు ఎండకు ఎండి వానకు తడిసిపోతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**కర్ణాటక నుంచి అధిక ధరలకు..**

ప్రభుత్వమే దాణాను ఉత్పత్తి చేస్తే రైతులకు తక్కువ ధరకే అందించడానికి అవకాశం ఉండేది. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత పాడి రైతులు కర్ణాటకలో ఉత్పత్తయ్యే దాణాను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరోవైపు కేంద్రం మంజూరు చేసిన రూ.3 కోట్లకు పైగా నిధులు బూడిదలో పోసిన పన్నీరులా వృథా అయ్యాయి.

విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా పాడి పరిశ్రమ శాఖ అధికారులను పిలిపించి, సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. యంత్రాలు పనిచేసే స్థితిలో ఉంటే వెంటనే పనులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. లేదంటే సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయించి, దాణా ఉత్పత్తికి అవసరమైన పనులు చేపడతామని వివరించారు.

# మల్లన్న క్షేత్రం.. ప్రగతి నాదం



శ్రీశైలం : ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రం ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. దేశ, విదేశీ యాత్రికులను ఆకట్టుకునేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఇటీవల కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శి విద్యావతి ఆధ్వర్యంలో శ్రీశైలంలో అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పించే విషయమై ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. విడతల వారీగా ఆధునిక వసతులు కల్పించేందుకు కన్సల్టెన్సీల ద్వారా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలించేందుకు సోమవారం రాష్ట్ర మంత్రుల బృందం పర్యటించనుంది.. ఈ నేపథ్యంలో ప్రగతి ప్రణాళికలను సమీక్షించి అమలు వేగవంతం చేయాలని భక్తజనం విన్నవిస్తోంది.

**వసతులు మెరుగుపడాలి**

శ్రీశైల క్షేత్రానికి 4,433 ఎకరాల భూమి ఉంది. రెండేళ్ల కిందట అటవీ, రెవెన్యూ శాఖలు, దేవస్థానం అధికారులు సంయుక్తంగా సమగ్ర భూ సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. ప్రస్తుతం 900 ఎకరాల్లో శ్రీశైల క్షేత్రం విస్తరించి ఉంది.

ప్రస్తుతమున్న తాత్కాలిక క్యూ కంపార్ట్‌మెంట్లు రద్దీ రోజుల్లో భక్తులకు సరిపోవడం లేదు. ఆలయానికి సమీపంలోనే రూ.51 కోట్లతో తితిదే తరహా నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మించాలన్న నిర్ణయాన్ని వేగవంతం చేయాలి.

శ్రీశైలంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో దశాబ్దాల కిందట హరితా రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనిని తొలగించి కొత్తగా గ్రౌండ్ ఫ్లోర్‌లో నూతన రెస్టారెంట్, 50 ఏసీ వసతి గదులు నిర్మిస్తున్నారు. ఇక్కడ మరింత స్థలం కేటాయిస్తే మరిన్ని వసతులు కల్పించడానికి వీలుంది.

**సున్నిపెంట ప్రగతి ఎంతో అవసరం**

శ్రీశైలం చెంతనే ఉన్న సున్నిపెంట గ్రామాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే సుమారు రూ.70 కోట్లతో సున్నిపెంటలో దేవస్థానం ఉద్యోగుల నివాస భవనాలు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి.

శ్రీశైలంలో ఆలయానికి చుట్టుపక్కల ఉన్న నివాసాలను సున్నిపెంటకు తరలించాలన్న ప్రతిపాదన ఉంది. ఇప్పటికే సున్నిపెంటలో పేదలకు మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఆహ్లాదం పంచాలి**

శ్రీశైలంలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఆధ్యాత్మిక, పర్యాటక థీమ్ పార్కులు తీర్చిదిద్దాలి. 2000లో ఏర్పాటు చేసిన ఏరియల్ రోప్‌వేను విదేశాల తరహాలో ఆధునికీకరించాలన్న ప్రతిపాదన ఉంది. దీనివల్ల దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే వీలు కలుగుతుంది. దోమలపెంట (తెలంగాణ) నుంచి శ్రీశైలంలోని రుద్రపార్కు వరకు కొత్తగా రోప్‌వే ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది.

**తీరాలి ట్రాఫిక్ కష్టాలు**

ముఖద్వారం నుంచి హఠకేశ్వరం, సాక్షి గణపతి, శ్రీశైలం వరకు ఉన్న ఇరుకైన రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనకు అడుగులు పడాలి.సున్నిపెంట నుంచి శ్రీశైలానికి 2.5 కి.మీ దూరం వరకు వంతెన నిర్మించడానికి ప్రతిపాదన ఉంది. అటవీశాఖ సహకారంతో దీనిని త్వరగా చేపడితే రాకపోకలు సులభతరం కానున్నాయి.

# కట్టేయ్.. అడిగేదెవరు

తిరుపతి : నగరాలు, పట్టణాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతుండగా.. మరికొందరు అనధికారికంగా నిర్మాణాలు చేపట్టి నగరాలు, పట్టణాల ఆదాయానికి గండికొడుతున్నారు. వీరికి ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చిత్తూరు జిల్లాలో నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం మున్సిపాలిటీలు, చిత్తూరు నగర పాలక సంస్థలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్‌తో పాటు పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ నగరాలు, పట్టణాల్లో ఏటా వందల సంఖ్యలో అనధికార కట్టడాలు వెలుస్తున్నాయి. వాటిని గుర్తించి అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం అటువైపు దృష్టి సారించడం లేదు. దీంతో అనధికారిక కట్టడాల సంఖ్య ఏటా పెరుగుతోంది. వీటిని నియంత్రించకపోతే భవిష్యత్తులో నగరాలు, పురపాలికల్లో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

ఇటీవల తిరుపతిలో ఓ కార్పొరేటర్ అనుమతులు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారు. వాటిని అధికారులు కూల్చడానికి వెళ్తే.. ఆ పార్టీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి తిరుపతిలో 60 శాతం నిర్మాణాలు



అనధికారికంగా చేపట్టినవేనని, వాటిని తొలగించాక, మా పార్టీ కార్పొరేటర్ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని చెప్పడం గమనార్హం. దీన్నిబట్టి నగరాలు, పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో ఆయన మాటలే చెబుతున్నాయి.

తిరుపతి నగరంలో ప్రభుత్వ భూములు, కాల్వ పోరంబోకు, 22(ఏ) నిషేధిత జాబితాలోని భూములు, కుంటలు, తితిదే స్థలాలు ఎక్కువ. ప్రభుత్వం ఈ భూముల్లో నిర్మించే కట్టడాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వదు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణదారులు నగరపాలకసంస్థ అధికారులతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని అనధికారికంగా నిర్మాణాలు పూర్తిచేస్తున్నారు. నగర పరిధిలోని తిమ్మినాయుడు పాళెం, అక్కారంపల్లి, కొంకా చెన్నాయగుంట, మంగళం, తిరుపతి నగర సర్వే, గ్రామీణ సర్వేలో 10,683 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయి. కొర్లగుంట, రెడ్డీ అండ్ రెడ్డీ కాలనీ, రైల్వే కాలనీ, చింతలచేను, శివజ్యోతినగర్, యశోదానగర్, భవానీ నగర్ గిరిపురం తదితర ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులు అరుదుగా లభిస్తాయి. ఈ నేపథ్యంలో అనధికారిక నిర్మాణాలను చేపడుతున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడవుతోంది.చిత్తూరు నగరంలో అనధికార కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో ఈ అక్రమ నిర్మాణాలు సాగుతుండటం గమనార్హం. అయితే నగరపాలికలోని ప్రణాళికా విభాగం అధికారులకు ఇదంతా తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**కఠిన చర్యలు తీసుకుంటాం..**

నగరాలు, పట్టణాల్లో అక్రమ కట్టడాలు వివరాలు ఆరాతీస్తాం. ఆయా నగరాలు, పట్టణాల్లో ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎన్ని నిర్మించారు. వాటి లెక్కలు తేలాక కఠినంగా వ్యవహరిస్తాం. పట్టించుకోని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# మట్టే బంగారమాయెనే..!

చిత్తూరు : ప్రభుత్వం మారినా మట్టి మాఫియా దందా యధేచ్ఛగా కొనసాగుతోంది. కుంటలు, చెరువులు, కొండలను, అటవీ భూములను తవ్వి మట్టిని అమ్ముకుంటున్నారు. మట్టి మాఫియా చదును చేసిన కొండలను కబ్జాదారులు ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. మండలంలోని డీఎంపురం, నిశ్శంకదుర్గం, ఎల్ఆర్‌పేట, గోపిశెట్టిపల్లి పరిసర ప్రాంతాల్లో కొండలు, చెరువులను తవ్వి మట్టిని తమిళనాడుకు తరలిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. నిశ్శంకదుర్గం పరిసర ప్రాంతంలోని తమిళనాడు సరిహద్దులో జాతీయ రహదారి నిర్మాణ పనుల నిమిత్తం గనులశాఖ అధికారుల నుంచి తాత్కాలిక అనుమతులు పొంది మట్టిని అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో దళారులు జేసీబీలతో కొండల్ని తవ్వి మట్టిని ప్రైవేటు వ్యక్తులకు, ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కళ్లెదుటే మట్టి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారు. మట్టి మాఫియా చదును చేసిన ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులు ఆక్రమించి డీకేటీ పట్టాలను పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నోటీసు బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# చేపకు కాటు.. ఆక్రమణలకు చోటు

నందికొట్కూరు: రూ.5 కోట్ల విలువైన ఖాళీ స్థలంపై వైకాపా నాయకుడు కన్నేశారు. అక్కడ చెట్లన్నీ తొలగించి పొలాన్ని చదును చేసి ఐదెకరాలు ఆక్రమించేశారు. చేప పిల్లల పెంపకానికి తంగడంచ సీడ్ ఫామ్ భూముల్లోని 10 ఎకరాల్లో ఇంక్యుబేటర్‌కు షెడ్డు, యంత్రాలతో పాటు 25 బెడ్లను, సిబ్బంది కోసం ఆరు గదుల క్వార్టర్స్‌ను మత్స్యశాఖ నిర్మించింది. కేసీకెనాల్, బోరు నీటి ఆధారంగా చేపగుడ్లను ఇంక్యుబేటర్‌లో ఉంచి పిల్లలను ఉత్పత్తి చేసి బెడ్లలో వదిలి పెంపకాన్ని చేపట్టేవారు. సంబంధిత శాఖ నిర్లక్ష్యం కారణంగా చేప పిల్లల పెంపకం నిలిచిపోవడంతో ఏళ్లపాటు భవనాలు, యంత్రాలు అన్నీ నిరుపయోగంగా మారాయి. దీన్ని అదునుగా చేసుకొని తాటిపాడుకు చెందిన వైకాపానేత గత ప్రభుత్వ హయాంలో అధికారుల అండదండలతో అన్నింటినీ ఆక్రమించేశారు. అక్కడున్న చెట్లను తొలగించి చదునుచేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి క్వార్టర్స్ వద్ద పశువుల పెంపకం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

# చీర కట్టి అందంగా మృణాల్

తెలుగు ప్రేక్షకులకు సీతారామం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ ఆ వెంటనే హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ సినిమాల్లో నటించింది. విజయ్ దేవరకొండతో కలిసి నటించిన ఫ్యామిలీ స్టార్ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. అయినా మృణాల్ క్రేజ్ మాత్రం తగ్గలేదు. వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. తెలుగులో అడవి శేష్‌తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. ఆ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాతో పాటు హిందీలోనూ ఈ అమ్మడు రెండు మూడు సినిమాలు చేస్తుంది. సౌత్‌లో ఈ అమ్మడికి మంచి డిమాండ్ ఉంది. కానీ బాలీవుడ్ సినిమాల్లో నటించాలనే ఆసక్తిని కనబర్చుతోంది. హీరోయిన్‌గా ఎంట్రీకి ఇవ్వడానికి ముందు హిందీలో సీరియల్స్‌లో ఈమె నటించింది. సుదీర్ఘ కాలం పాటు బుల్లి తెరపై, అటు నుంచి వెండి తెరపై ఎంట్రీ ఇచ్చిన మృణాల్ ఠాకూర్ చాలా కాలం పాటు హిట్ కోసం కష్టపడింది. బాలీవుడ్‌లో సరైన బ్రేక్ దక్కలేదు. కానీ తెలుగులో చేసిన సీతారామం సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం ద్వారా



బాలీవుడ్‌లోనూ ఈ అమ్మడికి మంచి గుర్తింపు లభించి అక్కడ ప్రస్తుతం మూడు నాలుగు సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. బాలీవుడ్‌లో ప్రస్తుతం క్రేజీ ప్రాజెక్ట్‌లను చేస్తున్న ఈమె సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ తన ఫాలోవర్స్‌కి కన్నుల విందు చేస్తుంది. మృణాల్ ఠాకూర్ తాజాగా క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. విభిన్నమైన ఔట్ ఫిట్ తో రకరకాల మేకోవర్‌తో ఫోటోలు దిగిన మృణాల్ వాటిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ప్రతి ఫోటోలోనూ క్యూట్‌గా, చూపు తిప్పనివ్వకుండా అందంగా మృణాల్ ఠాకూర్ ఉంది. ఇంతటి అందం మృణాల్ కి మాత్రమే సాధ్యం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. మరోసారి మృణాల్ ఠాకూర్ అందమైన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. చీర కట్టులో చాలా అందంగా ఉన్న మృణాల్ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. టాలీవుడ్‌లో మృణాల్ ఓకే చెప్పాలే కానీ వరుసగా ఆఫర్లు వస్తాయి. కానీ బాలీవుడ్‌లో మాత్రమే ఈమె ఎక్కువ సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంది. బాలీవుడ్‌లో ఈమె పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హెూనా హై, సన్నాఫ్ సర్దార్ 2, తుమ్ హెూ తో సినిమాల్లో నటిస్తుంది. ఆ సినిమాలకు సంబంధించిన షూటింగ్ వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఏడాదిలో రెండు మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

# స్టార్ కిడ్ కి టాలీవుడ్ లాంచింగ్ సంతోషమేనా?

బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హా వారసురాలిగా సోనాక్షి సిన్హా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమా దబాంగ్ తో మంచి విజయం అందుకుంది. అటుపై అమ్మడి బాలీవుడ్ కెరీర్ తిరుగు లేకుండా సాగిపోతుంది. ఇప్పటి వరకూ హీరోయిన్ గా ఎన్నో సినిమాలు చేసింది. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించింది. కానీ సోనాక్షి మాత్రం ఇండస్ట్రీలో నటిగా బలమైన ముద్ర మాత్రం వేయలేకపోయింది. తనకన్నా వెనకొచ్చిన వారంతా జాతీయ అవార్డులు అందుకున్నారు. నటిగా ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్నారు. సోలోగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నారు. అలియాభట్, కృతిసనన్, కియారా అద్వాణీ లాంటి వారు ఎంతగా ఫేమస్ అయ్యారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. కానీ సోనాక్షి మాత్రం వాళ్లలో ఫేమస్ కాలేకపోయింది. ప్రతిభావంతురాలైనా? అమ్మడికి ఆవగింజంత



అదృష్టం రాకపోవడం అన్నది శోచనీయం. ఇక వ్యక్తిగత జీవితంలో సోనాక్షి రైటర్ జహీర్ ఇక్బాల్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ధాంపత్య జీవితంలో సంతోషంగా ఉంటుంది. బాలీవుడ్ లో ఒకటి రెండు సినిమాలు కూడా చేస్తుంది. కానీ సోనాక్షికి బ్యాకప్ కి ఇంకా పెద్ద సినిమాలు చేయాలి. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా సోనాక్షి టాలీవుడ్ లో కూడా లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. సుధీర్ బాబు హీరోగా నటిస్తోన్న జటాధర లో నటిస్తోంది. ఇందులో ఓ శక్తివంతమైన పాత్రలో నటిస్తోంది.

దీంతో సోనాక్షి సినిమాల పట్ల ఫ్యాషన్, తనలో డౌన్ టూ ఎర్త్ క్వాలిటీ బయట పడుతుంది. సాధారణంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్లు అంటే? అదే రేంజ్ ఉన్న సినిమాలు ఎంచుకుంటారు. భారీ కాన్వాస్...భారీ బడ్జెట్ అంటూ వంద రకాల ఆలోచనలతో ఉంటారు. కానీ సోనాక్షి అలాంటి వారికి భిన్నమని తెలుస్తోంది. గతంలో సోనాక్షి సిన్హా సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన లింగ సినిమాలో భార్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం ఉన్నా? ఆ పాత్రకు సోనాక్షి పర్ఫెక్ట్ గా సూటవ్వడంతోనే ఆ ఛాన్స్ తీసుకుంది.





# రొమాంటిక్ సీన్స్‌పై కుండ బద్దలు కొట్టిన స్టార్ హీరోయిన్





బాలీవుడ్ సినిమాల్లో ఎప్పటి నుంచో రొమాంటిక్ సీన్స్ కామన్ అయ్యాయి. ముద్దు సీన్స్, బెడ్ రూం సీన్స్ ఒకప్పుడు బాలీవుడ్‌లో ఎక్కువగా ఉండేవి. సౌత్ సినిమాల్లో అలాంటి సన్నివేశాలు తక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు బాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తగ్గకుండా సౌత్ సినిమాల్లోనూ రొమాంటిక్ సీన్స్ ఉంటున్నాయి. కొందరు ఆ సీన్స్‌లో నటించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటే, కొందరు మాత్రం అలాంటి సీన్స్‌ను వ్యతిరేకిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ గత కొంత కాలంగా రొమాంటిక్ సీన్స్‌కి, ముద్దు సీన్స్‌కి నో చెబుతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆ సీన్స్ విషయంలో తన అభిప్రాయంను కుండ బద్దలు కొట్టినట్లు చెప్పుకొచ్చింది. ఇంటర్వ్యూలో కరీనా కపూర్ మాట్లాడుతూ... ఒక సినిమా కథలో రొమాంటిక్ సీన్ అవసరం అంటే నటించేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ కథలో దాన్ని బలవంతంగా ఇరికించే విధంగా మాత్రం ఉండవద్దని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇండియాలో ఇంకా శృంగారం విషయంలో రహస్యం, గోప్యతను మెయింటెన్ చేస్తున్నారు. కనుక ప్రతి ఒక్కరు రొమాంటిక్ సీన్ అనగానే ఏదో తప్పుడు ఉద్దేశంతో చూస్తున్నారు. ఇండియన్స్ ఇంకా ఈ విషయంలో ఓపెన్‌గా ఆలోచించడం లేదు. అందుకే కొందరు సినిమాలో అలాంటి సీన్స్ ఉంటే కచ్చితంగా విమర్శలు చేస్తుంటారు. అంతే కాకుండా చాలా మంది రొమాంటిక్ సీన్స్ విషయంలో తప్పులను వెతికే పని పెట్టుకుంటారని కరీనా అన్నారు. నటీ నటులు రొమాంటిక్ సీన్‌లో కష్టపడి నటించినా దాన్ని ప్రేక్షకులు గుర్తించే తీరు బాగుండటం లేదు. అందుకే అలాంటి సన్నివేశాల్లో నటించాల్సిన అవసరం ఎంత ఉందని తాను ఆలోచిస్తుంటాను అంది. ఇండియాలో రొమాంటిక్ సన్నివేశాలను మరో అర్థం వెతికి మరీ అర్థం చేసుకుంటున్నారు. తద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేయడం, ఆ సన్నివేశాలపై విమర్శలు చేయడం మనం చూస్తూ ఉంటామని, అందుకే కథలో అత్యంత కీలకం అయితే తప్ప అలాంటి సన్నివేశాలు సినిమాలో ఉండక పోవడం మంచిది అనే అభిప్రాయంను కరీనా కపూర్ తనదైన శైలిలో చెప్పడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈమధ్య కాలంలో కమర్షియల్ హీరోయిన్స్‌గా రాణించాలంటే స్కిన్ షో చేయడంతో పాటు, రొమాంటిక్ సీన్స్‌లో నటించాల్సి ఉంటుంది. ముద్దు సన్నివేశాలకు ఓకే చెప్తేనే కమర్షియల్ హీరోయిన్స్‌గా ఆఫర్లు వస్తున్న ఈ రోజుల్లో కరీనా కపూర్ రొమాంటిక్ సీన్స్ అవసరం ఉంటేనే పెట్టాలంటూ వాదించడం విడ్డూరంగా ఉందని కొందరు పెదవి విరుస్తున్నారు. భవిష్యత్తులో అలాంటి సీన్స్‌లో నటించే అవకాశం లేదా అంటూ కరీనాను ప్రశ్నించిన సమయంలో కథను ముందుకు తీసుకు వెళ్లడానికి శృంగార సన్నివేశం ఒక్కటే ముఖ్యం కాదు. కానీ తప్పనిసరిగా అక్కడ ఆ సీన్ అవసరం అనిపిస్తే నటించేందుకు సిద్ధంగానే ఉన్నాను అంటూ చాలా కాలం తర్వాత రొమాంటిక్ సీన్స్‌కు ఓకే చెప్పినట్లుగా వ్యాఖ్యలు చేసింది. పెళ్లి అయి, తల్లిగా మారిన తర్వాత కరీనా కపూర్‌తో అలాంటి సీన్స్‌ను ఏ దర్శకుడు అయినా ప్లాన్ చేస్తాడా అనేది చూడాలి.

# మైత్రి చేతికి 'దిల్‌రూబా' - గ్రాండ్ రిలీజ్ పక్కా!




టాలీవుడ్‌లో తనదైన మాస్ అండ్ లవ్ స్టోరీ మిక్స్‌తో సినిమాలు చేస్తూ, యూత్‌లో మంచి ఫాలోయింగ్ తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం, 'దిల్‌రూబా' అనే మరో విభిన్న ప్రేమకథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. లవ్ స్టోరీస్‌ను డిఫరెంట్ యాంగిల్‌లో చూపించాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ సినిమా, ట్రైలర్ ద్వారా ఆసక్తిని పెంచేసింది. ఈ సినిమా మార్చి 14న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ కాబోతోంది. ఇక మైత్రీ మూవీస్ ఇప్పటికే ఎంతో మంది యంగ్ హీరోల సినిమాలను రిలీజ్ చేసి విజయం సాధించగా, ఇప్పుడు కిరణ్ అబ్బవరం 'దిల్‌రూబా'కి మద్దతుగా నిలవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల 'క' మూవీతో మంచి విజయాన్ని అందుకున్న కిరణ్ అబ్బవరం, తన మార్క్ యాక్షన్, ఎమోషన్స్‌తో మరో బలమైన కథను ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ట్రైలర్‌ను గమనిస్తే, ఇందులో లవ్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్ సమపాళ్లలో మేళవించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఫస్ట్ లుక్, పాటలు ఇప్పటికే మంచి క్రేజ్ తెచ్చుకోగా, నైజాం హక్కులు మైత్రీ మూవీస్ తీసుకోవడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమా మేజర్ హైలైట్ లవ్ అండ్ యాక్షన్ మిక్స్ కానుంది. ట్రైలర్‌లో 'సారీ రా సిద్ధు' అని హీరోయిన్ చెప్పిన డైలాగ్, దానికి హీరో ఇచ్చిన కౌంటర్ ఆసక్తికరంగా మారింది. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో మొదలై, ఫ్యామిలీ ఎమోషనల్ యాంగిల్‌కు మారే కథలో, హీరో పాత్ర చాలా ఇంటెన్స్‌గా ఉండబోతుందని ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోంది. ముఖ్యంగా, కిరణ్ అబ్బవరం గతంలో చేసిన సినిమాల కంటే ఇందులో అతని యాక్షన్ మోడ్ మరింత అగ్రెసివ్‌గా ఉండేలా కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'కన్నా నీ' అనే పాట యూత్‌లో బాగా పాపులర్ అయ్యింది. సంగీత దర్శకుడు సామ్ సీఎస్ అందించిన బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. లవ్ స్టోరీతో పాటు, ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతున్న ఈ సినిమా, థియేటర్లలో మంచి స్పందన తెచ్చుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ సినిమాను విశ్వ కరణ్ దర్శకత్వంలో రూపొందించారు. సరేగామ రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రానికి మ్యూజిక్ కూడా ప్రధాన బలంగా నిలిచేలా ఉంది. ఇక మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఈ సినిమాను నైజాంలో హ్యాండిల్ చేయడం వలన బిజినెస్ పరంగా కూడా సినిమాకు మంచి బూస్ట్ ఇవ్వనుంది.

# ఈమె అందాల ఐశ్వర్యం

కేరళలో పుట్టి పెరిగిన ముద్దుగుమ్మ ఐశ్వర్య మీనన్ తమిళ్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. 2012లో 'కాదలిల్ సోదప్పువదు యెప్పడి'లో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా ప్రేక్షకులకు పరిచయం అయింది. తక్కువ సమయంలోనే కోలీవుడ్‌లో ఈ అమ్మడికి గుర్తింపు లభించింది. 2013 నుంచి వరుసగా తమిళ్ సినిమాలు చేస్తూ వస్తున్న ఐశ్వర్య మీనన్ పలువురు స్టార్ హీరోల సినిమాల్లో కనిపించి అక్కడ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. తమిళ్‌తో పాటు కన్నడ సినిమాలోనూ నటించే అవకాశాన్ని ఐశ్వర్య మీనన్ సొంతం చేసుకుంది. తెలుగులో స్పై, భజే వాయు వేగమ్ సినిమాల్లో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. సోషల్ మీడియాలో 3.2 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఐశ్వర్య మీనన్ రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తద్వార తన ఫాలోవర్స్‌కి వినోదాన్ని పంచుతూ ఉంటుంది. తాజాగా మరోసారి ఐశ్వర్య మీనన్ అందమైన ఫోటోలను షేర్ చేసింది. క్యూట్ ఐశ్వర్య మీనన్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎక్కువ స్కిన్ షో చేయకున్నా ఐశ్వర్య మీనన్ ఫోటోలు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. చూడ్డానికి నాజూకుగా కనిపిస్తూ



ఉండే ఐశ్వర్య మీనన్ మరోసారి తన సుందరమైన లుక్ ఫోటోలను అత్యంత స్టైలిష్‌గా ఉన్న రూపంను ఫోటోల రూపంలో షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే ఐశ్వర్య మీనన్ అందం విషయంలో టాప్ ఉంటుందని, కానీ ఈమెకు దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు, రావాల్సిన ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఈమె నటించిన రెండు సినిమాలు పెద్దగా ఆడలేదు. దాంతో తెలుగులో ఈమెకు మరో ఆఫర్ ఇప్పటి వరకు రాలేదు. ముందు ముందు అయినా తెలుగులో ఈమెకు మంచి గుర్తింపు దక్కాలంటూ ఈ ఫోటోలు చూసిన వారు కామెంట్ చేస్తున్నారు. ఇంతటి అందగత్తెకు కచ్చితంగా మంచి ఆఫర్ దక్కాలనే అభిప్రాయంను మీడియా వర్గాల వారు సైతం వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో బాజూకా అనే మలయాళ సినిమా ఆఫర్‌ను సొంతం చేసుకుంది. చాలా ఏళ్ల క్రితం మలయాళ సినిమాలో నటించిన ఐశ్వర్య మీనన్ అప్పుడు ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అందుకే పెద్దగా ఆఫర్లు రాలేదు. అయినా కూడా ఐశ్వర్యకు మలయాళంలో ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. తమిళంలో ఒక సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఆ సినిమా పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయి. తెలుగులో కూడా ఈమె నటించాలని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు. మరి ఎప్పటికి తెలుగులో ఈ అమ్మడికి ఆఫర్ వస్తుంది అనేది చూడాలి.

# మాళవిక శర్మ బోల్డ్ లుక్స్.. లెగ్స్ అందాలతో స్టన్నింగ్

టాలీవుడ్‌లో గ్లామరస్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న మాళవిక శర్మ తన ఫొటో షూట్స్ తో కుర్రకారును గట్టిగానే ఆకట్టుకుంటుంది. సినిమాల్లో అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియా ద్వారా తన ప్రత్యేకమైన స్టైల్‌ను చూపిస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటోంది. ఇటీవలే ఈ భామ ఓ బోల్డ్ ఫోటోషూట్‌లో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. బ్లాక్ అండ్ వైట్ టోన్‌లో తీసిన ఈ ఫోటో ఆమె స్టన్నింగ్ లుక్స్‌తో వైరల్ అవుతోంది. మూడ్ ఫోటోగ్రఫీకి కొత్త దారులు వేసేలా మాళవిక చూపిన ఎక్స్‌ప్రెషన్స్ అభిమానులను మంత్రముగ్ధులను చేశాయి. 'నేల టికెట్' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన మాళవిక శర్మ, ఆ తర్వాత 'రెడ్' చిత్రంతో సక్సెస్ అందుకుంది. కానీ, అనంతరం ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తమిళ సినిమాలకు వెళ్ళిపోయింది. ఇటీవల 'కాఫీ విత్ కాదల్', 'భీమా', 'హరోం హర' వంటి చిత్రాల్లో నటించినా, అవి పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. దీంతో మాళవిక తన కెరీర్‌ను నడిపించుకునేందుకు కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఫోటోషూట్‌లు,



బ్రాండ్ ప్రమోషన్లతో పాటు, తన గ్లామర్ పిక్స్‌తో సోషల్ మీడియాలో హీట్ పెంచేస్తోంది. తాజాగా వచ్చిన ఈ ఫోటోషూట్ మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఓపెన్ షర్ట్, బోల్డ్ లుక్స్‌తో మాళవిక తన హాట్ సైడ్‌ను చూపిస్తూ, ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. 'కొన్ని మహిళలు అణచివేయబడటానికి కాదు.. వారిని అర్థం చేసుకునే ఎవరో ఒకరు వస్తే వారితో స్వేచ్ఛగా పరిగెత్తడం ఉత్తమం' అంటూ క్యాప్షన్ పెట్టింది. ఈ మాటలు ఆమె గ్లామర్ లుక్స్‌తో మిళితమై నెట్టింట్లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. అభిమానులు ఈ ఫోటోషూట్‌పై లైకులు, కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. గతంలోనూ మాళవిక సోషల్ మీడియాలో చాలా గ్లామరస్ లుక్స్ షేర్ చేసుకుంది. కానీ, ఈ సారి పూర్తి బోల్డ్ స్టైలింగ్‌తో దర్శనమివ్వడం విశేషం. ప్రత్యేకంగా కుర్చుని ఇచ్చిన ఈ స్టన్నింగ్ లుక్స్ ఆమె అట్రాక్షన్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. మాస్ క్యాప్షన్, స్టైల్, లుక్స్ అన్నీ కలిపి మాళవిక ఈసారి ఇంటర్నెట్‌ను షేక్ చేసేసింది. ముఖ్యంగా యూత్ ఫాలోయింగ్ పెంచుకోవడానికి ఇలాంటి ఫోటోషూట్‌లే ప్రధాన కారణం అనే చెప్పాలి. ప్రస్తుతం మాళవిక సినిమాల కంటే, సోషల్ మీడియా ప్రమోషన్లు, బ్రాండ్ షూట్స్ మీద ఎక్కువగా దృష్టి పెడుతోంది. మరి ఆమె భవిష్యత్తులో ఎలాంటి ఆఫర్స్ అందుకుంటుందో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536